
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 16-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 152 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: దశమి రా.12.22 తదుపరి ఏకాదశి, నక్షత్రం: ఆర్ద్ర ఉ.6.46 తదుపరి పునర్వసు, వర్జ్యం: రా.6.36-8.10, దుర్ముహూర్తం: ఉ.8.32-9.20, రా.10.06-10.52, అమృతఘడియలు: తె.4.04-5.38, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.06, సూర్యాస్తమయం: 6.12 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

‘ధనలక్ష్మి’లతోనే దేశం బాగు!



14

వికసిత భారత్ సాధనలో మహిళల ఆర్థిక సాధికారతే కీలకం

ఆ దిశగా ప్రభుత్వాలు బడ్జెట్ పెంచాలి.. డిజిటల్ అక్షరాస్యతను విస్తరించాలి

సంస్థాగతంగా జెండర్ సెన్సిటివ్ బడ్జెట్.. ఆరోగ్యం, విద్య, నైపుణ్యాల్లో సమాన చాన్స్.. మహిళాభ్యున్నతి కోణంలో ‘తిరుపతి డిక్లరేషన్’

చట్టసభల మహిళా సాధికార కమిటీల సదస్సులో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా


తిరుపతిలో ముగిసిన రెండు రోజుల జాతీయ సదస్సు

ప్రధాని, సీఎం తర్వాత కలెక్టర్లే కీలకమైన వ్యక్తులు. జిల్లాల రూపురేఖలు మార్చడంలో వారిదే ప్రధాన బాధ్యత. ప్రభుత్వం రూపొందించిన విధానాలను సక్రమంగా అమలు చేసేది వారే.

రాష్ట్రంలో పనిచేసిన అధికారులు ఆర్బీఐ లాంటి సంస్థలకు వెళ్లారు. నేను అధికారులకు పూర్తి మద్దతు అందిస్తా. విఫలమైతే మాత్రం కఠిన నిర్ణయాలు తీసుకుంటా.

- సీఎం చంద్రబాబు





అమరావతిలో సోమవారం మొదలైన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కలెక్టర్లు, ఉన్నతాధికారులు

బాధ్యత కలెక్టర్లదే

ప్రజల నమ్మకాన్ని మేమే కాదు.. మీరూ నిలబెట్టాలి: సీఎం

మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలి

క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలి

కొత్త కలెక్టర్లు తమను తాము నిరూపించుకోవాలి

విజన్ డాక్యుమెంట్ భగవద్గీత, ఖురాన్, బైబిల్

మంత్రులు ప్రగతిలో భాగస్వాములు కావాలి

శాఖలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి

జిల్లాల ప్రగతి చైర్మన్లుగా వారిని నియమిస్తా

నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల నియామకం

సంక్షేమం దానం కాదు.. సాధికారతకు మార్గం

చెప్పినట్లుగా సూపర్‌సిక్స్ సక్సెస్ చేశాం

ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు సమతూకంగా అభివృద్ధి, సంక్షేమం

యువత ఉపాధి కోసం జాబ్‌మేళాలు

త్వరలో శాశ్వత కులధ్రువీకరణ పత్రాలు

ఆటో డ్రైవర్లకు అక్టోబరు 1న 15 వేలు

తొలి రోజు కలెక్టర్ల సదస్సులో సీఎం స్పష్టీకరణ

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత కలెక్టర్లదేనని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. లక్ష్యాలకు అనుగుణంగా వారు పనిచేయాలన్నారు. మానవీయ కోణంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలు గ్రహించాలని దిశానిర్దేశం చేశారు. కొత్తగా నియమితులైన కలెక్టర్లకు శుభాభినందనలు తెలిపారు. వారు తమను తాము నిరూపించుకోవలసిన అవసరముందన్నారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో రెండు రోజుల కలెక్టర్ల సదస్సును ఆయన ప్రారంభించారు. ఆ సందర్భంగాను, తర్వాత వివిధ రంగాలపై సమీక్షల్లోనూ మాట్లాడారు. అందరినీ సాధికారత దిశగా నడిపిస్తామని చెప్పిన హామీని జనం విశ్వసించి.. ఎన్డీఏకి 94 శాతం స్ట్రైక్ రేటుతో 164 అసెంబ్లీ

మిగతా 13వ పేజీలో...



యూరియా వాడని రైతులకు బస్తాకు 800 ప్రోత్సాహకం

నియంత్రణపై అవగాహన పెంచాలి

అవసరమైతే యూరియా డోర్ డెలివరీ: సీఎం

డ్వాక్రాల పొదుపు 20,739 కోట్లు

8.32 లక్షల సంఘాలు.. 89 లక్షల సభ్యులు

యువతకు ప్రాధాన్యమిస్తున్న అనకాపల్లి కలెక్టర్

12 13

కలెక్టర్ల సదస్సులో దశ దిశ..

ఆ తల్లులకు అత్యధిక లబ్ధి

ఒకరి కంటే ఎక్కువమంది చదువుకునే పిల్లలున్నవారు 21 లక్షల మందికి పైనే

‘తల్లికి వందనం’పై విద్యాశాఖ ప్రజెంటేషన్

విద్యా రుణాలపై 4% వడ్డీ రాయితీ

‘పీఎం విద్యాలక్ష్మి’ 3%తో అనుసంధానం!

17.11 శాతం వృద్ధి లక్ష్యం

తొలి త్రైమాసికంలో 10.5 శాతం వృద్ధిరేటు

15 నెలల్లో 10 లక్షల కోట్లు

122 ప్రాజెక్టులకు అనుమతి

‘మంగళవారం’ పరిశ్రమల వారం

రోడ్లపై గుంతలు ఉండకూడదు

రాష్ట్రంలో రహదారుల పనులు ఆగకూడదు

గ్రామీణ రహదారులకు కనెక్టివిటీ పెంచాలి

అధికారం కోసం అడ్డగోలు సొమ్ము





నోట్ల కట్టలతో వెంకటేశ్ నాయుడు (ఫైల్)

మద్యం ముడుపుల్లో అధిక భాగం ఓట్ల కొనుగోలుకే!

చెవిరెడ్డి ద్వారానే వైసీపీ అభ్యర్థులకు నిధుల పంపిణీ

రూ.3,500 కోట్ల స్కాంలో మరో కోణం తేల్చిన సిట్

ఏసీబీ కోర్టులో మూడో చార్జిషీటు దాఖలు

వెంకటేశ్ నాయుడు, బాలాజీ, నవీన్ పాత్రపైనా వివరణ

కమీషన్లు మార్చుకోవడానికే చెవిరెడ్డి డొల్ల కంపెనీలు

ఆఫ్రికా దేశాల్లో ‘మైనింగ్’లో పెట్టుబడులకు యత్నం

జింబాబ్వేలో కీలక నిందితుల భేటీ

లావాదేవీలు, ఆస్తుల సమాచారం రాబట్టేందుకు మోహిత్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని సిట్ వినతి

> కమీషన్లు కొట్టేసేందుకే మద్యం విధానాన్ని మార్చారు. ముడుపుల సొమ్ములతో ఓట్లు కొనేసి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నించారు. డబ్బు రవాణా కోసం అడ్డగోలుగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఒకటా... రెండా... మద్యం ముడుపుల కేసులో ఎన్నెన్నో చిత్రాలు!

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో జరిగిన రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణంలో.. సింహభాగం ఓట్లు కొనేందుకు ఖర్చు చేసినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తేల్చింది. వైసీపీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి (ఏ-38) తన అనుచరుల ద్వారా ఎన్నోసార్లు కోట్ల రూపాయలు తరలించారని విజయవాడ ఏసీబీ కోర్టులో సోమవారం దాఖలుచేసిన మూడో చార్జిషీటులో పేర్కొంది. ఆ మొత్తం నుంచే ప్రకాశం జిల్లా దర్శి వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి, నెల్లూరు జిల్లా కావలి వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఇంకొందరికి నగదు పంపిణీ చేసినట్లు తెలిపింది. అంతేగాక లిక్కర్ ముడుపుల సొమ్మును వైట్‌గా మార్చుకోవడానికి తిరుపతి కేంద్రంగా చెవిరెడ్డి పలు షెల్ కంపెనీలు సృష్టించారని.. వాటి ద్వారా ఎలాంటి లావాదేవీలూ జరపలేదని కోర్టుకు వివరించింది. చెవిరెడ్డి అక్రమాలకు ఆయన వ్యాపార భాగస్వామి వెంకటేశ్ నాయుడు(ఏ-34), అనుచరులు బాలాజీ కుమార్ యాదవ్ (ఏ-35), ఎద్దల నవీన్ కృష్ణ (ఏ-36) ఏ విధంగా సహకరించారో స్పష్టంగా పేర్కొంది. ఈ కేసులో జూలై 19న ప్రాథమిక అభియోగ పత్రాన్ని విజయవాడ ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన సిట్.. అందులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేరు ప్రస్తావించింది. ఆగస్టు 11న దాఖలు చేసిన రెండో చార్జిషీటు(మొదటి అనుబంధ చార్జిషీటు)లో మరిన్ని కీలక విషయాలు తెలిపింది. మద్యం సిండికేట్ ద్వారా

మిగతా 3వ పేజీలో...

వక్ఫ్ చట్టంలో కీలక నిబంధనల నిలిపివేత!



ఇస్లాంను కనీసం ఐదేళ్లు అనుసరిస్తేనే ఆస్తిని వక్ఫ్‌కు ఇవ్వాలన్న రూలుపై స్టే

కలెక్టర్ నివేదిక ఇచ్చేదాకా ‘వక్ఫ్ ఆస్తి’గా పరిగణించరాదన్న నిబంధనా నిలుపుదల

ముస్లిమేతరులు కేంద్ర వక్ఫ్ బోర్డులో నలుగురు, రాష్ట్ర బోర్డుల్లో ముగ్గురికి మించరాదు

సీజేఐ జస్టిస్ గవాయ్ బెంచ్ మధ్యంతర ఆదేశాలు.. మొత్తం చట్టంపై స్టేకు నిరాకరణ

చట్టాన్ని పూర్తిగా నిలిపివేయడమన్నది అత్యంత అరుదైన కేసుల్లోనేనని వ్యాఖ్య

చట్టం రాజ్యాంగబద్ధతపై తుది వాదనలకు ఈ ఆదేశాలు అడ్డంకి కావని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: వక్ఫ్ (సవరణ) చట్టం 2025పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ చట్టంలోని కొన్ని కీలక నిబంధనలపై స్టే విధించింది. పూర్తిగా చట్టంపై స్టే విధించేందుకు మాత్రం నిరాకరించింది. కనీసం ఐదేళ్లపాటు ఇస్లాంను అనుసరించిన వ్యక్తి మాత్రమే ఆస్తిని వక్ఫ్ చేయడానికి అవకాశం ఉంటుందన్న నిబంధనను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఒక వ్యక్తి ఇస్లాంను అనుసరిస్తున్నట్లు నిర్ణయించేలా నిబంధనలు రూపొందించే వరకు ఇది అమలు కాదని స్పష్టం చేసింది. చట్టంలోని ఇలాంటి పలు కీలక నిబంధనలను నిలిపివేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌ల ధర్మాసనం సోమవారం 128 పేజీల మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. వక్ఫ్ సవరణ చట్టంలోని కొన్ని సెక్షన్లకు కొంతమేరకు రక్షణ అవసరమని వ్యాఖ్యానించింది. “మొత్తం చట్టంపైనే స్టే విధించాల్సిన అవసరం లేదని గుర్తించాం. అత్యంత అరుదైన కేసుల్లో మాత్రమే అలాంటి పరిస్థితి వస్తుంది. వక్ఫ్ చట్టంపైనే స్టే విధించాలన్న అభ్యర్థనలను తిరస్కరిస్తున్నాం” అని ధర్మాసనం తేల్చిచెప్పింది. అయితే, వక్ఫ్ బోర్డులో ముస్లిం సభ్యుల సంఖ్య కచ్చితంగా మెజారిటీలో ఉండాలని, కేంద్ర వక్ఫ్ బోర్డు లేదా కౌన్సిల్‌లో

మిగతా 2వ పేజీలో...

అవకతవకలు ఉంటే బిహార్ ‘సర్’ను పక్కనపెడతాం: సుప్రీంకోర్టు

మహిళల సత్తా!

టీచర్ పోస్టుల్లో సగం వారికే సొంతం

ఉపాధ్యాయులుగా ఎంపికైన 15,941 మంది

మిగిలిన పోస్టులు 406.. మిగులులో కర్నూలు, చిత్తూరు టాప్

జిల్లాల వారీగా ఉద్యోగాలు పొందినవారి జాబితాలు విడుదల

150 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి

19న కొత్త టీచర్లకు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు



కొత్త టీచర్లకు నియామక పత్రాలు ఇచ్చే కార్యక్రమం కోసం అమరావతిలో చేస్తున్న ఏర్పాట్లు

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో 15,941 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. 16,347 పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేయగా అభ్యర్థుల కొరతతో 406 పోస్టులు మిగిలిపోయాయి. టీచర్ ఉద్యోగాలకు ఎంపికైన వారి పేర్ల తుది జాబితాలను మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం ఎక్స్‌లో విడుదల చేశారు. కొత్త టీచర్లకు విద్యాశాఖలోకి ఆహ్వానం పలికారు. అనంతరం విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు సచివాలయంలో

మిగతా 12వ పేజీలో...

ఆర్టీఐహెచ్ సీఈవోగా ధాత్రిరెడ్డి

ఫైబర్ నెట్ ఎండీగా గీతాంజలి శర్మ

3

డ్రోన్ కార్పొరేషన్ ఎండీగా సార్యమాన్ పటేల్

ముగ్గురు ఐపీఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం



ఆన్‌లైన్ రిజర్వేషన్ బుకింగ్‌లకు

ఆధార్ తప్పనిసరి

రైల్వే శాఖ కొత్త నిబంధన

2

తొలి పావుగంటలో బుక్‌చేసే వారికి వర్తింపు

అక్రమార్కుల ఆట కట్టించేందుకే..



విదేశీ నిపుణులను స్వాగతిస్తున్నాం!

భయభ్రాంతులకు గురిచేయడం మా అభిమతం కాదు: ట్రంప్

అక్రమ వలస పేరిట ఇటీవల దక్షిణ కొరియా కార్మికుల నిర్బంధం

అమెరికాలో పెట్టుబడులపై మా సంస్థలు ఆలోచిస్తాయి.. జాగ్రత్త

దక్షిణ కొరియా హెచ్చరిక

అమెరికా అధ్యక్షుడి దిద్దుబాటు చర్య

వాషింగ్టన్, సెప్టెంబరు 15: అక్రమ వలసల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, దక్షిణ కొరియా హెచ్చరికల దెబ్బకు దిగొచ్చారు. తమ దేశ కంపెనీల్లో విదేశీ ఉద్యోగులను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. వారిని భయభ్రాంతులకు గురిచేయడం తన అభిమతం కానే కాదని అన్నారు. పదిరోజుల క్రితం జార్జియాలో దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ కంపెనీ ప్లాంట్‌లో ఆ దేశ వాసులు అక్రమంగా పనిచేస్తున్నారన్న సమాచారం అందడంతో అక్కడ దాడులు నిర్వహించి.. 475 మందిని నిర్బంధించినట్లు అమెరికా అధికారులు

మిగతా 2వ పేజీలో...

చైనాకు కౌంటర్‌గా ఎత్తైన డ్యామ్!

అరుణాచల్‌లో దిబాంగ్ ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభం

2

డ్రాగన్ ‘మెగా ప్రాజెక్టు’కు పోటీ.. బిడ్ దాఖలు చేసిన ఎన్‌హెచ్‌పీసీ

2032కి పూర్తి లక్ష్యం.. విద్యుదుత్పత్తి, వరద నియంత్రణ కోసమే



బిహార్‌లో ఓ ఎన్నికల సభలో ప్రధాని మోదీ, నితీశ్

బిహార్‌లోకి చొరబాట్లు..

పాపం కాంగ్రెస్‌దే

వాళ్లందరినీ పంపించివేస్తున్నాం

2

బీడీ.. బిహార్ అంటూ అవమానిస్తారా?: మోదీ

రష్యా కష్టం.. మనకు లాభం!

ఉక్రెయిన్ దాడులతో దెబ్బతింటున్న రష్యా చమురుశుద్ధి కర్మాగారాలు

మార్కెట్లో దొరుకుతున్న బ్రెంట్ క్రూడాయిల్ కన్నా తక్కువ ధరకే..

ఆ చమురును కొని శుద్ధి చేసి, అమ్మి లాభపడుతున్న భారత రిఫైనరీలు



న్యూఢిల్లీ: ఒకరి నష్టం.. మరొకరికి లాభంగా మారుతోంది! ఒకరి సంక్షోభం.. మరొకరికి అవకాశమై సిరులు కురిపిస్తోంది!! నిష్ఠురంగా అనిపించినా ఇది నిజం!! తమపై దండెత్తిన రష్యాను ఆర్థికంగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఆ దేశ చమురుశుద్ధి కర్మాగారాల (రిఫైనరీల)పై ఉక్రెయిన్ జరుపుతున్న డ్రోన్ దాడులు

మిగతా 2వ పేజీలో...

మొదటి పావుగంటలో రిజర్వేషన్లకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

» రైల్వే శాఖ కొత్త రూల్.. అక్టోబరు 1 నుంచి అమలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: టిక్కెట్ల రిజర్వేషన్లలో అక్రమార్కుల ఆటకట్టించడానికి రైల్వేశాఖ మరో నిర్ణయం తీసుకొంది. జనరల్ కోటా టిక్కెట్ల రిజర్వేషన్ల బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ఓపెన్ అయిన మొదటి 15 నిమిషాల్లో టిక్కెట్లు తీసుకోవాలంటే ఆ వెబ్‌సైట్‌కు ఆధార్ అనుసంధాన్ని తప్పనిసరి చేసింది. అంటే ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌కు ఆధార్‌ను లింక్ చేసుకున్నవారికే మొదటి 15 నిమిషాల్లో టిక్కెట్లు లభిస్తాయి. ఈ నూతన నిబంధన అక్టోబరు ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానుంది. రిజర్వేషన్ల బుకింగ్‌లకు మొదటి 15 నిమిషాల్లోనే డిమాండు అధికంగా ఉండడంతో దాన్ని అక్రమార్కులు అవకాశంగా తీసుకోకుండా ఉండేందుకు ఈ ఏర్పాటు చేసింది. అనంతరం ఆధార్ అనుసంధానం లేనివారు కూడా రిజర్వేషన్లు తీసుకోవచ్చు. ఇంతవరకు తత్కాల్ టిక్కెట్లకే పరిమితమైన నిబంధనను ఇకపై జనరల్ టిక్కెట్లకు కూడా వర్తింపజేసింది. ఉదాహరణకు ఎవరైనా నవంబరు 15 కోసం రిజర్వేషన్లు చేయాలనుకుంటే అందుకు సంబంధించి 60 రోజులు ముందుగా అంటే సెప్టెంబరు 16వ తేదీ ఉదయం 12.20 గంటలకు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ఓపెన్ అవుతుంది. 12.20 గంటల నుంచి 12.35 గంటల వరకు కేవలం ఆధార్ వెరిఫికేషన్ ఉన్న ప్రయాణికులు మాత్రమే టిక్కెట్లు బుక్ చేసుకోగలుగుతారు. కీలకమైన ఈ 15 నిమిషాల వ్యవధిలో ఆధార్ అనుసంధానంలేని వారికి బుక్ చేసుకునే అవకాశం ఉండదు. పండగ సమయాల్లో టిక్కెట్ల డిమాండు అత్యధికంగా ఉండడాన్ని గమనించి, అక్కడ అక్రమాలు జరగకుండా నిరోధించడానికి ఈ ఏర్పాటు చేసింది. అందువల్ల అక్టోబరు ఒకటో తేదీ లోగా ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌తో ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని ప్రయాణికులకు రైల్వే శాఖ సూచించింది.

ఏఐ కంటెంట్ క్రియేటర్లకు లైసెన్స్!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: ప్రస్తుత ఏఐ యుగంలో ఏ ఫొటో అసలైనదో.. ఏది కృత్రిమ మేధతో సృష్టించిందో, ఏ వీడియో రియలో.. ఏది ఫేకో గుర్తు పట్టలేని పరిస్థితి తయారైంది. దీంతో, తప్పుడు సమాచార వ్యాప్తి బాగా పెరిగింది. దీన్ని కట్టడి చేసేందుకు కమ్యూనికేషన్స్, ఐటీపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్థాయీ సంఘం కీలక సిఫారసులు చేసింది. ఏఐ కంటెంట్ క్రియేటర్లకు లైసెన్స్ తప్పనిసరి చేయాలని సూచించింది. లైసెన్స్ ఉన్నవారే ఏఐ కంటెంట్ క్రియేట్ చేయాలని, లైసెన్స్ లేకుండా ఏఐ కంటెంట్ రూపొందించి తప్పుడు ప్రచారం చేసేవారిని గుర్తించి శిక్షించేందుకు కఠినమైన నిబంధనలు ఉండాలని పేర్కొంది. దీంతో పాటు, ఏఐతో రూపొందించిన ఫొటో అయినా, వీడియో అయినా, వార్తా కథనం అయినా.. దానికి 'ఏఐతో రూపొందించారు' అని ట్యాగ్ కచ్చితంగా జతచేయాలని సూచించింది. బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే నేతృత్వంలోని స్థాయీ సంఘం ఈ మేరకు ఇటీవల లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు తన నివేదికను అందజేసింది. ఈ సిఫారసులు అమల్లోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాల్సి ఉంటుంది.

రూ.కోటి రివార్డున్న మావోయిస్టు ఎన్‌కౌంటర్

రాంచీ, సెప్టెంబరు 15: జార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లా పంతిత్రి అడవుల్లో సోమవారం జరిగిన ఎదురుకాల్పుల్లో రూ.కోటి రివార్డున్న మావోయిస్టు ఒకరు హతమయ్యారు. అదేవిధంగా మరో ఇద్దరు మావోయిస్టులు కూడా కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. వీరిపైనా రూ.25 లక్షలు, రూ.10 లక్షలు చొప్పున రివార్డులు ఉన్నాయని వెల్లడించారు. జార్ఖండ్ ఐజీ(ఆపరేషన్స్) మైఖేల్ రాజ్ మీడియాతో మాట్లాడుతూ.. "ఇంటెలిజెన్స్ సమాచారంతో హజారీబాగ్, గిరిధి పోలీసులు కోబ్రా దళాలతో పంతిత్రి అడవుల్లో ఆదివారం రాత్రి నుంచి మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భద్రతా దళాలను చూడగానే సోమవారం ఉదయం 6 గంటల సమయంలో మావోయిస్టులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా దళాలు ఎదురుకాల్పులకు దిగాయి. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో రూ.కోటి రివార్డు ఉన్న నిషేధిత సీపీఐ(మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు సహదేవ్ సోరేన్ అలియాస్ ప్రవేశ్, స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు, రూ.25 లక్షల రివార్డు ఉన్న రఘునాథ్ హేంబ్రం అలియాస్ చంచల్, జోనల్ కమిటీ సభ్యుడు, రూ.10 లక్షల రివార్డు ఉన్న బిర్సేన్ గంఝు ఉన్నారు." అని వివరించారు.

చైనాకు కౌంటర్‌గా ఎత్తైన డ్యామ్!

» అరుణాచల్‌లో దిబాంగ్ ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: చైనా మెగా ప్రాజెక్టుకు కౌంటర్‌గా అరుణాచల్‌ప్రదేశ్‌లో చేపట్టనున్న అతిపెద్ద డ్యామ్ దిబాంగ్ బహుళార్థసాధక ప్రాజెక్టు పనులను భారత్ ప్రారంభించింది. ప్రధాన డ్యామ్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌హెచ్‌పీసీ లిమిటెడ్ రూ.17,069 కోట్లతో బిడ్ దాఖలు చేసింది. అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దు టిబెట్ భూభాగంలోని యార్లంగ్ త్సాంగ్పో నదిపై చైనా ఒక మెగా ప్రాజెక్టు నిర్మాణ పనులను ప్రారంభించిందన్న వార్తల నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. భారత్ చేపట్టిన ప్రాజెక్టు.. చైనా డ్యామ్ నుంచి ఒకవేళ అకస్మాత్తుగా నీరు విడుదలైతే ఒక అడ్డుగోడలా నిలుస్తుందని, భారత భూభాగాలు వరద బారిన పడకుండా కాపాడుతుందని భావిస్తున్నారు. భారత వ్యూహాత్మక భద్రతలో భాగమైన ఈ దిబాంగ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని టెండర్ ప్రకారం 91 నెలల్లో పూర్తి చేయాలని, 2032 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎన్ఎన్-న్యూస్18 నివేదించింది. 278 మీటర్ల ఎత్తులో ఇది దేశంలోనే ఎత్తైన ఆనకట్ట కానుంది. దీని ద్వారా ఏడాదికి 11,223 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి కానుంది. 2,880 మెగావాట్ల దిబాంగ్ బహుళార్థసాధక ప్రాజెక్టుకు ప్రధాని మోదీ గతేడాది శంకుస్థాపన చేశారు.

75% హాజరు ఉంటేనే పరీక్షలకు అనుమతి

» పది, పన్నెండో తరగతి పరీక్షలపై సీబీఎస్ఈ నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: సీబీఎస్ఈ విద్యార్థులు పది, పన్నెండో తరగతి పరీక్షలు రాయాలంటే ఇకపై 75 శాతం హాజరు తప్పనిసరి. ఈ మేరకు కఠినంగా వ్యవహరించాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్ణయించింది. జాతీయ విద్యావిధానం-2020 ప్రకారం ఇంటర్నల్ అసెస్మెంట్ తప్పనిసరి. హాజరుశాతం సరిగా లేని విద్యార్థుల ఇంటర్నల్ అసెస్మెంట్ అసాధ్యం కావడంతో సీబీఎస్ఈ బోర్డ్ ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. హాజరు శాతం పెరగడం ద్వారా విద్యార్థులు క్లాస్‌రూం కార్యక్రమాలతో ప్రయోజనం పొందుతారని భావిస్తున్నారు.

ఆద్యంతం నిర్లక్ష్యమే..!

» బైక్‌ను ఢీకొట్టిన బీఎండబ్ల్యూ కారు డ్రైవర్

» నిందితురాలి అరెస్టు..



నవ్‌జ్యోతి సింగ్, గగన్‌ప్రీత్ కౌర్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: శరీరం గగుర్పొడిచే రీతిలో నిర్లక్ష్యంగానూ, వేగంగానూ బీఎండబ్ల్యూ కారు నడిపి వ్యక్తి మరణానికి కారణమైన వ్యక్తి తీరు అద్యంతం అనుమానాస్పదంగా మారింది. ఆదివారం ఢిల్లీలోని బంగ్లా సాహెబ్ గురుద్వారాను దర్శించుకుని తిరిగి భార్య సందీప్ కౌర్‌తో కలిసి కేంద్ర ఆర్థికశాఖ డిప్యూటీ కార్యదర్శి నవ్‌జ్యోతి సింగ్ (52) వెళుతున్న మోటారు సైకిల్‌ను రింగురోడ్డు సమీప కంటోన్మెంట్ మెట్రో స్టేషన్ వద్ద వేగంగా దూసుకొచ్చిన బీఎండబ్ల్యూ కారు ఢీకొట్టింది. దీంతో నవ్‌జ్యోతి సింగ్ (52) తలకు తీవ్ర గాయాలతో స్పృహ కోల్పోగా, భార్య సందీప్ కౌర్ గాయ పడ్డారు. ప్రమాద సమయంలో గగన్ ప్రీత్ కౌర్ అనే మహిళ డ్రైవింగ్ చేస్తున్నారు. తర్వాత ఆమె క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినా పలు పొరపాట్లు చేశారు. అక్కడికి 4 కి.మీ విస్తీర్ణంలో 11 కార్పొరేట్ ఆస్పత్రులున్నా.. కాదని 20 కి.మీ. దూరంలోని న్యూలైఫ్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నవ్‌జ్యోతి సింగ్ మృతి చెందాడని ఆ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శకుంతలా కుమార్ తెలిపారు. ప్రమాదం మధ్యాహ్నం 1.30 గంటలకు జరిగితే ఆస్పత్రికెళ్లడానికి అర్ధగంట పట్టింది. ఘటనాస్థలానికి దగ్గర్లోని ఎయిమ్స్, రామ్ మనోహర్ లోహియా, ఆర్మీ ఆస్పత్రులకు తీసుకెళ్లినా వైద్యులు ప్రాణాలు కాపాడేవారని మృతుడి బంధువు శైలేంద్ర, కొడుకు నవ్‌నూర్ సింగ్ వాపోయారు. సదరు న్యూలైఫ్ ఆస్పత్రి చాలా చిన్నదని నవ్‌నూర్ సింగ్ చెప్పారు.

వక్ఫ్ చట్టంలో కీలక నిబంధనల నిలిపివేత!



(మొదటి పేజీ తరువాయి)

ఉండే 20 మంది సభ్యుల్లో ముస్లిమేతరుల సంఖ్య నాలుగుకు మించరాదని చెప్పింది. ఇక రాష్ట్రాల బోర్డుల్లో మొత్తం 11 మంది సభ్యుల్లో ముగ్గురికి మించి ముస్లిమేతరులు ఉండరాదని తేల్చిచెప్పింది. వక్ఫ్ బోర్డుకు ప్రధాన కార్యనిర్వాహక అధికారి (సీఈవో) నియామకం, ఇతర సర్వీసు నిబంధనలు నిర్ణయించడానికి సంబంధించిన సెక్షన్ 23పై మాత్రం స్టే విధించలేదు. కానీ, బోర్డు సీఈవోగా ముస్లిం వ్యక్తే ఉండడం మంచిదని తెలిపింది. అలాగే వివాదాస్పద ఆస్తిపై సంబంధిత అధికారి (కలెక్టర్) నివేదిక ఇచ్చేదాకా దాన్ని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదన్న నిబంధనపైనా స్టే విధించింది. ఆస్తి ప్రభుత్వానిదిగా సంబంధిత అధికారి పేర్కొంటే, దానికి సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో సవరణలు చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలన్న నిబంధనను కూడా నిలిపివేస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టం-2025ను పూర్తిగా నిలిపివేయాలంటూ సుప్రీంకోర్టులో దాదాపు 100కు పైగా పిటిషన్లు దాఖలయ్యాయి. ముస్లింల ఆస్తులను లాగేసుకునేందుకే ఈ చట్టాన్ని తెచ్చారని పిటిషనర్లు ఆరోపించారు. కేంద్రం మాత్రం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను రక్షించడానికే చట్టాన్ని సవరించామని వాదించింది. స్పందించిన ధర్మాసనం.. ప్రస్తుతం తాము జారీ చేసిన ఆదేశాలు మధ్యంతర ఉత్తర్వులని స్పష్టం చేసింది. చట్టం రాజ్యాంగబద్ధతపై తుది వాదనల సందర్భంగా పిటిషనర్లు, కేంద్రం పూర్తిస్థాయిలో తమ వాణిని వినిపించకుండా ఇవి అడ్డుకోజాలవని తెలిపింది.

రాజ్యాంగ విలువలకు విజయం:విపక్షాలు

వక్ఫ్ సవరణ చట్టంలోని కీలక నిబంధనల అమలును తాత్కాలికంగా నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రతిపక్షాలు స్వాగతించాయి. న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువలకు లభించిన విజయంగా దీనిని అభివర్ణించాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సోమవారం ఎక్స్‌లో స్పందిస్తూ.. 'మన దేశం దీర్ఘకాలం కిందటే పరిష్కరించుకున్న సమస్యలను తిరగదోడటానికి, మతపరమైన విద్వేషాగ్నిని రగిలించటానికి, ప్రజల మధ్య చీలికలు తీసుకురావటానికి బీజేపీ ఈ చట్టం తీసుకొచ్చింది' అని దుయ్యబట్టారు. వక్ఫ్ బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ సంఘంలో సభ్యుడు, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నజీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. దేశంలోని మైనారిటీ ప్రజల హక్కులకు రాజ్యాంగం కల్పించిన రక్షణలను సుప్రీంకోర్టు తన ఆదేశాల ద్వారా పునరుద్ఘాటించిందన్నారు. ధర్మాసనం ప్రస్తుతం స్టే విధించిన 3 క్లాజులను కాంగ్రెస్‌పార్టీ తొలి నుంచీ వ్యతిరేకిస్తోందని గుర్తు చేశారు. ఏ సంస్కరణ అయినా రాజ్యాంగానికి విధేయంగా ఉండాలని, సంప్రదింపులకు అవకాశం కల్పించాలని, పారదర్శకంగా ఉండాలన్నది కాంగ్రెస్ పార్టీ వైఖరని, సుప్రీంకోర్టు ఆదేశాలు దీనినే ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టంలోని వివాదాస్పద అంశాలపై సుప్రీంకోర్టు స్టే విధించటాన్ని స్వాగతిస్తున్నామని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు స్టేపై ప్రముఖ ఇస్లామిక్ సంస్థ 'జమైత్ ఉలేమా ఎ హింద్' అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదానీ స్పందిస్తూ.. 'దేశంలోని ప్రతీ పౌరుడికీ సమానమైన హక్కులను, మతస్వేచ్ఛను ఇచ్చిన రాజ్యాంగం మీద వక్ఫ్ చట్టం ఒక ప్రత్యక్ష దాడి వంటిది. ముస్లింల మతస్వేచ్ఛను లాక్కొనే కుట్రలో భాగంగానే ఈ ప్రమాదకరమైన చట్టం తెచ్చారు. ఈ చట్టంపై సుప్రీంకోర్టు తాత్కాలిక నిలుపుదల విధించటం ద్వారా మాకు న్యాయం బతికే ఉందన్న నమ్మకం కలిగింది. మొత్తంగా చట్టాన్నే కోర్టు కొట్టేస్తుందని భావిస్తున్నాం' అన్నారు.

ప్రజాస్వామ్యానికి శుభసంకేతం: రిజిజు

సుప్రీంకోర్టు తీర్పు ప్రజాస్వామ్యానికి శుభ సంకేతమని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు పేర్కొన్నారు. పార్లమెంటులో సుదీర్ఘమైన చర్చల తర్వాతే వక్ఫ్ చట్టాన్ని తీసుకొచ్చామని, దాంట్లోని పలు అంశాలు యావత్ ముస్లిం సమాజానికి, ముఖ్యంగా పేద ముస్లిం సోదరులు, మహిళలకు ఉపయోగపడేవన్నారు. వక్ఫ్ బోర్డు ద్వారా ఆస్తుల దురాక్రమణ వంటి వాటికి కూడా ఈ చట్టం అడ్డుకట్ట వేస్తుందన్నారు. ఈ విషయమంతా సుప్రీంకోర్టుకు తెలుసన్నారు.

అవకతవకలు గుర్తిస్తే బిహార్ ఎస్ఐఆర్‌ను పక్కనపెడతాం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: బిహార్‌లో నిర్వహించిన సమగ్ర ఓటర్ల సర్వే(ఎస్ఐఆర్)లో అవకతవకలు జరిగినట్టు ఏ దశలో గుర్తించినా మొత్తం ప్రక్రియను పక్కన పెడతామని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. అయితే, దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించకుండా ఎన్నికల సంఘాన్ని అడ్డుకోబోమని స్పష్టం చేసింది. సోమవారం ఈ అంశంపై విచారణ జరిపిన ధర్మాసనం ఎస్ఐఆర్ చెల్లుబాటుపై తుది వాదనలను అక్టోబరు 7వ తేదీకి వాయిదా వేసింది. ఈ అంశంపై ముక్కలు ముక్కలుగా అభిప్రాయాన్ని వెల్లడించేందుకు ధర్మాసనం నిరాకరించింది. బిహార్ ఎస్ఐఆర్‌పై తాము వెల్లడించనున్న తీర్పు మొత్తం పాన్-ఇండియా ఎస్ఐఆర్‌కు వర్తించనుందని ప్రకటించింది. బిహార్ ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పిటిషన్లు వేసినవారిని అక్టోబరు 7న పాన్-ఇండియా ఎస్ఐఆర్‌పైనా వాదనలు వినిపించేందుకు అనుమతించింది.



విదేశీ నిపుణులను స్వాగతిస్తున్నాం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. వీరిలో దక్షిణ కొరియాకు చెందిన కార్మికులే ఎక్కువగా ఉన్నారు. ఆ కార్మికులను గొలుసులతో బంధించిన దృశ్యాలపై దక్షిణ కొరియాలో తీవ్ర ఆందోళనలు నెలకొన్నాయి. 12న ఆ కార్మికులను అమెరికా నుంచి దక్షిణ కొరియా తమ దేశానికి తరలించుకుపోయింది. అయితే ఇది జరగడానికి ఒకరోజు ముందే తమ కార్మికుల పట్ల అమెరికా వ్యవహరించిన తీరుపై దక్షిణ కొరియా అధ్యక్షుడు లీజే మ్యూంగ్ తీవ్రంగా స్పందించారు. హ్యుందాయ్ ప్లాంట్‌లో దాడులు తమను దిగ్భ్రాంతికి గురిచేశాయని.. మున్ముందు తమ దేశ కంపెనీలు అమెరికాలో పెట్టుబడులు పెట్టేందుకు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ సోమవారం ట్రుత్ వేదికగా స్పందిచారు. విదేశాలకు చెందిన నిపుణులను తమ దేశ కంపెనీల్లోకి ఆహ్వానిస్తున్నామని.. సంక్లిష్టమైన చిప్స్, సెమీ కండక్టర్లు, కంప్యూటర్లు, షిప్పులు, రైళ్ల తదితర ఉత్పత్తులను ఎలా తయారు చేయాలనేది విదేశీ ఉద్యోగుల నుంచి నేర్చుకుంటాం అని పేర్కొన్నారు. ఇక టిక్‌టాక్ యాప్ యాజమాన్యంతో ఉన్న సమస్యలను పరిష్కరించుకుంటామని, దీనిపై చైనాతో ఒప్పందం జరిగిందని ట్రంప్ వెల్లడించారు. ఈ మేరకు వాణిజ్య చర్చల్లో భాగంగా స్పెయిన్‌లో చైనాతో సోమవారం సమావేశం బాగా జరిగిందని చెప్పారు. కాగా ఇటీవల డల్లాస్‌లో భారత సంతతికి చెందిన చంద్ర నాగమల్లయ్య అనే వ్యక్తి దారుణ హత్య ఘటనను ట్రంప్ తీవ్రంగా ఖండించారు. మరోవైపు.. రష్యా నుంచి చమురు దిగుమతులపై సుంకాలు విధించాలంటూ జీ-7, నాటోకు అమెరికా పిలుపునివ్వడాన్ని తీవ్ర బెదిరింపు చర్యగా చైనా వ్యాఖ్యానించింది. అమెరికా పిలుపునకు స్పందించి సుంకాలు విధిస్తే తమ నుంచి ప్రతీకార చర్యలుంటాయని హెచ్చరించింది.

వన్‌తారా వన్య మృగ కేంద్రానికి 'సిట్' క్లీన్‌చిట్

» చట్టాల ఉల్లంఘన జరగలేదని సుప్రీంకోర్టు ప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో రిలయన్స్ ఆధ్వర్యంలోని వన్‌తారా వన్య మృగ కేంద్రానికి క్లీన్ చిట్ లభించింది. దాని నిర్వహణలో ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగలేదని సుప్రీంకోర్టు సోమవారం ప్రకటించింది. ఈ కేంద్రం నిర్వహణపై దర్యాప్తు జరిపిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) క్లీన్ చిట్ ఇచ్చినట్టు తెలిపింది. నిబంధనల అమలు సక్రమంగా ఉన్నట్టు నివేదిక సమర్పించిందని ధర్మాసనం పేర్కొంది. వన్‌తారా వన్య మృగ కేంద్రం నిర్వహణలో నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని, చట్టాలకు విరుద్ధంగా అక్కడికి ఏనుగులను తీసుకొస్తున్నారంటూ దాఖలైన రెండు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఓ న్యాయవాది లేచి వన్‌తారాకు దేవాలయం ఏనుగును తీసుకొచ్చారని చెప్పగా అందులో తప్పేముందని ధర్మాసనం ప్రశ్నించింది. కేసును కొట్టివేసింది.

పోలీసు స్టేషన్లలో పనిచేయని నిఘా కెమెరాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: పోలీసు స్టేషన్లలోని సీసీటీవీ కెమెరాలు పనిచేయకుండా మూలపడుతుండడంపై సోమవారం సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణమని అభిప్రాయపడింది. ఈ సమస్య పరిష్కారానికి మానవ ప్రమేయంలేని కంట్రోలు రూంలు ఉంటే మంచిదేమోనని అభిప్రాయపడింది. ఏ స్టేషన్‌లోనైనా సీసీటీవీ కెమెరా పనిచేయకపోతే తక్షణమే కంట్రోలు రూం నుంచి హెచ్చరిక వచ్చేలా ఏర్పాట్లు ఉంటే మంచిదని పేర్కొంది. మనుషులు కాకుండా కృత్రిమ మేధ (ఏఐ)తో పర్యవేక్షించే కంట్రోలు రూంల ఏర్పాటుపై ఏదైనా ఐఐటీ సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తే బాగుంటుందని సూచించింది. పోలీసు స్టేషన్లలో పనిచేయని సీసీటీవీ కెమెరాలు ఉండడంపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఏ స్టేషన్‌లోనయినా సీసీటీవీ కెమెరా పనిచేయకపోయినా ఆ విషయాన్ని వెంటనే పర్యవేక్షణ సంస్థకుగానీ, న్యాయ సేవల సంస్థకుగానీ వెంటనే తెలిపే ఏర్పాట్లు ఉండాలంది.

భారత్-అమెరికా మధ్య నేడు వాణిజ్య చర్చలు



వాషింగ్టన్, సెప్టెంబరు 15: భారత్-అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందంపై మంగళవారం ఆరో విడత చర్చలు జరగనున్నాయి. చర్చల్లో పాల్గొనేందుకు అమెరికా వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ భారత్‌కు రానున్నారు. భారత ప్రతినిధిగా వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ చర్చల్లో పాల్గొంటారు. మరోవైపు, వాణిజ్య ఒప్పందంపై భారత్‌ను చర్చలకు వచ్చేలా చేశామని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో వ్యాఖ్యానించారు. అదే సమయంలో ఆయన మరోసారి భారత ఆర్థిక విధానాలను విమర్శించారు. ఓ పక్క అమెరికాతో అన్యాయమైన వ్యాపారం ద్వారా డబ్బులు సంపాదించుకుంటూ చౌకగా రష్యా చమురు కొంటున్నారని ఆరోపించారు. భారత్ ఇచ్చే డబ్బులతో రష్యా ఆయుధాలు కొని ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తోందన్నారు.

ఐటీ రిటర్నుల దాఖలు గడువు నేటి వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు(హెచ్‌యూఎఫ్‌లు) పెనాల్టీ లేకుండా ఐటీ రిటర్నులు(ఐటీఆర్) దాఖలు చేయడానికి తుది గడువును మంగళవారం వరకు పొడిగించారు. ఈ మేరకు సోమవారం ఐటీ శాఖ సోమవారం ప్రకటన చేసింది. వాస్తవానికి ఈ గడువు సోమవారంతోనే ముగియాల్సి ఉండగా, చివరి రోజు రిటర్నుల ఫైలింగ్‌లో అవాంతరాలు ఎదురైనట్టుగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో, గడువును పొడిగించారు. సోమవారంకల్లా 7.3 కోట్లకు పైగా ఐటీ రిటర్నులు దాఖలైనట్టు ఐటీ శాఖ వెల్లడించింది. కొన్నేళ్లుగా ఐటీఆర్ ఫైలింగ్స్ పెరుగుతున్నాయి. గత ఏడాది జూలై 31 వరకు 7.28 కోట్ల ఐటీఆర్‌లు దాఖలయ్యాయి. అంతకు ముందు ఏడాది ఇవి 6.77 కోట్లుగా ఉన్నాయి.

బిహార్‌లో వలసల పాపం కాంగ్రెస్‌దే

కావాలనే నాడు చొరబాట్లను పెంచారు.. వాళ్లందరినీ మేం పంపించివేస్తున్నాం

» బిహార్ పర్యటనలో మోదీ వ్యాఖ్యలు

పూర్ణియా, సెప్టెంబరు 15 : బిహార్‌లో వలస చొరబాట్లు పెరగడానికి కాంగ్రెస్, దాని మిత్రపక్షాలే కారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. అక్రమ వలసదారులను తాము పంపించి వేస్తున్నామని తెలిపారు. పాకిస్థానీయులతోపాటు బంగ్లా, నేపాల్, అఫ్గానిస్థాన్ నుంచి అక్రమంగా ప్రవేశించిన వారు సైతం ఓటుహక్కు పొందినట్టు ఇటీవల బిహార్‌లో ఈసీ నిర్వహించిన సమగ్ర ఓట్ల సవరణ (సర్) ప్రక్రియలో తేలింది. బిహార్‌లోని పూర్ణియాలో సోమవారం జరిగిన సభలో ఈ అంశాన్ని మోదీ ప్రస్తావించారు. కాంగ్రెస్, ఆర్జేడీలపై విరుచుకు పడ్డారు. కాంగ్రెస్, దాని మిత్రులు అధికారంలో ఉన్నప్పుడు బిహార్‌లో కావాలనే చొరబాట్లను పెంచారని, ఎన్డీయే ప్రభుత్వం వారందరినీ పంపించివేస్తోందని అన్నారు. బిహార్‌ను బీడీతో ముడిపెట్టి అవమానించిన కాంగ్రెస్ పార్టీకి గట్టిబుద్ధి చెప్పాలని బిహారీలను ఆయన కోరారు. పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీ విషయంలో కేంద్రం విధానాన్ని విమర్శిస్తూ కేరళ కాంగ్రెస్ 'బీడీలు..బిహార్..' అంటూ సోషల్‌మీడియాలో పోస్టు పెట్టి.. ఆ తర్వాత తీసివేసింది. దీనిపై మోదీ తీవ్రంగా విరుచుకుపడ్డారు. "బీడీ.. బిహార్.. బీతో మొదలవుతాయని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. వారి వైఖరి బిహారీలను తీవ్రంగా అవమానించింది. కాంగ్రెస్‌కు, ఆ పార్టీ మిత్రపక్షాలకు రానున్న రోజుల్లో బిహార్ ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారు" అని హెచ్చరించారు. "గతంలో ఆర్జేడీ, కాంగ్రెస్ అస్తవ్యస్థ పాలన వల్ల బిహార్ ఎంతో నష్టపోయింది. రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే వారు చూసి ఓర్చుకోలేరు. రానున్న ఎన్నికల్లో ఇందుకు వారు మూల్యం చెల్లించుకుంటారు." అని మోదీ మండిపడ్డారు. పేదలకు అండగా నిలవడమే మోదీ విధానమని ప్రధాని వ్యాఖ్యానించారు. రైతుల ప్రయోజనం కోసం నేషనల్ మఖన బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రూ.40వేల కోట్ల విలువైన పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మరోవైపు "ఎన్డీయేతో ఉన్నా.. ఇకముందూ ఉంటాను' అని బిహార్ సీఎం నితీశ్‌కుమార్ వ్యాఖ్యానించారు. గతంలో ఆర్జేడీతో కలిసి అధికారం పంచుకోవాల్సి రావడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇకముందు అలా జరగబోదని ప్రధాని మోదీ సమక్షంలోనే నితీశ్ వెల్లడించడం గమనార్హం. వారిద్దరూ కలిసి బిహార్‌లోని పూర్ణియాలో జరిగిన సభలో పాల్గొన్నారు. "బీజేపీతో కలిసి 2005 నవంబరులో ప్రభుత్వం ఏర్పాటు చేశాను. ఆ తర్వాత ఒకటి, రెండుసార్లు పక్కకు పోయాను. పార్టీ సహచరుల్లో కొందరి ఒత్తిడే దీనికి కారణం. ఆ సహచరుల్లో ఒకరు ఇప్పుడు ఈ వేదికపైనే ఉన్నారు" అంటూ కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (లలన్) వైపు నితీశ్ సరదాగా వేలు చూపించారు. అయినా.... అదంతా గతమని, అప్పట్లో వారితో ఇమడలేకపోయేవాడినని, ఎప్పుడూ ఏదొక తప్పుడు పని చేస్తుండేవారన్నారు. నవ్వుతూ నితీశ్ వ్యాఖ్యలను మోదీ స్వాగతించారు.



బిహార్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న మోదీ

'సిందూర్' సాహసం భేష్ : శ్లాఘించిన ప్రధాని

ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఆదర్శప్రాయ భూమికను సైనిక బలగాలు పోషించాయని మోదీ శ్లాఘించారు. కోల్‌కతాలోని ఈస్టర్న్ కమాండ్ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన కమాండర్ల సదస్సును ప్రారంభించారు. అనంతరం 'ఇండియన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ విజన్-2047' డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. భవిష్యత్ దిశగా ఆర్మీ బలగాలు వేసే అడుగులతో ఈ డాక్యుమెంట్ నిండి ఉన్నదని తెలిపారు. కాగా, ఆపరేషన్ సిందూర్ తర్వాత కమాండర్ల సదస్సు జరగడం ఇదే మొదటిసారి. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్, జాతీయభద్రతా సలహాదారు డోభాల్, సీడీఎస్ అనిల్ చౌహాన్, రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్, త్రివిధ దళాల అధిపతులు తొలిరోజు సదస్సులో పాల్గొన్నారు. వాస్తవాధీన రేఖ వెంబడి ఉన్న ఉగ్రవాద స్థావరాలను కూల్చివేయడంలోను, పాకిస్థాన్ లోపలకు చొచ్చుకెళ్లి అక్కడా లక్ష్యాలను ఛేదించి ముష్కరులకు బుద్ధిచెప్పడంలోను సిందూర్ విజయవంతం అయిందని భద్రతాధికారులు హర్షం వ్యక్తం చేశారు.

రష్యా కష్టం.. మనకు లాభం!

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశంలోని రిఫైనరీల పంట పండిస్తున్నమైనమే ఇందుకు ఉదాహరణ. గుర్తుందా.. కిందటి నెలలో ఉక్రెయిన్ రష్యాపై అతిపెద్ద డ్రోన్ దాడులు నిర్వహించింది. ఆ దాడుల్లో రష్యావ్యాప్తంగా ఉన్న పలు కీలక రిఫైనరీల సామర్థ్యం భారీగా దెబ్బతింది. దీంతో.. రష్యా తన చమురుశుద్ధి సామర్థ్యంలో దాదాపు 20 శాతం మేర కోల్పోయింది. ఆ దేశ రోజువారీ చమురు శుద్ధి సామర్థ్యంలో 11 లక్షల బ్యారెళ్లకు సమానం ఇది. శుద్ధి సామర్థ్యం తగ్గిపోవడంతో రష్యా రోజూ చేసే ఎగుమతులకు అదనంగా మరో 2 లక్షల బ్యారెళ్ల ముడి చమురును అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేస్తోంది. అది కూడా.. ఒపెక్ దేశాలు అమ్మే బ్రెంట్ క్రూడ్ కన్నా తక్కువ ధరకు. బ్రెంట్ క్రూడాయిల్‌తో పోలిస్తే రష్యా విక్రయిస్తున్న ఉరల్స్ ముడి చమురు ఒక బ్యారెల్‌కు 5-6 డాలర్ల దాకా తక్కువకు వస్తుండడంతో భారతదేశానికి చెందిన రిఫైనరీలు ఆ చమురును పెద్ద ఎత్తున కొనుగోలు చేసి, ఇక్కడ శుద్ధి



చేసి మార్కెట్ రేట్లకు విదేశాలకు విక్రయిస్తున్నట్టు సమాచారం. ఆగస్టులో యూరప్ దేశాలకు మనదేశం నుంచి డీజిల్ ఎగుమతులు 137% మేర పెరిగి రోజుకు 2,42,000 బ్యారెళ్లకు చేరాయి. ఆగస్టు 15 దాకా సగటున రోజుకు 15 లక్షల బ్యారెళ్ల ఉరల్స్ ముడిచమురు రష్యా నుంచి మన దేశానికి దిగుమతి అవుతుండగా.. ఆగస్టు నెలాఖరుకు అది రోజుకు 20 లక్షల బ్యారెళ్లకు చేరింది. ఇలా అదనంగా దిగుమతి చేసుకుని, శుద్ధి చేసి విక్రయిస్తున్న చమురు కారణంగా రిలయన్స్ సంస్థకు ఏటా అదనంగా సుమారు 500 మిలియన్ డాలర్ల నిర్వహణ లాభం వచ్చే అవకాశం ఉందని జెఫ్రీస్ సంస్థ అంచనా. క్యాపిటల్ మార్కెట్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ గ్రూప్ సీఎల్ఎస్ఏ అంచనాల ప్రకారం.. రష్యా క్రూడ్ రాయితీల కారణంగా భారతదేశం ఏటా రూ.22 వేల కోట్ల మేర లాభాలు పొందుతోంది. రష్యా చమురు అతి తక్కువ ధరలకు లభించడం వల్ల.. బీమా, రవాణా ఖర్చులు అన్నింటినీ కలుపుకొన్నాక కూడా మన రిఫైనరీలకు ఒక్కో బ్యారెల్‌పై డాలర్ నుంచి 1.25 డాలర్ల దాకా లాభం వస్తోంది.

రష్యా బాగు చేసుకుంటే..

రష్యా రిఫైనరీల సంక్షోభం మన దేశంలోని చమురు శుద్ధి కర్మాగారాలకు అందివచ్చిన అవకాశంగా మారిన ప్పటికీ.. ఈ ప్రయోజనాలు కొంతకాలమేనని ఇంధన రంగ నిపుణులు చెబుతున్నారు. రష్యా తన చమురు శుద్ధి కర్మాగారాలను బాగు చేసుకున్నాక ఇతర దేశాలకు ఎగుమతులను తగ్గిస్తుందని పేర్కొంటున్నారు. ఒకవేళ అదే జరిగి రష్యా చమురు శుద్ధి సామర్థ్యం పెరిగి.. ప్రస్తుతం తక్కువ ధరలకే అమ్ముతున్న చమురును మళ్లీ మార్కెట్ రేట్లకు అమ్మడం మొదలుపెడితే రోజుకు సగటున 18 లక్షల బ్యారెళ్ల ముడిచమురు కొనుగోళ్ల ధర పెరిగి.. భారత్‌పై ఏడాదికి అదనంగా రూ.80 వేల కోట్ల భారం పడుతుందని అంచనా.

కణాల చలనం, ఆకార మార్పిడి గుట్టు రట్టు

» సీసీఎంబీ శాస్త్రవేత్తల ఆవిష్కరణ

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మన శరీరంలోని కణాలు తమ ఆకారాన్ని మార్చుకుని, ఒకచోటు నుంచి మరొకచోటుకు వెళ్లడానికి ఉపకరించే కీలక ప్రొటీన్‌ను.. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రజ్ఞులు గుర్తించారు. దాని పేరు స్పిన్ 90. అది ఏపీఆర్2/3 అనే అనే ప్రొటీన్‌తో కలిసి పనిచేసి.. కణాల కదలికకు అత్యంత కీలకమైన యాక్టిన్ ఫిలమెంట్ వృద్ధిని ప్రేరేపిస్తుందని వారి పరిశోధనల్లో వెల్లడైంది. నేచర్ స్ట్రక్చరల్ అండ్ మాలిక్యులార్ బయాలజీలో వారి ఈ పరిశోధన ఫలితం ప్రచురితమైంది. ఈ ఆవిష్కరణ వైద్యరంగానికి ఎంతో ఉపయోగకరమని నిపుణులు భావిస్తున్నారు. కణాలు ఎంత వేగంగా ఆకారాన్ని మార్చుకుని కదలుతాయో అర్థం చేసుకోవడం వల్ల క్యాన్సర్, రోగనిరోధక సమస్యలు వంటి వాటిపై మరింత స్పష్టత వస్తుందంటున్నారు.



శ్రీవారి ఆలయ ధ్వజస్తంభం వద్ద మారిషస్ ప్రధాని నవీన్ చంద్ర రాంగులామ్ దంపతులు

శ్రీవారి సేవలో మారిషస్ ప్రధాని

తిరుమల/రామచంద్రాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మారిషస్ ప్రధాని నవీన్ చంద్ర రాంగులామ్ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం తిరుమలలోని పద్మావతి అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా ఆలయ మహాద్వారం వద్దకు చేరుకోగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలోకి వెళ్లిన నవీన్‌చంద్ర రాంగులామ్ ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి, ఆ తర్వాత మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. మంత్రి ఆనం, చైర్మన్, ఈవో శ్రీవారి ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. అంతకుముందు తిరుపతి విమానాశ్రయం వద్ద ఆయనకు ఘన స్వాగతం లభించింది. అక్కడ్నుంచి రామచంద్రాపురం మండలం సి.రామాపురంలోని బ్రహ్మర్షి గురూజీ సిద్ధేశ్వరతీర్థ ఆశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమ పీఠాధిపతి బ్రహ్మర్షి గురువానంద గురూజీ ఆశీస్సులతో తాను నాలుగుసార్లు మారిషస్ ప్రధాని అయ్యానన్నారు. మారిషస్‌లో విద్య, వైద్యం అభివృద్ధికి బ్రహ్మర్షి ఆశ్రమం తరఫున వెయ్యి మిలియన్ల డాలర్లు వితరణ చేయనున్నట్టు గురువానంద తెలిపారు.

ఆర్టీఐహెచ్ సీఈవోగా ధాత్రిరెడ్డి



ధాత్రిరెడ్డి



గీతాంజలి శర్మ

ఫైబర్ నెట్ ఎండీగా గీతాంజలి శర్మ

- డ్రోన్ కార్పొరేషన్ ఎండీగా సౌర్యమాన్ పటేల్
- ముగ్గురు ఐఏఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రతన్ టాటా ఇన్నోవేషన్ హాబ్ (ఆర్టీఐహెచ్) సీఈవోగా 2020 బ్యాచ్‌కు చెందిన పి. ధాత్రి రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆమె ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవోగాను ధాత్రిరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా గీతాంజలి శర్మను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆమె కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఎండీగాను గీతాంజలి శర్మకు అనదపు బాధ్యతలు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ ఎండీగా సౌర్యమాన్ పటేల్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం పటేల్ పాడేరు సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పటేల్‌కు ఆర్టీజీఎస్ అదనపు సీఈవోగాను అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఈ ముగ్గురు ఐఏఎస్‌లను బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ముగ్గురూ ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కార్యదర్శితో సమన్వయం చేసుకోవాలని కోరారు. కాగా, మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య ఇప్పటివరకు ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఎండీగా, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఆ బాధ్యతల నుంచి ఆయనను రిలీవ్ చేశారు.

'రెరా' చైర్‌పర్సన్‌గా శివారెడ్డి

ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) చైర్‌పర్సన్‌గా శివారెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కొత్త బాధ్యతల్లో చేరే ముందుగా మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అందించాలని ఆదేశించింది. ఏపీ రియల్‌ఎస్టేట్ (రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్) యాక్ట్ - 2016, 2017 ప్రకారం ఆయనను నియమించింది. ఈ మేరకు మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, శివారెడ్డి అమరావతి ఉద్యమంలో పాల్గొన్నారు.

ఆర్డీటీకి మద్దతుగా పొలికేక

- ఎస్సీ, ఎస్టీ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో అనంతలో నిరసన
- ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలని డిమాండ్



ఎస్సీ, ఎస్టీ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్‌ను ముట్టడించిన జనం

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్థాపించిన ఆర్డీటీ పరిరక్షణ కోసం అనంతపురం నగరంలో 'పొలికేక' పేరిట సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రజలు, కళాకారులు తరలివచ్చి నగరంలో కదంతొక్కారు. ఆర్డీటీకి విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) అనుమతిని రెన్యువల్ చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో ఎస్సీ, ఎస్టీ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో పొలికేక కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. కలెక్టరేట్ వద్ద ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మకు వారు వినతిపత్రం సమర్పించారు.

సరళీకృత జీఎస్టీ ఎంఎస్ఎంఈలకు ప్రాణవాయువు

- బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జాఫర్ ఇస్లాం



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జాఫర్ ఇస్లాం, పక్కన బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన జీఎస్‌టీ సంస్కరణలు మధ్య తరగతి ప్రజల జీవన సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకున్నవేనని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జాఫర్ ఇస్లాం అన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మధ్య తరగతికి అవసరమయ్యే అనేక వస్తువులు 5శాతం జీఎస్టీ పరిధిలోకి వస్తుండటం ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగించే విషయమన్నారు. సామాన్య, మధ్య తరగతిలో కొనుగోలు శక్తి పెరగడం వల్ల మార్కెట్ పుంజుకుని దేశ ఆర్థిక వ్యవస్థ వేగవంతమవుతుందని చెప్పారు. ఎంఎస్ఎంఈ రంగానికి ఈ సంస్కరణలు ప్రాణవాయువు లాంటివని, ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలు దేశ ఆర్థిక స్వావలంబనకు మార్గం సుగమం చేస్తున్నాయని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ మోదీ సర్కారు ఆర్థిక దృక్పథంతో మధ్య తరగతి సాధికారత, పరిశ్రమల బలోపేతం, సమగ్ర అభివృద్ధికి మార్గం మరింత సులువైందన్నారు.

సామాన్యుడి అవసరాలపై జీఎస్టీ తగ్గింది

- బీజేపీ జాతీయ కార్యదర్శి అనిల్ ఆంటోనీ

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన రెండు శ్లాబుల జీఎ స్టీ విధా నం సామాన్యుడి అవసరాలకు ఉపయోగకరంగా ఉం దని బీజేపీ జాతీయ కార్యదర్శి అనిల్ ఆంటోనీ అన్నా రు. విజయవాడలోని ఒక హోటల్లో జరిగిన వన్ నేషన్.. వన్ ఎలక్షన్ రాష్ట్ర స్థాయి విద్యార్థి సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. వన్ నేషన్, వన్ ఎలక్షన్‌తో జీడీపీ 1.5 శాతం పెరుగుతుందన్నారు. విద్యార్థుల పుస్తకాలు, పెన్నుల నుంచి సామాన్యులకు అవసరమ్యే వాటిపై భారం తగ్గడం ఎంతో శుభసూచికమని చెప్పారు.

ఉద్దండరాయునిపాలెంలో విశ్వకర్మ జయంతి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భూమిపూజ చేసిన ఉద్దండరాయునిపాలెంలో 'సృష్టి' పేరుతో విశ్వకర్మ జయంతిని నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేశ్ నాయుడు తెలిపారు.

అధికారం కోసం 'అడ్డగోలు సొమ్ము'

(మొదటి పేజీ తరువాయి)

అందుకున్న లంచం డబ్బులు స్వీకరించడం నుంచి తరలించడం వరకూ వెంకటేశ్ ఎలాంటి పాత్ర పోషించాడో కోర్టుకు సిట్ తెలిపింది. కేవలం 6 నెలల్లో అతడి నివాసానికి సుమారు 200 కోట్ల నుంచి 250 కోట్ల వరకూ చేర్చడం.. ఆ సొమ్మును చెవిరెడ్డి చెప్పిన వ్యక్తులకు అందజేసిన వైనాన్ని వివరించింది. డబ్బులు తరలించడంలో బాలాజీకుమార్ యాదవ్ చురుగ్గా వ్యవహరించినట్లు తేల్చింది. చెవిరెడ్డి, ఇతర కీలక నిందితులైన రాజ్ కసిరెడ్డి, మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడు, ఎద్దల నవీన్‌కృష్ణ, హరీశ్, మోహిత్‌రెడ్డి తదితరులు కలిసి అక్రమంగా ఆర్జించిన సొమ్మును.. తాడేపల్లిలో ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్లో డి. చరిష్మా నుంచి ఫ్లాట్ అద్దెకు తీసుకుని డెన్‌లో దాచి.. ప్రణయ్ ప్రకాశ్‌ను కాపలాగా పెట్టి.. ఆ తర్వాత ఆ మొత్తాన్ని ఎన్నికల్లో వినియోగించినట్లు వివరించింది. చెవిరెడ్డి ఆదేశాలతో తాడేపల్లి నుంచి అట్టపెట్టెల్లో నోట్ల కట్టలను తిరుపతి, పొదిలి, ఒంగోలు, కావలి తదితర ప్రాంతాలకు తరలించినట్లు పేర్కొంది. కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి నవీన్ కృష్ణ, బాలాజీ కుమార్ యాదవ్ 2024 మార్చి మూడోవారంలో డబ్బు అందజేసినట్లు కాల్ డేటాతో సహా రుజువైందని సిట్ వివరించింది. దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లికి కూడా నిధులు అందినట్లు తేల్చింది. 2023-24 మధ్య మొత్తం రూ.112 కోట్లను చెవిరెడ్డి ఆధ్వర్యంలో తరలించినట్లు తెలిపింది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కృష్ణ వ్యాలీ అపార్ట్‌మెంట్లో వెంకటేశ్‌నాయుడి నివాసంలో నగదు తీసుకుని ఒంగోలులో వైసీపీ వలంటీర్లకు అందజేసినట్లు పేర్కొంది. పీవీ డిస్టిలరీస్, బీ9బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ఇందులో ఎక్కువ ముడుపులు అందజేసినట్లు తెలిపింది. తుడా చైర్మన్ హోదాలో చెవిరెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి వినియోగించిన అధికార వాహనం ఫార్చూనర్ ఏపీ39 బీవీ 3259లో డబ్బులు తీసుకెళ్లినట్లు టోల్‌గేట్ల వివరాలతోపాటు వివరించింది. వెంకటేశ్‌నాయుడు, రాజ్ కసిరెడ్డి పలుమార్లు హైదరాబాద్‌లో జరిపిన సమావేశాలను లొకేషన్లతో పాటు టవర్ డంప్‌ల ద్వారా గుర్తించినట్లు కోర్టుకు తెలిపింది. హైదరాబాద్, విజయవాడ, గుంటూరులో 2023-24లో లిక్కర్ గ్యాంగ్ సభ్యులు సైమన్ ప్రసన్, తుకేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు పలుమార్లు సమావేశమై కలెక్షన్లు, డబ్బు బదిలీని సమన్వయం చేసినట్లు ఆధారాలు సైతం అందజేసింది. ఈ మొత్తం ముడుపుల వ్యవహారాలు, నగదు లావాదేవీలు, కొనుగోలు చేసిన ఇతర ఆస్తులకు సంబంధించి మరింత సమాచారం రాబట్టేందుకు మోహిత్‌రెడ్డి(ఏ-39)ని కస్టడీకి ఇవ్వాలని కోర్టును సిట్ కోరింది.

12 షెల్ కంపెనీలు.. 6 ఒకే అడ్రస్‌లో..

మద్యం ముడుపుల సొమ్మును మార్చుకోవడానికి చెవిరెడ్డి తన కుటుంబ సభ్యులు, అనుచరుల పేరుతో ఏర్పాటు చేసిన 12 షెల్ కంపెనీల్లో ఆరు ఒకే అడ్రస్(చెవిరెడ్డి ఉండే తుమ్మలగుంట)లో ఉన్నట్లు సిట్ గుర్తించింది. వాటిలో ఎలాంటి లావాదేవీలూ జరగలేదని తేల్చింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో చెవిరెడ్డి కొనుగోలు చేసిన ఆస్తుల అసలు విలువ తేల్చడం, కొనుగోలుకు తీసుకొచ్చిన నిధుల వివరాలు రాబట్టడం, ఆయన విస్తృత నెట్‌వర్క్‌ను ఛేదించడం, లిక్కర్ ముడుపుల బాగోతాన్ని వెలికితీసే ప్రయత్నాల్లో తాము న్నట్లు చెప్పింది. కుటుంబ సభ్యులు, బినామీల పేర్లతో ఎక్కడెక్కడ ఆస్తులు కొన్నారో ఓ జాబితాను కూడా కోర్టుకు సమర్పించింది. చెవిరెడ్డి సన్నిహితుడు బాలాజీ కుమార్ యాదవ్ తండ్రి కుళ్లాయప్ప పేరుతో తిరుపతి, చిత్తూరులో కొన్న ఆస్తుల వివరాలు చూపించి.. వాటిని కొనేంత ఆర్థిక సామర్థ్యం ఆయనకు లేదంది. కేవీఎస్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ బ్యాంకు ఖాతాకు 2022 అక్టోబరు వరకు పలువురు వ్యక్తులు, సంస్థలు నగదు బదిలీ చేసినట్లు సిట్ గుర్తించింది. మొదట థర్డ్ పార్టీ వ్యక్తులు/సంస్థల ఖాతాల నుంచి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీకాంతమ్మ బ్యాంకు ఖాతాలకు నిధులు బదిలీ చేసి, అక్కడి నుంచి కేవీఎస్ ఇన్‌ఫ్రాకు మళ్లించినట్లు తేలింది. లిక్కర్ ముడుపులతో చెవిరెడ్డి, మోహిత్‌రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు, వారి కంపెనీల పేరిట భూములు, ప్లాట్లు సహా స్థిరాస్తులు కొన్నారు. వారికి నిధులు ఎవరెవరు పంపారు.. చెవిరెడ్డి కుటుంబంతో వారికున్న సంబంధాలేంటి తదితర వాటిపై లోతుగా దర్యాప్తు చేయాల్సిన అవసరముందని సిట్ పేర్కొంది.

నేరపూరిత కుట్రలో నకిలీ మొబైల్ కనెక్షన్లు..

రాజ్ కసిరెడ్డితో పాటు పలువురు నిందితులు తమ పేర్లతో కాకుండా మారు పేర్లతో సిమ్ కనెక్షన్లు తీసుకున్నట్లు సిట్ గుర్తించింది. కసిరెడ్డి వాడిన సిమ్ రాజమండ్రికి చెందిన లీలాప్రసాద్ పేరుతో ఉందని, కోసంగి చినబాబు పేరుతో మరొకటి వాడినట్లు తేల్చింది. వాసుదేవరెడ్డి(ఏ2) చిప్పిరి మహబూబ్ బాషా, వెంకట సుబ్బారావు పేర్లతో ఉన్న సిమ్‌లు వాడారు. సజ్జల శ్రీధర్ రెడ్డి ఎనుముల వెంకటనారాయణ పేరుతో, బూనేటి చాణక్య ఇమ్మానుయేల్, ప్రసన్న లక్ష్మి, సునీల్ కుమార్ పేర్లతో, సైఫ్ అహ్మద్.. శరణమ్మ పేరుతో, పురుషోత్తం వరుణ్.. మునగ శైలజ పేరుతో, సైమన్ ప్రసన్.. నరసింహుడు, స్వప్న పేర్లతో సిమ్స్ తీసుకుని వినియోగించినట్లు తెలిపింది. తప్పుడు డాక్యుమెంట్లతో సిమ్ కార్డులు కొనుగోలు చేసి అక్రమ కార్యకలాపాలకు వాడారని తేల్చింది. మొత్తం 48 మంది సాక్షుల వాంగ్మూలాలను జత చేసింది. 2024 అసెంబ్లీ ఎన్నికలకు 4 రోజుల ముందు అంటే.. ఆ ఏడాది మే 9న గరికపాడు చెక్‌పోస్టు వద్ద రూ.8,36,73,000 సీజ్ చేశారని.. హైదరాబాద్ నుంచి తాడేపల్లికి వెళ్తుండగా ఆ వాహనాన్ని తనిఖీచేసినప్పుడు ఆ సొమ్ము, కుట్రకోణం బయటపడ్డాయని సిట్ తెలిపింది.

లిక్కర్ సొమ్ముతో ఆఫ్రికాలో మైనింగ్ పెట్టుబడులు

లిక్కర్ ముడుపులను ఆఫ్రికా దేశాలకు తరలించిన విషయాన్ని ప్రణయ్ ప్రకాశ్ వాంగ్మూలం స్పష్టం చేస్తోందని సిట్ తెలిపింది. 'బూనేటి చాణక్య ఆదేశాలతో ప్రణయ్ ప్రకాశ్ తొలుత దుబాయ్ నుంచి జింబాబ్వే, టాంజానియా దేశాలకు వెళ్లాడు. అక్కడి నుంచే జాంబియా, ఇతర ఆఫ్రికన్ దేశాల్లో పెట్టుబడుల అవకాశాలను అన్వేషించాడు. అక్కడ నెల రోజులు మకాం వేసి.. మైనింగ్ వెంచర్లలో పెట్టుబడుల అవకాశాల గురించి ఆరా తీశాడు. 2025 జనవరిలో కూడా చాణక్య ఆదేశాల మేరకు ప్రణయ్ ప్రకాశ్ రెండోసారి విదేశీ పర్యటన చేపట్టాడు. ఈసారి అతని వెంట భూ విజ్ఞాన శాస్త్రవేత్త ఘోర్పడె మనోహరరావు కూడా ఉన్నారు. ఇద్దరూ జింబాబ్వే వెళ్లి సుమారు 17 రోజులు ఉన్నారు. అక్కడ వీరిని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి, వెంకటేశ్‌నాయుడు కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లోని లిక్కర్ ముడుపులను విదేశాలకు తరలించి పెట్టుబడులు పెట్టేందుకు ముందస్తు ప్రణాళికలో భాగంగానే ఈ నిందితులంతా అక్కడ కలిసినట్లు ఇది స్పష్టం చేస్తోంది' అని చార్జిషీటులో వివరించింది.

ఐదుగురి పాత్రా ఏమిటంటే..

చెరుకూరు వెంకటేశ్‌నాయుడు (ఏ-34)



లిక్కర్ సిండికేట్ ద్వారా అందిన ముడుపులను పంచడం, దాచడంలో ఇతడిది కీలక పాత్ర. 2024 అసెంబ్లీ/సార్వత్రిక ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచి ఏ-1 కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఏ-8 బూనేటి చాణక్య, ఏ-30 పైలా దిలీప్‌ల నుంచి రూ.8-9 కోట్ల చొప్పున భారీ మొత్తాలు వెంకటేశ్‌నాయుడికి అందాయి. ఈ మొత్తమే రూ.200-250 కోట్ల వరకు ఉంటుంది. ఆ నగదును సరఫరా చేయడానికి ముందు తన ఇంట్లోనే సురక్షితంగా దాచిఉంచేవాడు. పై నుంచి వచ్చిన ఆదేశాలతో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి(ఏ-38)కి ఆ నగదును చేర్చేవాడు. ఆ మొత్తాన్ని చెవిరెడ్డి ఎన్నికల ప్రలోభాలకు ఉపయోగించేవారు. హైదరాబాద్ నుంచి తిరుపతికి నగదు రవాణాలో ఎద్దల నవీన్ కృష్ణ(ఏ-36)తో కలిసి కీలక పాత్ర పోషించాడు. వెంకటేశ్ సహకారం లేకుండా ఇంత భారీ మొత్తాలు సాఫీగా సరఫరా అయ్యేవి కావు.

బాలాజీకుమార్ యాదవ్ (ఏ-35)

చెవిరెడ్డి తరఫున అక్రమ మద్యం ముడుపుల రవాణాలో బాలాజీ క్రియాశీల పాత్ర పోషించాడు. గత ఏడాది ఎన్నికలకు ఆరు నెలల ముందు రూ.8-9 కోట్ల భారీ కన్‌సైన్‌మెంట్లను ఎద్దల నవీన్ కృష్ణ (ఏ-36), హరీశ్ (ఏ-37)లతో కలిసి తరలించాడు. డిస్టిలరీలు, మద్యం సరఫరాదారులు అందించే ముడుపులని తెలిసీ సమన్వయంతో వాటి సరఫరాను సమన్వయం చేశాడు. పలువురి వాంగ్మూలాలు ఇదే ధ్రువీకరిస్తున్నాయి.

ఎద్దల నవీన్‌కృష్ణ (ఏ-36)

ఇతడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అనుచరుడు. అక్రమ నగదు తరలింపులో కేంద్ర బిందువుగా ఉన్నాడు. ముడుపుల ద్వారా అందిన మొత్తం తరలింపును ప్రత్యక్షంగా పర్యవేక్షించాడు. ఇందుకు బాలాజీ కుమార్, హరీశ్‌ల సాయం తీసుకున్నాడు. ప్రతి ట్రిప్పులో హైదరాబాద్ నుంచి రూ.8-9 కోట్లు తిరుపతికి సురక్షితంగా చేర్చడంలో కీలక పాత్రధారి. ఎన్నికల్లో ఓట్ల కొనుగోలుకు సదరు నగదు కన్‌సైన్‌మెంట్లను చేరవేశాడు. గోప్యంగా, సురక్షితంగా నగదు తరలించాడు. క్రిమినల్ కుట్రలో ఇతడికి క్రియాశీల పాత్ర ఉందని స్పష్టమవుతోంది.

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి (ఏ-38)

రాజకీయ నాయకుడైన చెవిరెడ్డి.. మద్యం ముడుపుల ప్రధాన లబ్ధిదారు.. సరఫరాదారు కూడా. వెంకటేశ్‌నాయుడు, బాలాజీకుమార్ యాదవ్, ఎడ్ల నవీన్ కృష్ణ, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నుంచి రూ.వందల కోట్ల ముడుపుల నగదు అందుకున్నారు. కసిరెడ్డి, ఇతర నిందితుల ద్వారా అందుకున్న సొమ్మును ఓటర్లకు పెద్దఎత్తున నగదు పంపిణీ వంటి వాటికి ఉపయోగించారు. తన కుమారుడైన మోహిత్‌రెడ్డికి తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) సమకూర్చిన అధికార వాహనంలో ఆ నగదు పంపిణీ చేశారు. తద్వారా అక్రమ కార్యకలాపాలకు ప్రభుత్వ వనరులను దుర్వినియోగం చేశారు. ముడుపుల నగదు అందుకోవడం వరకే చెవిరెడ్డి పాత్ర పరిమితం కాలేదు. ఆ సొమ్మును నియోజకవర్గాల్లో పంపిణీ చేయడం కూడా ఆయన బాధ్యతే. లిక్కర్ సిండికేట్ అక్రమ పథకానికి ఆయన కీలక రాజకీయ ప్యాట్రన్‌గా, ముఖ్య కుట్రదారుగా ఉన్నారని స్పష్టమవుతోంది.

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి (ఏ-39)

తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి 3 అధికారిక వాహనాలను (ఏపీ39 బీవీ 3259- టయోటా ఫార్చూనర్), ఏపీ 39 కేఏ 0697-ఎమ్‌జీ గ్లోస్టర్, ఏపీ 03 సీయూ 0666- టయోటా ఇన్నోవా క్రిస్టా)లను కేటాయించారు. ఆయన ఆదేశాలతోనే ఈ వాహనాల రాకపోకల వివరాలను డ్రైవర్లు లాగ్ బుక్స్‌లో నమోదు చేయలేదు. ఇందుకు బాధ్యులెవరు.. కుటుంబసభ్యుల పేరిట ఉన్న కంపెనీల ద్వారా జరిగిన అనుమానాస్పద నగదు లావాదేవీల వ్యవహారంలో మోహిత్‌రెడ్డి ప్రమేయాన్ని తెలుసుకునేందుకు ఆయన్ను కస్టడీకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉంది.

'పోలవరం' పునరావాస ప్యాకేజీ అందించాలి

- కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీపీఎం వినతి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ(ఆర్‌అండ్‌ఆర్) అందించాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను ఆంధ్రప్రదేశ్ సీపీఎం కమిటీ కోరింది. సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని సీపీఎం రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిటాస్ నేతృత్వంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, లోకనాథం, కె.సురేంద్ర, బి.కిరణ్, డి.రమేష్ కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం.. ఏపీ భవన్‌లో వారు మాట్లాడుతూ పోలవరం డీపీఆర్ సమయంలో నిర్వాసితులకు రూ.33 వేలకోట్ల ప్యాకేజీ అందించాల్సి ఉంటుందని అంచనా వేశారని, కానీ ఇప్పటి వరకు కేవలం రూ.5,200 కోట్లు మాత్రమే అందించారని తెలిపారు. ఇటీవల మరో రూ.824కోట్లు మంజూరైనా, ఆ నిధుల్లో ఎక్కువ భాగం ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లకు చెల్లిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే కలుగజేసుకుని నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందేలా చూడాలని కోరారు.

రెండు వందేభారత్ రైళ్లకు మెయింటెనెన్స్ హాలీడేస్‌లో మార్పులు

- డిసెంబరు మొదటి వారం నుంచి అమలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్- విశాఖపట్నం, కాచిగూడ-యశ్వంతపూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లకు మెయిం టెనెన్స్ హాలీడేల్లో దక్షిణమధ్యరైల్వే అధికారులు మార్పులు చేశారు. ప్రస్తుతం సికింద్రాబాద్-విశాఖపట్నం వందేభారత్(20707) ఎక్స్‌ప్రెస్‌కు ప్రతి గురువారం మెయింటెనెన్స్ హాలీడే ఉండగా, డిసెంబరు 5 నుంచి సోమవారానికి మారనుంది. అలాగే, కాచిగూడ-యశ్వంతపూర్ వందేభారత్‌కు ప్రస్తుతం ప్రతి బుధవారం హాలీడే కాగా, డిసెంబరు 4నుంచి ప్రతి శుక్రవారం మెయింటెనెన్స్ హాలీడే ఇవ్వనున్నారు. ఆయా రోజుల్లో ప్రయాణికుల రద్దీ, మెయింటెనెన్స్ స్లాట్స్ లభ్యత వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని ఈ మార్పులు చేసినట్టు అధికారులు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతికి బాట

మణిపూర్‌లో అగ్గి అంటుకున్న రెండున్నరేళ్ళకు, రెండువందల యాభైమందికి పైగా మరణించి, అరవైవేలమంది నిరాశ్రయులైన తరువాత, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ రాష్ట్రంలో కాలూనారు. ఆయన రాక, మాట కోసం ఆ రాష్ట్రం ఎంతగా ఎదురుచూస్తున్నదో ఈ పర్యటన దృశ్యాలు తెలియచెబుతున్నాయి. గాయానికి మందువేసే ఈ ప్రయత్నం ఆలస్యంగా జరిగిందని విశ్లేషకులు సైతం అంటున్నారు. అయినప్పటికీ, మోదీ పర్యటనకు ఉన్న ప్రాధాన్యం కాదనలేనిది. చీలికలు పేలికలైన సమాజాన్ని ఒక్కటి చేయడం ఇప్పటికిప్పుడు సాధ్యం కాకున్నా ఆ దిశగా పడిన ఒక ప్రధానమైన అడుగు ఇది. ప్రధాని మోదీ స్వయంగా హామీ ఇచ్చినట్టు, శాంతి, అభివృద్ధికి ప్రతీకగా మణిపూర్ మెరవాలని యావత్ భారతం కోరుకుంటోంది.

నలభై ఆరు విదేశీపర్యటనలు చేశారు, సొంత జనంకోసం మరీ మూడుగంటలేనా అని విపక్షాలు ప్రశ్నిస్తున్నప్పటికీ, మోదీతో భేటీ అయిన సందర్భంలో ఆయా వర్గాలవారు కన్నీటి పర్యంతమైన దృశ్యాలు చూసినప్పుడు వారికి కాస్తంత ఉపశమనం దక్కిందనే అనిపిస్తోంది. మోదీ మంచిమాటకారి కనుక, మణిపూర్‌ను ఆశలభూమిగా, మణిపూర్ వాసులను శ్రమ, శక్తి ప్రతీకలుగా చక్కగా అభివర్ణించారు. తమ బిడ్డల భవిష్యత్తుకోసం హింస అనే చీకటి నుంచి శాంతి అనే వెలుగులోకి రావాలన్నారు ఆయన. మణిపూర్‌లో తమ డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఇప్పటికే సాధించిన అభివృద్ధిని వివరించేందుకు కూడా ఈ సందర్భాన్ని ఉపయోగించుకున్నారు. ఎనిమిదిన్నరవేలకోట్ల అభివృద్ధిపనులకు కూడా శంకుస్థాపనలు చేశారు. వీటన్నింటికంటే, నిరాశ్రయులతోనూ, చిన్నారులతోనూ, బంధువులను కోల్పోయినవారితోనూ మాటపంచుకొని, ధైర్యవచనాలు చెప్పడం వారిని ప్రభావితం చేసివుంటుంది. కుకీల చుర్‌చంద్‌పూర్‌లోనూ, మీతీల ఇంఫాల్‌లోనూ ఆయన పర్యటనలూ పరామర్శలూ ఇరువర్గాలనూ సమంగా చూస్తున్నామన్న సందేశాన్ని ఇవ్వడానికి ఉపకరిస్తుంది.

అయితే, సందేశాలు మాత్రమే గాయాలను మాన్పలేవు. వేళ్ళూనుకొని ఉన్న వైరాలు ఒక చిన్న నిప్పురవ్వతో మారణకాండకు దారితీస్తున్న తరుణంలో, వైషమ్యాలను, అపనమ్మకాలను నిర్మూలించడానికి ఒక నిరంతర సానుకూల చర్యలు అవశ్యం. మొన్నటిదాకా ఒకరినొకరు చంపుకున్న వారంతా ఇకపై ఒక్కటి కావాలన్న ఆకాంక్ష మంచిదే కానీ, అందుకు బాటలు వేయాల్సిన బాధ్యత పాలకులదే. 29 నెలల నిరంతర అగ్గికి ప్రజలే కారణమన్నట్టుగా, మార్పు వారిలోనే రావాలన్నట్టుగా వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. ఇక్కడ అగ్గిరేగింది అభివృద్ధి కోసం కాదు. అప్పటికే కుకీజోలకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ పలు కక్షపూరితమైన నిర్ణయాలు చేయడం, మీతీలకు ఎస్టీ రిజర్వేషన్ ఇచ్చే ప్రతిపాదనకు రాష్ట్ర హైకోర్టు సానుకూలంగా స్పందించడం కుకీల ఆగ్రహానికి కారణం. వారు నిరసన చేపడితే, మీతీలు దాడులు చేసి పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చేశారు. హింస దురదృష్టకరమని ప్రధాని అనడం బాగుంది కానీ, అది దురుద్దేశపూరితమైనదని ఆయనకు తెలియకపోదు. భావితరాలకు ద్రోహం చేసింది ప్రజలు కాదు, తమవారేననీ ఆయనకు తెలుసు. నిప్పంటుకున్న క్షణం నుంచి మీతీ బీరేన్ దానిని ఆర్పడానికి ప్రయత్నించక పోగా, తన చర్యలు, చేష్టలతో మరింత ఎగదోశాడనడానికి సుప్రీం కోర్టుకు చేరిన ఆడియో టేపులే నిదర్శనం. చివరకు తీవ్రవాద గ్రూపులు సైతం తమను తాము ప్రజారక్షకులుగా అభివర్ణించుకుంటూ రంగంలోకి దిగి, ఎదుటి తెగవారిని ఊచకోతకోసే పరిస్థితులు దాపురించాయి. పోలీసుల ఆయుధాలు విద్రోహుల చేతుల్లోకి పోయాయి. మీతీ బీరేన్‌ను తప్పించనంతవరకూ శాంతిసాధ్యం కాదని తెలిసికూడా ఢిల్లీపెద్దలు ఆయనను అడ్డగోలుగా సమర్థించారు, పాపంలో తామూ భాగస్వాములైనారు. సర్కారు ఇక కూలిపోకతప్పదన్న ఆఖరుక్షణంలో మాత్రమే బీరేన్‌ను తప్పించి, రాష్ట్రపతిపాలన ద్వారా రాష్ట్రం చేజారిపోకుండా చూసుకున్నారు. అడపాదడపా అగ్గిరేగుతున్నప్పటికీ, మొత్తంగా ఇప్పుడు పరిస్థితులు కాస్తంత గాడినపడిన మాట నిజం. కుకీ–మీతీ పెద్దల మధ్య వరుస చర్చలతో అవిశ్వాసం తొలగి, సయోధ్య సాధించాలి. తరతమభేదాలకు అతీతంగా పునరావాసం దక్కాలి. ఆప్తులను కోల్పోయినవారికి అన్నివిధాలా న్యాయం జరగాలి. మణిపూర్ మీద పార్లమెంటులో నోరువిప్పడానికీ, కుకీ స్త్రీలపై అత్యాచారాలను నేరుగా ప్రస్తావించి ఖండించడానికి గతంలో మనసొప్పని ప్రధాని ఇంత కాలానికి జరిపిన ఈ పర్యటన శాంతికి బాటలు వేయాలి.

కోటికి ఒక్కడు ఈ కోడెల శివుడు

చనిపోయిన తర్వాత కొందరిని కీర్తి శేషులుగా పిలుస్తుంటాం. కానీ నిజంగా కీర్తిని వదిలిపోయే వారు కోటికొక్కరే ఉంటారు. ఆ కోవలోకే కోడెల శివప్రసాద్ వస్తారు. రూపాయి వైద్యుడిగా సేవలు అందిస్తూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్న ఆయన, నందమూరి తారక రామారావు పిలుపుతో రాజకీయాలలోకి ప్రవేశించారు. గుంటూరు జిల్లా నరసరావుపేట నియోజకవర్గం నుంచి 1983లో విజయం సాధించి, ఆ తర్వాత అయిదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రజల్లో బలమైన పట్టు, అపారమైన సేవాభావం ఆయన విజయానికి మూలం. ఆయన తీసుకున్న ప్రతి నిర్ణయం ప్రజల మేలుకోసమే. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ముఖ్యంగా గుంటూరు జిల్లాలో ఒక అజరామరమైన ముద్ర వేసిన నాయకుడు డాక్టర్ కోడెల.

1947 మే 2న గుంటూరు జిల్లాలోని నకరికల్లు మండలం, కండ్లగుంట గ్రామంలో కోడెల జన్మించారు. వైద్య విద్యను పూర్తి చేసి శస్త్ర చికిత్స నిపుణుడిగా రోగుల జీవితాల్లో వెలుగులు నింపారు. తెలుగుదేశం పార్టీ నాటి యువ బృందంలో ఉన్న కోడెల, ఎన్టీఆర్ హయాంలో 1987లో తొలిసారిగా హోంశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఒక వైద్యుడిగా మొదలైన ఆయన ప్రయాణం, తరువాత గొప్ప ప్రజానాయకుడిగా మలుపు తిరిగింది. ప్రజల సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధి కోసం పోరాడిన ఆయన జ్ఞాపకాలు చిరస్మరణీయం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హోం, ఇరిగేషన్, పంచాయతీరాజ్, సివిల్ సప్లైస్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా అన్నగారు, చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో సమర్థంగా బాధ్యతలను నిర్వహించారు. పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచిన నాయకుడు కోడెల. ఏ శాఖ మంత్రిగా పనిచేసినా ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగారు. రాజకీయాలలో ఉండడం కంటే, వైద్య వృత్తే తనకు ఇష్టమని ఆయన అనేవారు. అన్నగారి కల అయిన బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ప్రారంభించి, ఆసియాలోనే అత్యుత్తమ హాస్పిటల్‌గా తీర్చిదిద్దడంలో కోడెలది మరువలేని పాత్ర. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా అన్నగారి విగ్రహం సత్తెనపల్లి తారకరామసాగర్‌లో ఏర్పాటు చేశారు కోడెల. నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో నిర్వహించిన కార్యక్రమాలను జాతీయ స్థాయి దృష్టిని ఆకర్షించేంతగా కోడెల కష్టపడ్డారు.



ఒక వైద్యుడిగా, ప్రజలకు దగ్గరైన రాజకీయ నాయకుడిగా, ప్రభావవంతమైన మంత్రిగా, స్పీకర్‌గా తెలుగు రాజకీయ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచారు కోడెల శివప్రసాద్. ఆయనతో కలిసి పని చేయడం ఒక స్ఫూర్తిదాయక అనుభవం. ఎప్పటికీ నిలిచివుండే జ్ఞాపకం.

2014లో రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన నవ్యాంధ్రప్రదేశ్ తొలి అసెంబ్లీకి కోడెల శివప్రసాద్ స్పీకర్‌గా నియమితులయ్యారు. నూతన రాష్ట్ర చరిత్రలో పార్లమెంటరీ ప్రమాణాలు కాపాడుతూ సభను సమర్థంగా నడిపారు. ప్రజా నాయకుడిగా, ప్రభావవంతమైన మంత్రిగా, స్పీకర్‌గా చిరస్మరణీయంగా నిలిచారు. ఆర్థిక స్వావలంబన కోసం మహిళలలో చైతన్యం నింపేలా తొమ్మిది నిర్దిష్ట లక్ష్యాలతో అమరావతిలో జాతీయ మహిళా పార్లమెంట్ సదస్సును కోడెల అద్భుతంగా నిర్వహించారు.

దుర్మార్గమైన కుట్రలతో లొంగదీయాలనుకున్నవారి ప్రయత్నాలకు బెదరకుండా ఆయన దూరమవ్వడం పార్టీకి, ప్రజలకు పూడ్చలేని లోటు. జీవితమే పోరాటంగా గడిపిన నాయకుడు. నమ్మిన నాయకుని కోసం నమ్ముకున్న కార్యకర్తలను కాపాడటం కోసం తన మీద హత్యా ప్రయత్నం, అక్రమ కేసులు పెట్టినా ఎదుర్కొని, పల్నాడులో తెలుగుదేశం కార్యకర్తల గుండె ధైర్యంగా వ్యవహరించారు. రాజకీయాలలో వైరాలు, ప్రత్యర్థులు ఉండడం సహజం, కానీ శత్రువులుగా వ్యవహరించడం దురదృష్టకరం. ప్రజాస్వామ్యంలో అధికారపక్షం, ప్రతిపక్షం రెండూ నిర్మాణాత్మకమైన పాత్ర పోషించాలి. ప్రతిపక్షాలపై అధికారపక్షం జరిపే ప్రతీకార చర్యలు వేటగా, వేధింపులుగా మారి, ప్రాణాలు తీసేవరకు వెళ్లడం అత్యంత హేయం. పల్నాడు రాజకీయాలలో ఆయన సరళి ఏమైనా, సభాపతి స్థానంలో కోడెల హుందాగా వ్యవహరించి, ప్రతిపక్షానికి తగినన్ని అవకాశాలు ఇచ్చారు. కానీ ఆయనను నాటి ప్రతిపక్షం.. స్పీకర్‌గా చూడడానికి ఇష్టపడలేదు. తాము గట్టిగా ఎదుర్కొనవలసిన రాజకీయ శత్రువు అన్న తీరులోనే విపక్ష నేతలు వ్యవహరించి, స్పీకర్ స్థానానికి కూడా గౌరవం ఇవ్వలేదు. సభా కార్యక్రమాలను బహిష్కరించారు. ఎన్నికల్లో ఓడించి తీరాల్సిన నేతగా గురిపెట్టారు. 2019 ఎన్నికల సమయంలో కోడెలపై భౌతిక దాడికి దిగడంతో పాటు అధికారంలోకి వచ్చిన వెంటనే తమ ప్రథమ కర్తవ్యాలలో ఒకటిగా కోడెలపై వేట ప్రారంభించారు.

ఫ్యాక్షన్ రాజకీయాలకు చరమగీతం పాడి, చంపడం కాదు.. చదువుతో సమాజం బాగు చేయాలనుకుని రాజకీయాలను ఎన్నికల వరకే పరిమితం చేసిన ఆదర్శప్రాయుడు కోడెల. పల్నాడు ప్రాంత అభివృద్ధి, ప్రధానంగా గుంటూరు జిల్లా అభివృద్ధిపై ఆయన చెరగని ముద్ర వేశారు. సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల అభివృద్ధిని ఆయన ఒక స్థాయికి తీసుకెళ్లారు. పేటలో ఏ మూలకు వెళ్లినా ఆయన చేసిన అభివృద్ధి జాడలు కనిపిస్తాయి. పేట ద్విశతాబ్ది ఉత్సవాలు 1997లో నిర్వహించినప్పుడు పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి, ప్రజల తాగునీటి కష్టాలకు చరమగీతం పాడారు. 200 పడకల ఆసుపత్రి, భువనచంద్ర టౌన్ హాల్, ఆర్‌యూబీ నిర్మాణం, ఫ్లైఓవర్, స్టేడియం, షాదీఖానా, ఎస్ఆర్‌కేటీ, టీసీ, శివసంజీవ కాలనీలు ఏర్పాటు, జేఎన్టీయూ విశ్వవిద్యాలయం, కేంద్రీయ విశ్వవిద్యాలయం, రోడ్ల విస్తరణ, సిమెంట్ రోడ్లు, ఎక్కడ చూసినా గుర్తొచ్చే ఏకైక పేరు కోడెల. అప్పట్లోనే 10 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇప్పించిన ఘనత కూడా ఆయనదే. 2015లో పురపాలక సంఘం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పట్టణంలో మూడురోజుల పాటు ఉత్సవాలు నిర్వహించి రూ.500 కోట్ల మేర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి పూర్తి చేశారు.

ఒకప్పుడు దుర్భరమైన పరిస్థితులలో ఉన్న నరసరావుపేటకు శాశ్వతంగా విముక్తి కలిగించారు కోడెల శివప్రసాద్. నకరికల్లులో 267 ఎకరాల్లో ఏర్పాటు చేసిన రిజర్వాయర్‌తో నరసరావుపేట పట్టణానికి మరో 25 ఏళ్ల వరకూ తాగునీటి సమస్యలు లేకుండా చేశారు. శ్మశానవాటికలను నందన వనాలుగా తీర్చిదిద్దారు. ఒకే రోజున వేలాది మంది విద్యార్థులతో చేతులు శుభ్రం చేయించి గిన్నిస్ బుక్ రికార్డుల్లో చోటు సంపాదించారు. 16 వేల మందితో అవయవదానానికి అంగీకారపత్రాలు ఇప్పించి శభాష్ అనిపించుకున్నారు. సత్తెనపల్లిలో పాడుబడిన చెరువుని ఎన్టీఆర్ ఘాట్‌గా తీర్చిదిద్దారు. ముఖ్యంగా కోటప్పకొండ అభివృద్ధి, ప్రతి ఇంటికి ఆడబిడ్డల కొరకు టాయిలెట్ ఏర్పాటు చేయడం రాష్ట్రం మొత్తానికే ఆదర్శం.

ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో కోడెల శివప్రసాద్‌కి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఆయన రాజకీయ ప్రస్థానం నేటి తరం నాయకులకు ఒక స్ఫూర్తి. ఆయన మన మధ్య భౌతికంగా లేకపోయినా ఒక వైద్యుడిగా, ప్రజలకు దగ్గరైన రాజకీయ నాయకుడిగా, ప్రభావవంతమైన మంత్రిగా, స్పీకర్‌గా తెలుగు రాజకీయ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచారు. కోడెలతో కలిసి పనిచేయడం అదృష్టం. మరువలేని మహనీయుడు కోడెల. ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో, తెలుగుదేశం పార్టీ పుస్తకంలో తన కంటూ కొన్ని పేజీలు సృష్టించుకున్న మహానుభావుడికి నివాళులు అర్పిస్తూ...



○ చింతకాయల అయ్యన్నపాత్రుడు
అసెంబ్లీ స్పీకర్

(నేడు డా. కోడెల శివప్రసాద్ 6వ వర్ధంతి: సాయంత్రం ఆరు గంటలకు పల్నాడు జిల్లా, నరసరావుపేట మండలం, రావిపాడు గ్రామంలో విగ్రహావిష్కరణ)

చైనాతో భారత్ వ్యూహాత్మక చెలిమి

'అమెరికాతో శత్రుత్వం ప్రమాదకరం. అయితే, అమెరికాతో స్నేహం ప్రాణాంతకం' అని అమెరికా విదేశాంగశాఖ మాజీ మంత్రి, అంతర్జాతీయ రాజనీతిజ్ఞుడు హెన్రీ కిస్సింజర్ ఓ సందర్భంలో అన్నారు. అమెరికాకు భారత్ ఎగుమతి చేసే వస్తువులపై ఆ దేశం 50 శాతం సుంకాలు విధించడాన్ని బట్టి అది నిజమని మరోసారి నిరూపితమైంది. భారతదేశానికి అమెరికా గొప్ప మిత్ర దేశమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నో సందర్భాల్లో ప్రకటించారు. తనకు ట్రంప్ గొప్ప స్నేహితుడని, భారత్–అమెరికా మధ్య సంబంధాలు బలోపేతం కావడం తన ఘనతేనని కూడా చెప్పుకొన్నారు. అయితే, మోదీ అర్థం చేసుకోవాల్సిన వాస్తవం బోలెడుంది. అధ్యక్ష పీఠం మీద ఎవరు కూర్చున్నా అమెరికా అమెరికానే. ఆ దేశ విదేశాంగ విధానం దాని ప్రయోజనాల కేంద్రంగానే ఉంటుంది తప్ప, ప్రపంచం కోణం నుంచి కాదు.

ఈ మధ్య కాలంలో అమెరికా మనకు బాగా సన్నిహితమైందంటే దానికి కారణం చైనాయే. డ్రాగన్ దూకుడును నిలువరించడానికి అమెరికాకు భారత్ అవసరమైంది. భారతదేశంతో సత్సంబంధాలు కొనసాగించడం ద్వారా చైనా ప్రాబల్యాన్ని తగ్గించడానికి వీలవుతుందని అగ్రరాజ్యం భావించింది. అందులో భాగంగానే భారత్‌తో సత్సంబంధాలను పెంచుకున్నది. ఇది గుర్తించని మన ప్రధానమంత్రి అమెరికాలో ట్రంప్‌కు మద్దతుగా 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' అంటూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇది భారత విదేశాంగ విధానంలో ఊహించని మార్పు.

ఇక చైనా విషయాన్నే చూద్దాం. నా ఇటీవలి పర్యటనలో మౌలిక సదుపాయాల కల్పనలో చైనా ప్రగతిని చూస్తే ఆశ్చర్యమనిపించింది. మూడు దశాబ్దాల్లోనే చైనా పేద దేశం నుంచి ప్రపంచ పారిశ్రామిక పవర్‌హౌజ్‌గా ఎదిగింది. మరే దేశంతోనూ సంబంధం లేకుండానే డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సాధించింది. మనం వాడే గూగుల్, జీమెయిల్, గూగుల్ మ్యాప్స్, పేమెంట్ వ్యవస్థలను కాకుండా చైనా తమ ప్రజల కోసం ప్రత్యేక యాప్‌లను సొంతంగా తయారు చేసుకున్నది. ప్రపంచానికి కావలసిన అరుదైన ఖనిజాలన్నీ చైనా నుంచే ఎగుమతి అవుతున్నాయి. కంప్యూటర్లలో వాడే మైక్రోచిప్‌ల తయారీలో ఇవి కీలకం. సాంకేతికత, సమాచార భద్రత, బ్యాంకింగ్ కార్యకలాపాలు ఇలా అన్నిరకాల సేవలకు మైక్రోచిప్‌లు కావాల్సిందే. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ ఈ చిప్‌లపై ఆధారపడబోతున్నాయి. ఈ అంశంలో చైనాకు అరుదైన ఖనిజాల రూపంలో ప్రకృతి వరం ప్రసాదించింది.

రష్యా – ఉక్రెయిన్ యుద్ధం భారత్ – అమెరికా సంబంధాలకు, మోదీ – ట్రంప్‌ల స్నేహానికి పరీక్షగా నిలిచింది. వాస్తవానికి అమెరికా కంటే రష్యా దౌత్యపరంగా భారత్‌కు ఎంతో కీలక దేశం. రక్షణ అవసరాలపరంగా రష్యాపైనే భారత్ ఎక్కువగా ఆధారపడుతున్నది. ఎన్నో క్లిష్ట పరిస్థితుల్లో, భారత్‌కు వ్యతిరేకంగా ఐరాసలో జరిగిన చర్చల్లో, ఓటింగ్ సమయాల్లో రష్యా మనకు మద్దతుగా నిలిచింది. అయితే, ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధంతో పశ్చిమ దేశాలన్నీ రష్యాపై ఆంక్షలు విధించాయి. ఆ ఆంక్షలను కూడా దాటుకొని భారత్ రష్యా వద్ద చమురు కొంటున్నది. ఇది ట్రంప్ ఆగ్రహానికి కారణమై, భారత్‌పై సుంకాలతో విరుచుకుపడుతున్నారు.



ప్రస్తుతం బహుధ్రువ ప్రపంచం ఆవిర్భవిస్తోంది. మరోవైపు, సైబర్ ముప్పు పెరుగుతున్నది. ఏఐ, అంతరిక్షంలో పోటీతత్వం మొదలైంది. సార్వభౌమత్వ పరిధి అనేది భౌగోళిక సరిహద్దులను మించిపోయింది. సముద్ర జలాలపై ఆధిపత్యం, సమాచార, సాంకేతిక సార్వభౌమత్వం, సప్లయ్ చైన్ సెక్యూరిటీ ప్రపంచ దేశాల ఆర్థికవ్యవస్థలకు అత్యంత కీలకంగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు వివాదాల కారణంగా చైనాను దూరం చేసుకోవడం భారత్‌కు శ్రేయస్కరం కాదు. చర్చల ద్వారా సరిహద్దు సమస్యలను పరిష్కరించుకుంటూనే చైనాతో వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకోవాలి.

నెహ్రూ కాలం నుంచి పీవీ నరసింహారావు హయాం వరకు భారత్ అన్ని దేశాలతో సమదూరం (అలీన విధానం) పాటించింది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో ఓ వైపు అమెరికా కూటమి, మరోవైపు సోవియట్ కూటమి ఉన్న సమయంలోనూ భారత్ సమదూరం పాటించింది. టెక్నాలజీ అంతగా లేని కాలంలో ఈ విధానం బాగానే పనిచేసింది. కానీ, ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతున్నది. ఆహార పదార్థాలు, చమురు, వాణిజ్య అవసరాల కోసం ఒక దేశంపై మరో దేశం ఆధారపడక తప్పని పరిస్థితి. మరోవైపు, అమెరికా కేంద్రంగా ఉన్న అంతర్జాతీయ పవర్ సెంటర్ క్రమంగా మారుతున్నది. ఆసియాలో చైనా శక్తిమంతంగా మారి అమెరికాకు సవాలు విసురుతున్నది. పశ్చిమ దేశాల్లోనూ అంతర్గత విభేదాలు బయటపడుతున్నాయి. ఈ తరుణంలో భారత్ కూడా తన విదేశాంగ విధానాన్ని క్రమంగా మార్చుకుంటూ వచ్చింది. అలీన విధానం (నాన్ అలైన్‌మెంట్) నుంచి అన్ని దేశాలతో 'సత్సంబంధాలు' (మల్టీ అలైన్‌మెంట్) అనే విధానాన్ని ఎంచుకున్నది. అందుకే ఏక కాలంలో అమెరికా, చైనా, రష్యా దేశాలతో సంబంధాలు కొనసాగించింది. 2020 వరకు ఇది బాగానే సాగింది. ఆ ఏడాది జరిగిన గల్వాన్ ఘర్షణ తర్వాత పరిస్థితులు మారిపోయాయి.

గల్వాన్ ఘర్షణతో భారత్, చైనా మధ్య దూరం పెరిగింది. అమెరికాకు ఇండియా మరింత దగ్గరైంది. అయితే, విదేశాంగ విధానం కంటే ట్రంప్–మోదీ స్నేహం ఎక్కువగా వార్తల్లో నిలిచింది. అదే సమయంలో భారత్‌ను అమెరికా వ్యూహాత్మకంగా చైనా వ్యతిరేక కూటములు, చర్యల్లో భాగస్వామిని చేయడం ప్రారంభించింది. గల్వాన్ ఘర్షణ నేపథ్యంలో దేశీయంగానూ మోదీకి పెద్దగా వ్యతిరేకత ఎదురవ్వలేదు. కానీ, ఇజ్రాయెల్–గాజా, రష్యా–ఉక్రెయిన్ యుద్ధాలతో అంతర్జాతీయ సమీకరణాలు మారిపోయాయి. ఈ యుద్ధాల్లో భాగస్వాములైన అన్ని దేశాలతో సత్సంబంధాలు కలిగిన భారతదేశం ప్రస్తుతం నిర్ణాయక కూడలిలో నిలబడింది. ఈ సందర్భంలో భారత్ వ్యూహాత్మకంగా స్వయం ప్రతిపత్తితో వ్యవహరించాలి. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా నిర్ణయాలు తీసుకోవాలి. మిత్ర దేశాల (అమెరికా) ఒత్తిడికి తలొగ్గవద్దు.

ప్రస్తుతం ప్రపంచం మల్టీ పోలార్ వరల్డ్‌గా మారుతున్నది. మరోవైపు, సైబర్ ముప్పు పెరుగుతున్నది. ఏఐ, అంతరిక్షంలో పోటీతత్వం మొదలైంది. సార్వభౌమత్వ పరిధి అనేది భౌగోళిక సరిహద్దులను మించిపోయింది. సముద్ర జలాలపై ఆధిపత్యం, సమాచార, సాంకేతిక సార్వభౌమత్వం, సప్లయ్ చైన్ సెక్యూరిటీ ప్రపంచ దేశాల ఆర్థికవ్యవస్థలకు అత్యంత కీలకంగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు వివాదాల కారణంగా చైనాను దూరం చేసుకోవడం భారత్‌కు శ్రేయస్కరం కాదు. చర్చల ద్వారా సరిహద్దు సమస్యలను పరిష్కరించుకుంటూనే చైనాతో వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకోవాలి. అంతేకాకుండా మోదీ ప్రచారం చేస్తున్న ఆత్మనిర్భరతను ఆచరణలో వేగవంతం చేయాలి. ఆర్థికంగా బలపడినప్పుడే సార్వభౌమత్వం సాధ్యపడుతుంది. వాస్తవానికి అమెరికాకు చైనానే గట్టి పోటీదారు. కానీ, మిత్రదేశమైన ఇండియాపైన విధించిన సుంకాలను ట్రంప్ చైనాపై విధించే సాహసం చేయలేకపోయారు. దీనికి కారణం, చైనా ఆర్థిక వ్యవస్థ పరిమాణం, ప్రపంచ సప్లయ్ చైన్‌లో దాని వాటా. దీన్ని మనం గమనించాలి. చైనాతో సత్సంబంధాలను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను మోదీ ఆలస్యంగానైనా గుర్తించినట్టున్నారు. ట్రంప్ సుంకాల హూంకరింపుల వేళ ఆయన చైనాకు వెళ్లి ఎస్‌సీవో సదస్సులో పాల్గొన్నారు. తద్వారా, అమెరికా ఒత్తిడికి తలొగ్గబోమన్న సంకేతం ఇచ్చారు. ఇది భారత విదేశాంగ విధానంలో కీలక మలుపు. ఈ స్వయం నిర్ణయాధికారాన్ని మోదీ అలాగే కొనసాగించాలి. అలా కాకుండా, 'మీరు మమ్మల్ని దూరం చేసుకుంటే మేం చైనాకు దగ్గరవుతాం' అని సందేశం ఇవ్వకూడదు. చైనాతో భారత్ నిజమైన, పరస్పర విశ్వాసం పెంపొందేలా స్నేహ సంబంధాలు కొనసాగించాలి.

'మన మిత్రులను మనం ఎంచుకోవచ్చు. కానీ, మన పొరుగున ఎవరుండాలన్నది మనం నిర్ణయించలేం. వారిని మార్చలేం' అని వాజపేయి అనేవారు. చైనా మన పొరుగు, శక్తిమంతమైన దేశమన్న సంగతి ఎప్పుడూ మర్చిపోకూడదు. ఎన్ని విభేదాలున్నా దాన్ని విస్మరించలేమన్న వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకొని విదేశాంగ విధానాన్ని రూపొందించుకోవాలి. చైనాతో ద్వైపాక్షిక సంబంధాల పెంపు కోసం రెండు దేశాల్లోని ప్రధాన నగరాల మధ్య నేరుగా విమాన సర్వీసులను నడిపించాలి. రెండు దేశాల పౌరులకు ప్రత్యేకమైన వీసా సౌకర్యాలు కల్పించాలి. భారతీయ విద్యార్థులకు చైనాలో మెరుగైన అవకాశాలు లభించేలా మాండరిన్ భాష నేర్పించాలి. చైనా సంస్థలతో వ్యాపార సంబంధాలు పెరగాలి. ఈ క్రమంలో న్యాయపరమైన సవాళ్లు ఎదురైతే పరిష్కరించుకోవడానికి భారతదేశంలోని న్యాయసంస్థలు చైనా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి. భారత విద్యార్థులు చైనాలోని విద్యాసంస్థలను, చైనా విద్యార్థులు భారత విద్యాసంస్థలను సందర్శించేలా చర్యలు తీసుకోవాలి. తద్వారా రెండు దేశాల సంస్కృతులపై నవతరానికి అవగాహన వస్తుంది. ఇది ద్వైపాక్షిక సంబంధాల్లో ఎంతో దోహదం చేస్తుంది. ఈ కార్యక్రమాలను చేపడుతూనే జాతీయ నాయకత్వం బ్రిక్స్, ఎస్‌సీవో లాంటి సదస్సుల్లో తరచుగా పాల్గొని భారత్ గొంతుకను వినిపించాలి.

• బోయినపల్లి వినోద్‌కుమార్
పార్లమెంటు మాజీ సభ్యులు

1984: పోటెత్తిన తెలుగు పౌరుషం

స్వతంత్ర భారతావనిలో జరిగిన స్ఫూర్తిదాయక ప్రజాస్వామిక పోరాటాల్లో చరిత్రాత్మకమైనది– 1984 ఆగస్టులో ఎన్.టి. రామారావు సారథ్యంలో జరిగిన దేశవ్యాప్త ఉద్యమం. దేశ రాజకీయాలను మలుపు తిప్పిన ఆ పోరాటానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు 1984 జూలైలో గుండె చికిత్స నిమిత్తం అమెరికా వెళ్లారు. ఆ సమయంలో ఎన్టీఆర్‌ను పదవి నుంచి దించడం కోసం పార్టీలోని అసంతృప్తివాదులు ముఠాలు కట్టారు. రాజకీయ పాచికలు విసిరారు. వారికి కేంద్రంలోని పెద్దలు అభయ'హస్తం' అందించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం కూడా మద్దతు ప్రకటించింది. హైదరాబాద్ చేరుకొన్న ఎన్.టి. రామారావును ప్రభుత్వాన్ని అన్యాయంగా, అప్రజాస్వామికంగా, రాజ్యాంగ విరుద్ధంగా నాటి గవర్నర్ రామ్‌లాల్ కేవలం నోటిమాటతో బర్తరఫ్ చేశారు. ఆ స్థానంలో కీలుబొమ్మ ప్రభుత్వాన్ని కూర్చోబెట్టారు. తనకు మెజారిటీ శాసన సభ్యుల మద్దతు ఉందని, 48 గంటల్లో శాసనసభను సమావేశపరిస్తే తన బలం నిరూపించుకొంటానని ఎన్టీఆర్ సవాల్ చేస్తున్నా గవర్నర్ రామ్‌లాల్ విన్పించుకోకుండా ఆయనను అరెస్ట్ చేయించారు. ఎన్టీఆర్‌కు మద్దతుగా రాజ్‌భవన్‌కు వెళ్లిన శాసనసభ్యులనూ అరెస్ట్ చేయించారు. అరెస్టయిన శాసనసభ్యులు ఎన్టీఆర్‌తో సహా 161 అని లెక్క తేలింది. ఆ 'వార్త' కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న ఆకాశవాణిలో, దూరదర్శన్‌లో ప్రసారం అయింది.


ఎన్టీఆర్ అరెస్ట్ వార్త దేశ ప్రజల్ని నిర్ఘాంతపరిచింది. మెజారిటీ శాసనసభ్యుల బలం ఉన్న ఎన్టీఆర్‌ను ఏ నిబంధన కింద గవర్నర్ పదవీచ్యుతుణ్ణి చేసి, అరెస్ట్ చేయించారన్న ప్రశ్న తలెత్తింది. ఎన్టీఆర్‌కు మెజార్టీ లేదని గవర్నర్ రామ్‌లాల్ 'స్వీయ సంతృప్తి' చెందారు కనుక, రాజ్యాంగంలో సదరు నిబంధన ఒకటి ఉందన్న సాకు చూపి.. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజ్యాంగ హననాన్ని నాటి కాంగ్రెస్ పెద్దలు సమర్థించుకొన్నారు.

దేశంలో కొన్ని రాష్ట్రాలలో అధికారంలో ఉన్న కాంగ్రెసేతర పార్టీలను బలహీనపర్చడానికి కాంగ్రెస్(ఐ) పార్టీ అనేక అక్రమ మార్గాలు ఎంచుకొంది. అందులో భాగంగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం, పార్టీల్లో చీలికలు తేవడం, అసమ్మతి వర్గానికి మద్దతు ఇచ్చి దొడ్డిదారుల్లో వారిని అధికారంలో కూర్చోబెట్టడం.. కొన్నాళ్ల తర్వాత ఆర్టికల్ 356ను ప్రయోగించి ఆ కీలుబొమ్మ ప్రభుత్వాలను పడగొట్టడం కాంగ్రెస్(ఐ)కి రివాజుగా మారింది. ఈ రాజకీయ క్రీడలో కొందరు గవర్నర్లు కేంద్రానికి ఏజెంట్లుగా పనిచేశారు. ఫలితంగా 1947 నుంచి 1984 వరకు దేశంలో 26 కాంగ్రెసేతర ప్రభుత్వాలు అర్ధంతరంగా కూలిపోయాయి. అందులో కేరళలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ ప్రభుత్వం, జమ్మూకశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వం ఉన్నాయి. 1984 ఆగస్ట్ 16న ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వంపై వేటు వేశారు.

ఒకవైపు అనారోగ్యం ఇబ్బంది పెడుతున్నా, తన ధర్మపత్ని క్యాన్సర్‌తో ఆసుపత్రి బెడ్‌పై ఉండి మృత్యువుతో పోరాడుతున్నా ఎన్టీఆర్ మనోస్థైర్యం కోల్పోలేదు. "నా అనారోగ్యాన్ని అదనుగా తీసుకొని కేంద్రం నాపై పన్నిన కుట్రను ఎదుర్కొంటాను.. కేంద్రంలో కాంగ్రెస్(ఐ)ను గద్దె దించేవరకు, రాష్ట్రంలోని కీలుబొమ్మ ఫిరాయింపుదార్ల ప్రభుత్వాన్ని తొలగించే వరకు నేను విశ్రమించను" అని శపథం చేశారు.


ఫిరాయింపుదారులు, కేంద్రంలో అధికారంలో వున్న కాంగ్రెస్ పెద్దలు, రాష్ట్రంలో ప్రతిపక్షంలో వున్న కాంగ్రెస్ పార్టీ నేతలు ఉమ్మడిగా పాల్పడిన కుటిల రాజకీయానికి ఎన్.టి. రామారావు రాజకీయంగా బలైపోయారన్న నిజం గ్రహించిన రాష్ట్ర ప్రజానీకంలో ఆవేశం, ఆగ్రహం కట్టలు తెంచుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు వీధుల్లోకి వచ్చారు. బంద్‌లు, హర్తాళ్లు చేశారు. బస్సుల్ని నిలిపివేశారు. రైళ్లను ఆపేశారు. ఫిరాయింపుదారుల దిష్టిబొమ్మల్ని దహనం చేశారు. ప్రజాస్వామ్యాన్ని హరించి అధికారంలోకి వచ్చినవారు ఆందోళనకారులపై పోలీసు కాల్పులు జరిపించారు. పోలీసుల బుల్లెట్లకు పదుల సంఖ్యలో నిరసనకారులు ప్రాణాలొదిలారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమం దేశ రాజకీయాల దశ, దిశను మార్చింది. కాంగ్రెసేతర పక్షాల నడుమ ఐక్యతకు, అంశాల ప్రాతిపదికన కలిసి పనిచేయడానికి తగిన భూమిక ఏర్పడింది. ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువల పునరుద్ధరణకు 1984 ప్రజాస్వామ్య పోరాటం పలు విధాలా దోహదం చేసింది.



వేలాదిమంది ఉద్యమకారులు జైళ్ల పాలయ్యారు. తెలంగాణ, రాయలసీమ, ఆంధ్ర అనే భేదం లేదు. అన్ని చోట్లా ఒకే రకమైన దృశ్యం ఆవిష్కృతమైంది. యువకులు, విద్యార్థులు, రైతులు, లాయర్లు, మహిళలు పోరుబాట పట్టారు. సత్యాగ్రహాలు చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ రామ్‌లాల్ పాల్పడిన నీతిబాహ్య రాజ్యాంగ విరుద్ధచర్యను దేశంలోని కాంగ్రెసేతర పక్షాలన్నీ ముక్తకంఠంతో ఖండించాయి. ఆ పార్టీలన్నీ ఎన్.టి. రామారావుకు బాసటగా నిలిచాయి. దేశంలో మొట్టమొదటిసారిగా బీజేపీ, వామపక్షపార్టీలు కలిసి ఎన్టీఆర్ కోసం ఒకే వేదిక మీదకు వచ్చి ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమం చేపట్టాయి. గవర్నర్ రామ్‌లాల్‌ను రీకాల్ చేయాలని, కీలుబొమ్మ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావును తక్షణం డిస్మిస్ చేయాలని, ఎన్టీఆర్‌ను వెంటనే ముఖ్యమంత్రిని చేయాలన్న ప్రధాన డిమాండ్లతో వారి కార్యాచరణ మొదలైంది. జాతీయ స్థాయిలో 18 పార్టీల నాయకులతో అఖిలపక్ష సారథ్య సంఘం ఏర్పాటయింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలలో సాగించిన ఉద్యమం, పార్లమెంట్ ఉభయసభల్లో ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేయడం, ప్రజలలో ఉవ్వెత్తున ఎగసిన చైతన్యంతోపాటు.. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు దేశంలోని కొన్ని పత్రికలు సాగించిన అక్షర యుద్ధం చరిత్రాత్మకం. అలాగే, కీలుబొమ్మ ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి ఫిరాయింపుదారులు, వారికి మద్దతిచ్చిన కాంగ్రెస్ నేతలు ఎన్నో ఎత్తులు వేశారు. వాటన్నింటినీ దీటుగా ఎదుర్కొని ఎన్టీఆర్‌కు వెన్నంటి నిలిచిన ఎమ్మెల్యేలను చివరివరకు కంటికి రెప్పలా కాపాడిన నాయకుడు– నారా చంద్రబాబు నాయుడు. 1984 ఆగస్ట్ ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమంలో ఆద్యంతం ఆయన పోషించిన పాత్ర కీలకం. ఆయన ప్రదర్శించిన సమయస్ఫూర్తి, ముందుచూపు కారణంగానే.. ప్రత్యర్థుల ఆటలు సాగలేదు. ఆ సమయంలో కొందరు దుండగులు చంద్రబాబు ఇంటి మీద దాడి చేశారు. సంక్షోభ పరిస్థితులలో గొప్ప సంయమనంతో చంద్రబాబు తన విశిష్ట నాయకత్వ పటిమను ప్రదర్శించారు.



32 రోజులపాటు ఆంధ్రప్రదేశ్‌లో, దేశవ్యాప్తంగా సాగిన ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమం ముందు నియంతృత్వం తల వంచింది. సెప్టెంబర్ 16న తిరిగి ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రి పదవిని అధిష్ఠించారు. ఎన్టీఆర్‌కు తిరిగి అధికారం దక్కడం వెనుక ఎందరివో అసమాన త్యాగాలు ఉన్నాయి. కాంగ్రెసేతర పార్టీల మద్దతు, కర్ణాటకలోని రామకృష్ణ హెగ్డే ప్రభుత్వం అందించిన సహకారం, ఎం. వెంకయ్యనాయుడు, ఎస్. జైపాల్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, తదితర నాయకులు, మేధావులు, పాత్రికేయులు, ప్రజలు ఉమ్మడిగా చేసిన కృషి, ఉద్యమాల వల్ల ప్రజాస్వామ్యానికి ప్రాణప్రతిష్ఠ జరిగింది.

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమం దేశ రాజకీయాల దశ, దిశను మార్చింది. 1985లో పార్లమెంట్‌లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా ఫిరాయింపు నిరోధక చట్టం అమలులోకి వచ్చింది. గవర్నర్లకున్న విస్తృతాధికారాలపైన, ఆర్టికల్ 356 దుర్వినియోగం పైన విస్తృత చర్చకు ఆస్కారం ఏర్పడింది. శాసనసభ్యుల బలం తేల్చే వేదిక రాజ్‌భవన్ కారాదని, శాసనసభలోనే బలనిరూపణ జరగాలని స్పష్టం అయింది. అలాగే కేంద్ర, రాష్ట్ర సంబంధాలు, సమాఖ్య వ్యవస్థ బలోపేతం కావడానికి సర్కారియా కమిషన్ సూచనల అమలుకు మార్గం సుగమమైంది. అనంతర కాలంలో దేశంలోని కాంగ్రెసేతర పక్షాల నడుమ ఐక్యతకు, అంశాల ప్రాతిపదికన కలిసి పనిచేయడానికి తగిన భూమిక ఏర్పడింది. ఇంకా ఎన్నో విధాలుగా దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువల పునరుద్ధరణకు 1984 ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమం దోహదం చేసింది.

• టి.డి. జనార్ధన్
• విక్రమ్ పూల

(నేటి సాయంత్రం ఐదు గంటలకు విజయవాడ పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో '1984: ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమం, సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణ. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, సినీ నిర్మాత నందమూరి రామకృష్ణ ముఖ్యఅతిథులు.)



ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో జోగి రమేశ్‌ను అడ్డుకుంటున్న పోలీసులు



జోగి రాసుకుంటే బూడిద రాలుతుందా?

బూడిద కాలుష్యంపై జోగి రమేశ్ హడావిడి.. విమర్శలు

అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని ప్రశ్నలు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంపై మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ నానా యాగీ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మునుపెన్నడూ లేనంతగా, వైసీపీలో మంత్రిగా ఉండగా ఆయన ఏనాడూ స్థానిక ట్రాన్స్‌పోర్టర్ల సమస్యపై స్పందించింది లేదు. బూడిద కాలుష్యంపై మాట్లాడిందీ లేదు. ఇప్పుడేమో తనకు అనుకూలంగా మలచుకునేందుకు ఆయన నానా తంటాలు పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. స్థానిక ట్రాన్స్‌పోర్టర్లపై కపట ప్రేమ ఒలకబోస్తున్నారని కొందరు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇది రాజకీయ ఎత్తుగడలో భాగమేనంటున్నారు.

నాడు ఏమయ్యావ్ జోగీ.. : కూటమి నేతల ప్రశ్న

ఎన్టీటీపీఎస్ బూడిద సమస్యపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానంటూ సోమవారం ఆయన రోడ్డెక్కి నానా హడావిడి చేశారు. పోలీసులు మిగతా 6లో..

జోగి నోరు మున్సిపాలిటీ డ్రెయినేజీ

» ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ 6లో


డయేరియాపై సీరియస్

నగరంలో డయేరియాపై సీఎం చంద్రబాబు ఫైర్ అయ్యారు. ఇంతవరకు మూల కారణాలు ఎందుకు కనుగొనలేదని మండిపడ్డారు. అమరావతిలోని సచివాలయంలో సోమవారం జరిగిన కలెక్టర్ల సమావేశంలో డయేరియా అంశంపై సీఎం ప్రత్యేకంగా మాట్లాడారు. ఇప్పటికైనా వ్యాధిని నియంత్రణలోకి తీసుకురావాలని సూచించారు. కాగా, గోకులాల ఏర్పాటుపై కలెక్టర్ లక్ష్మీశ వివరణపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం ప్రతి జిల్లాలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మూలకారణాన్ని కనుగొనటంలో విఫలమయ్యారని సీఎం ఫైర్

యుద్ధప్రాతిపదికన నియంత్రించాలని ఆదేశాలు

- కలెక్టర్ల సమావేశంలో న్యూఆర్ఆర్‌పేట డయేరియాపై చర్చ
- జిల్లాలో గోకులాల ఏర్పాటుకు సహకరించాలని కోరిన కలెక్టర్
- రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఏర్పాటుకు హామీ ఇచ్చిన సీఎం
- జీడీడీపీలో ఎన్టీఆర్ జిల్లాకు 9, కృష్ణాజిల్లాకు 15వ స్థానం
- స్వర్ణాంధ్ర కేపీఐ స్కోర్‌లో ఎన్టీఆర్ జిల్లాకు మూడోస్థానం
- జిల్లాలు, మండలాలవారీగా స్కోర్ల ప్రకటన





అమరావతిలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా కేసులు ప్రబలటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. డయేరియా వ్యాప్తికి ఇప్పటికీ మూలకారణాన్ని కనుగొనలేక పోవటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. డయేరియా వచ్చి చాలారోజులు అవుతున్నా ఇంకా కేసులు పెరుగుతుండటంపైనా ఆయన మండిపడ్డారు. యుద్ధప్రాతిపదికన మూలకారణాన్ని తెలుసుకుని చర్యలు తీసుకోవాలని సూచించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) పరిధిలో జరిగిన ఈ వ్యవహారంపై మున్సిపల్ యంత్రాంగ నిర్లిప్తతపై ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. అమరావతిలోని సచివాలయంలో సోమవారం జరిగిన కలెక్టర్ల సమావేశంలో ప్రజారోగ్యానికి సంబంధించి చర్చకు వచ్చిన సందర్భంలో ముఖ్యమంత్రి న్యూరాజ రాజేశ్వరిపేట డయేరియా అంశంపై మాట్లాడారు. మున్సిపల్ యంత్రాంగాన్ని తట్టిలేపి.. పరిస్థితులు చక్కబడేలా చూడాల్సిందిగా కలెక్టర్ లక్ష్మీశను ఆదేశించారు. కాగా, ఎన్టీఆర్ జిల్లా వృద్ధికి తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ లక్ష్మీశ చంద్రబాబుకు వివరించారు. జీడీడీపీ పెంచటానికి, పాడిపరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఎన్టీఆర్ జిల్లాలో గోకులాలు (యానిమల్ హాస్టల్స్) ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. పాడి ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించటంతో పాటు వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. గోకులాలకు ప్రభుత్వం నుంచి తగిన సహకారం కావాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా మిగతా 6లో..

జీడీడీపీలో ఇలా..

స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి (జీడీడీపీ)లో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలో తొమ్మిదో స్థానంలో నిలిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎన్టీఆర్ జిల్లాకు రూ.1,12,057 కోట్ల జీడీడీపీ (18.50%) నిర్దేశించగా, మొదటి క్వార్టర్‌లో రూ.21,988 కోట్ల (19.62%) జీడీడీపీ సాధించింది. మిగిలిన మూడు క్వార్టర్లకు కలిపి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్ రూ.90,069 కోట్ల (80.38%) ఆదాయాన్ని సాధించాల్సి ఉంది. కృష్ణాజిల్లా 15వ స్థానంలో నిలిచింది. ఆర్థిక సంవత్సరానికి రూ.1,02,521 కోట్ల (16.84%) జీడీడీపీ లక్ష్యం నిర్దేశించగా, మొదటి క్వార్టర్‌లో రూ.19,196 కోట్లు (18.72%) సాధించింది. మిగిలిన మూడు క్వార్టర్లకు సంబంధించి రూ.83,324 కోట్ల (81.28%) జీడీడీపీ సాధించాల్సి ఉంది.

ఆయుధాలే ఆభరణాలు

దుర్గమ్మకు త్రిమూర్తులు సహా ఇంద్రాది దేవతల బహూకరణ

కౌంట్‌డౌన్ 6 రోజులు

- వాటితోనే దుష్టరాక్షస సంహారం
- ఒక్కో ఆయుధానికి ఒక్కో విశిష్టత
- త్రిశూలం, సుదర్శనం, ఖడ్గం, బాణం, విల్లు, గధ, వజ్రాయుధం, దివ్యశంఖం, దివ్యాస్త్రం, గొడ్డలి, కమలానికి ఎన్నో పురాణగాథలు 6

నేడు పోరంకికి సీఎం చంద్రబాబు

ఎన్టీఆర్ ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమం 'సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణ

పెనమలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : 1984లో కేంద్ర ప్రభుత్వం కుట్రతో ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడ్ని చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం, ఆ తర్వాత ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడిన ఎన్టీఆర్ స్ఫూర్తితో రాష్ట్రంలో, దేశంలో జరిగిన అనేక మార్పులపై విక్రం పూల బృందం రచించిన 'సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణ మంగళవారం సాయంత్రం 5 గంటలకు పోరంకి మురళీ రిసార్ట్స్‌లో జరుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ టీడీ జనార్ధన్, నందమూరి రామకృష్ణ హాజరవుతారు.

1,198 టీచర్ పోస్టుల భర్తీ

ఉమ్మడి కృష్ణాజిల్లాలో డీఎస్సీ అభ్యర్థుల జాబితా విడుదల

ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ-2025కు సంబంధించి 1,198 టీచర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల తుది జాబితాను ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఈ మేరకు ఈనెల 19న ఎంపికైన టీచర్లకు నియామక ఉత్తర్వులు అందజేయనున్నారు. మచిలీపట్నంలోని డీఈవో కార్యాలయం నోటీసు బోర్డులో ఈ జాబితాను అందుబాటులో ఉంచారు.

- 1,208 పోస్టులకు గానూ 1,198 పోస్టులకు ఓకే
- మిగతా 10 పోస్టులకు అనర్హత.. భర్తీ నిలిపివేత
- 19న పోస్టింగ్ ఉత్తర్వులు అందజేత
- మచిలీపట్నం డీఈవో కార్యాలయంలో జాబితా ప్రదర్శన
- ఎక్కడికక్కడ హెల్ప్‌డెస్కుల ఏర్పాటు : డీఈవో



ఈనెల 19న అమరావతిలో డీఎస్సీ అభ్యర్థులకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసే కార్యక్రమానికి ముస్తాబవుతున్న వేదిక

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1,208 టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఏప్రిల్ 25న ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో టీచర్ పోస్టుల కోసం 67,470 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఆగస్టు 12న మార్కులను, ఈ తరువాత ర్యాంకులను విడుదల చేశారు. సర్టిఫికెట్లను పరిశీలించాక 1,198 పోస్టులను భర్తీ చేసేందుకు తుది జాబితాను ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 10 టీచర్ పోస్టులకు సంబంధించి అభ్యర్థులు అర్హత సాధించకపోవడంతో భర్తీని నిలిపివేశారు. ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన జాబితాను సోమవారం డీఈవో కార్యాలయం నోటీసు బోర్డులో ఉంచారు. దీంతోపాటు డీఎస్సీ-2025 వెబ్‌సైట్‌లో మిగతా 6లో..

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో..

విజయవాడ, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని పాఠశాలల్లో ఎస్‌ఏ తెలుగులో ఒక పోస్టు, ఎస్‌ఏ ఇంగ్లీష్‌లో 3, ఎస్‌ఏ మేథమెటిక్స్‌లో 3, ఎస్‌ఏ బయలాజికల్ సైన్స్‌లో 3, ఎస్‌ఏ సోషల్ స్టడీస్‌లో 2, ఎస్‌ఏ సోషల్ స్టడీస్ ఉర్దూ విభాగంలో ఒక పోస్టును భర్తీ చేయనున్నారు. ఎస్‌జీటీ విభాగంలో 58 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎస్‌జీటీ ఉర్దూ విభాగంలో 10 పోస్టులు ఉండగా, ఏడుగురే అర్హత సాధించారు. మిగిలిన మూడు పోస్టులకు అభ్యర్థులు అర్హత సాధించకపోవడంతో నిలిపివేశారు.

చిల్లర పనులు

దుర్గగుడి కేశఖండన శాలలో దోపిడీ

- టికెట్ రూ.40 అయితే, రూ.50 వసూలు
- మిగతా రూ.10 సిబ్బంది జేబుల్లోకి..
- ప్రశ్నించిన భక్తులకు చిల్లర లేదని సమాధానం
- తలనీలాల అనంతరం మరో రూ.50 వసూలు



ఉత్తరాంధ్ర నుంచి ఓ భక్తుడు ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చాడు. ముందుగా అమ్మవారికి తలనీలాలు సమర్పించాక దర్శనానికి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. కేశఖండన శాల కౌంటర్‌లోకి వెళ్లి టికెట్ తీసుకోవడానికి రూ.100 ఇచ్చాడు. కౌంటర్‌లోని సిబ్బంది టికెట్‌తో పాటు తిరిగి రూ.50 చేతిలో పెట్టారు. టికెట్ రూ.40 కదా.. ఇంకా తనకు పది రూపాయలు వస్తాయని భక్తుడు అడిగాడు. తమ వద్ద చిల్లర లేదని కౌంటర్‌లోని సిబ్బంది సమాధానం చెప్పి ఆ భక్తుడిని పంపేశారు.

తెలంగాణాకు చెందిన ఓ భక్తుడు కుటుంబంతో కలిసి ఇంద్రకీలాద్రి వచ్చాడు. అమ్మవారికి తలనీలాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. కేశఖండన శాలలోకి వెళ్లి కౌంటర్‌లో ఉన్న సిబ్బందికి రూ.50 ఇచ్చాడు. దేవస్థానం నిర్ణయించిన టికెట్ ధర రూ.40. టికెట్‌తో పాటు రూ.10 తిరిగి ఇవ్వాల్సిన సిబ్బంది ఆ పని చేయలేదు. టికెట్ మాత్రమే చేతిలో పెట్టారు. పది రూపాయలు వస్తుందని భక్తుడు అడిగితే చిల్లర లేదని చెప్పి పంపేశారు.

ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తుల నుంచి సిబ్బంది ఎలా డబ్బు దండుకుంటున్నారో తెలియజేసే ఘటనలివి. ఇంద్రకీలాద్రిని కొంతమంది దళారులు, ఉద్యోగులు ఆదాయ వనరుగా మార్చేసుకుంటున్నారు. చిల్లర లేదు.. అన్న ఒక్కమాటతో కేశఖండన శాలలో భక్తుల నోళ్లను మూయించేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇంద్రకీలాద్రికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ముందుగా కేశఖండన శాలలోకి వెళ్లి తలనీలాలు సమర్పిస్తారు. తర్వాత దుర్గాఘాట్‌లో స్నానంచేసి దర్శనానికి వెళ్తారు. సాధారణ రోజుల్లో 25 వేల నుంచి 30 వేల మంది భక్తులు వివిధ మిగతా 6లో..

ఆక్రమిత భూములకు విముక్తి

గన్నవరంలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు కమిటీల ఏర్పాటు

- గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు, విజయవాడ మండలాల పరిధిలో..
- వైసీపీ హయాంలోని ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి
- ఎమ్మెల్యే యార్లగడ్డ చొరవతో కమిటీ ఏర్పాటుచేసిన ఇరు జిల్లాల కలెక్టర్లు
- క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం సమగ్ర నివేదిక



విజయవాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో గన్నవరం నియోజకవర్గంలో అక్రమార్కులు చెరపట్టిన ప్రభుత్వ భూములకు విముక్తి కలగనుంది. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో కోట్ల విలువచేసే ప్రభుత్వ భూములను కొట్టేసిన వారి నుంచి తిరిగి స్వాధీనం మిగతా 6లో..



మార్పు మంచిదే..

విజయవాడ రైల్వేస్టేషన్‌ను మరో ప్రాంతానికి మారిస్తే ఎలా ఉంటుంది? దక్షిణ కోస్తా రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎంయూ) అగ్రనాయకత్వం మాత్రం మారిస్తేనే బాగుంటుందని సూచిస్తోంది. బెజవాడ ఏ1 రైల్వేస్టేషన్‌ను అజిత్‌సింగ్‌నగర్‌కు రీలొకేషన్ చేయాలనే ప్రతిపాదనను తీసుకొచ్చింది. ట్రాఫిక్ కష్టాల నేపథ్యంలో దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఆవిర్భవించాక విజయవాడ డివిజన్ ముఖచిత్రం ఎలా ఉండాలన్న దానిపై ఎస్‌సీఆర్ఎంయూ అధ్యయనం చేసి, రైల్వే డివిజనల్, జోనల్ ఉన్నతాధికారులతో పాటు రైల్వేబోర్డుకు ఈ మేరకు ప్రతిపాదించడానికి సిద్ధమవుతోంది.

బెజవాడ రైల్వేస్టేషన్‌ను సింగ్‌నగర్‌కు రీలొకేషన్ చేయాలని ప్రతిపాదన

సింగ్‌నగర్‌లో కొత్త స్టేషన్ ఏర్పాటు చేయాలని హితవు

- ఎస్‌సీఆర్ఎంయూ కొత్త అధ్యయనంలో సూచనలు
- త్వరలో రైల్వే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రైల్వే స్టేషన్‌ను అజిత్‌సింగ్‌నగర్‌లో ఏర్పాటు చేయటం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని దక్షిణ కోస్తా రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎంయూ) సూచిస్తోంది. గతంలో సత్యనారాయణపురం రైల్వేలైన్‌ను తొలగించి బీఆర్‌టీఎస్ రోడ్డును నిర్మించినందుకు రైల్వేకు ప్రభుత్వం సింగ్‌నగర్‌లో 25 ఎకరాలు ఇచ్చింది. ఈ భూములను తిరిగి ప్రభుత్వానికి సరండర్ చేసి.. సింగ్‌నగర్‌లోనే మెయిన్ లైన్ వెంబడి సువిశాల రైల్వేస్టేషన్ కోసం మిగతా 6లో..

వన్‌టౌన్, టూటౌన్‌కు వెసులుబాటు

నగరంలో వన్‌టౌన్, టూటౌన్‌కు ప్రస్తుత విజయవాడ రైల్వేస్టేషన్ అడ్డుగోడగా ఉంది. రైల్వేస్టేషన్‌ను రీ లొకేట్ చేయటంతో పాటు ఎలివేట్ కారిడార్ల వల్ల వన్‌టౌన్, టూటౌన్ ప్రాంతాలు అనుసంధానమవుతాయి. మధ్యలో అనేక మార్గాలు ఏర్పడతాయి. దీనివల్ల బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు, లోబ్రిడ్జి, కాళేశ్వర రావు మార్కెట్ వైపు ట్రాఫిక్ తగ్గుతుంది.

13 మందికి ఎండీవోలుగా పదోన్నతి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఖాళీగా ఉన్న 13 ఎండీవో పోస్టులను పదోన్నతులతో భర్తీ చేశారు. ఏవోలుగా పనిచేస్తున్న నలుగురికి పదోన్నతులు కల్పించగా, ఈవోఆర్డీలుగా పనిచేస్తున్న తొమ్మిది మందికి పదోన్నతులు మిగతా 6లో..

దసరా ఏర్పాట్లపై ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వండి

- దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్
- ఇంద్రకీలాద్రిపై ఏర్పాట్ల పరిశీలన

6

మహిళ మృతదేహంతో ధర్నా

- మృతికి కారణమైన హిజ్రాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- గిరిపురంలో ఉద్రిక్తత.. ఏసీపీ హామీతో ఆందోళన విరమణ

8

గాంధీకొండ పునర్వైభవానికి కృషి

- పిల్లల రైలు పునరుద్ధరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు
- మహాత్ముడితో జ్ఞాపకాలను పంచుకోండి : జంధ్యాల శంకర్

శక్తిస్వరూపిణీ

ఆయుధాలే ఆభరణాలుగా కనకదుర్గమ్మ







మహిషాసుర సంహారం అనంతరం విజయవాడ కనకదుర్గమ్మ స్వయంభువుగా కొండపైకి వచ్చారని పురాణ కథనం.. కీలుడనే యక్షుడు తపస్సుచేసి నిత్యం తన భుజాలపై అమ్మవారు ఉండేలాగా వరం పొందాడు. ఆ తరువాత కీలుడు కొండగా మారాడు. ఇక్కడ కొలువైన అమ్మవారికి ఇంద్రాది దేవతలు పరిపరివిధాలుగా కీర్తించి ఆమెను పూజించారు. దీంతో ఇంద్ర కీలం పేరు స్థిరమైంది. యక్షుడికి ఇచ్చిన వరం మేరకు ఇంద్రకీలాద్రిపై అమ్మవారు భక్తులకు కోటి సూర్యకాంతులతో దర్శనమిస్తూ పూజలందుకుంటున్నారు.

కౌంట్‌డౌన్ 6 రోజులు

(ఆంధ్రజ్యోతి, ఇంద్రకీలాద్రి)

మహిషాసుర సంహారం అనంతరం ఉగ్రరూపంలో ఉన్న కనకదుర్గమ్మకు తొలినాళ్లలో వామాచార విధానంలో అర్చనలు చేసేవారు. వామాచారం అంటే జంతుబలులు, తదితరాలతో దుర్గమ్మకు నైవేద్యాలు పెట్టి కొలిచేవారు. వేల సంవత్సరాల నుంచి అక్కడ కొలువై ఉన్న దుర్గమ్మవారిని కాలక్రమేణా 8వ శతాబ్ధంలో కాలినడకన వచ్చిన ఆది శంకరాచార్యులవారు దర్శించుకుని ఆమె ఉగ్రరూపాన్ని చూసి దివ్యాభరణ భూషిత అయిన లలిత మనోహర సుందరమూర్తిగా దర్శనమివ్వాలని కోరగా.. అమ్మవారి అనుమతితో ఉగ్ర రూపాన్ని తీసివేసి, ఆమెకు సకల జన మనోహర



హృదయరంజిత సుశోభిత రూపం కల్పించారు. అప్పటి నుంచి ఆమెకు ఆభరణాలు ధరింపజేయటం, అలంకారాలు చేయటం జరుగుతున్నాయి.

● శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కంధమాత, కాత్యాయినీ, కాలరాత్రి, భైరవి, సిద్ధిధాత్రి అనే నవదుర్గల రూపాలు అంతరంగా ఉన్నప్పటికీ, దసరా మహోత్సవాలలో స్వర్ణకవచ అలంకృత దుర్గగా, బాల త్రిపుర సుందరిగా, లలితా త్రిపుర సుందరిగా, గాయత్రిగా, అన్నపూర్ణగా, మహాలక్ష్మిగా, సరస్వతిగా, మహిషాసుర మర్ధినిగా, రాజరాజేశ్వరిగా అలంకరిస్తారు. నవరాత్రుల్లో అలంకారాలను బట్టి అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలను ధరింపజేస్తారు.

● ముఖ్యంగా అమ్మవారి చేతులలో ఉండే ఆయుధాలను పురాణాల ప్రకారం ఆభరణాలుగా భావిస్తారు. ఇక అలంకారం నిమిత్తం నవరత్నాలు పొదిగిన వివిధ రకాల హారాలు, ముక్కుపుడక, చెవిదిద్దులు, బంగారు గాజులు, కిరీటం, వడ్డాణం వంటివి ధరింపజేస్తారు. అలంకారాల విశేషతలను బట్టి వాహనాలు, ఆసనాలు తదితరాలను ఏర్పాటు చేస్తారు. సరస్వతీదేవికి నెమలి వాహనం, వీణ వంటివి ధరింపజేస్తారు. అన్నపూర్ణాదేవికి శివుడు భిక్షాటన చేస్తున్నట్టు, అమ్మవారు పాయాసాన్ని వడ్డిస్తున్నట్టు ఆవిష్కరింపజేస్తారు. మహిషాసుర మర్ధినిగా మహిషవాహనంపై మహిషుడిని సంహరిస్తున్నట్టుగా ఆవిష్కరింపజేస్తారు.

● ఒక్కో అలంకారానికి ఒక్కో విశిష్టత ఉంది. స్వర్ణ కవచ అలంకృత దుర్గాదేవిని దర్శించుకున్నట్టయితే ఆమె ధరించిన స్వర్ణ కవచం నుంచి వెలువడే కాంతులు భక్తులపై పడటంతో వారికి కూడా శత్రు భయం ఉండదని, భూత, పిశాచాది బాధలు తొలగిపోతాయని.. సరస్వతీదేవి అలంకారాన్ని దర్శించుకుంటే జ్ఞానం కలుగుతుందని భక్తుల నమ్మిక. రాజరాజేశ్వరి అలంకారానికి ప్రత్యేకత ఉంది. ఆమెకు చిద్రూపి, పరదేవతా అని పేరు. శాంతమూర్తి. భక్తులకు శాంతి సుఖాలను కలుగజేస్తు అభయమిస్తున్నట్టుగా చెరకు గడను, కమల పుష్పాన్ని ధరించి ఉంటుంది. ఆమె శ్రీచక్ర సంచారిణి. శ్రీమాతా, శ్రీమహారాజ్ఞిగా లోకాలన్నింటికీ తల్లిగా భావించి భక్తులు ఆమెను కొలుస్తారు. నవరాత్రులు అంటేనే చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా భావిస్తారు. అత్యంత వైభవంగా పదిరోజుల పాటు దసరా మహోత్సవాలు జరుగుతుంటాయి. ఈసారి తిథుల హెచ్చుల తగ్గుల కారణంగా కనకదుర్గగుడిలో 11 రోజుల పాటు దసరా ఉత్సవాలు జరగనున్నాయి.

● అమ్మవారి కిరిటానికి అటుపక్క, ఇటుపక్క సూర్య, చంద్రుల ఆభరణాలు ఉంటాయి. వివిధ రకాల హారాలు చంద్రహారం, నవరత్నాలు పొదిగిన హారం, పచ్చలు పొదిగిన హారం, ముత్యాల హారం ఇలా ఎన్నోరకాల హారాలను ధరింపజేస్తారు. అమ్మవారికి వడ్డాణం, చేతి కడియాలు, అరవంకీలు, తదితరాలు ఆయా అలంకారాలను బట్టి ధరింపజేస్తూ ఉంటారు. ఏరోజుకారోజే ఆభరణాలను మార్చి అలంకారం చేస్తుంటారు. భక్తులు వారి మొక్కులు తీర్చుకునే సందర్భంలో వివిధ రకాల ఆభరణాలను కానుకగా అందచేస్తారు. ఈ ఆభరణాలనే అమ్మవారికి విశేషంగా అలంకరిస్తారు.

దుష్టరాక్షస సంహారం కోసం అమ్మవారు ప్రత్యేకంగా అవతరించారు. ఆ సమయంలో ఆమెకు సకల శక్తులు సమకూర్చటం కోసం బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, ఇంద్రాది దేవతలు ఆమెకు ఆయుధాలను అందజేస్తారు. ఆ ఆయుధాలకు అన్నింటికీ ఒక్కో ప్రత్యేకత ఉంది. దాంతో ఆమె శక్తిస్వరూపిణీ అయ్యింది. ఆమె మహిషాసురుడిని త్రిశూలంతో సంహరిస్తుంది. త్రిశూలం అతిముఖ్యమైన ఆయుధంగా ఆమె కుడిచేతికి దివ్య ఆభరణంగా ఉంటుంది. శివుడు ఆమెకు త్రిశూలం కానుకగా ఇచ్చాడు. సృష్టి, స్థితి లయకారిణిగా ఉండటమే ఈ త్రిశూల ఆయుధ నేపథ్యం. సుదర్శన చక్రం మహావిష్ణువు ఆమెకు అందజేశారు. ఈ సుదర్శనచక్రం ఎందరో రాక్షసులను సంహరించింది. సుదర్శన చక్రానికి ఎదురేలేదని చెబుతారు. సుదర్శన చక్ర దర్శనంతో భక్తులకు సర్వరోగ ప్రశమనం కలుగుతుందని, శత్రుభీతి ఉండదని నమ్మిక. అమ్మవారు తనకు కాపలాగా ఉండేందుకు ఒక ప్రతిమను చేసి ప్రాణప్రతిష్ఠ చేసి గుమ్మం దగ్గర పెట్టిన సమయంలో శివుడు రావటం ఆయనను అడ్డుకోవటంతో ఆ ప్రతిమను సంహరించటం, ఆ తరువాత జరిగిన పరిణామంలో ఏనుగు తలను తీసుకువచ్చి ఆ ప్రతిమకు పెట్టి, వినాయకుడి పేరు పెట్టటం జరుగుతుంది. ఆ వినాయకుడే తన తల్లికి కానుకగా ఖడ్గంను కానుకగా ఇచ్చాడు. ఈ ఖడ్గాన్ని విశిష్టమైనదిగా భావిస్తారు. వాయుదేవుడు బాణాన్ని, విల్లును ఇచ్చాడని ప్రతీతి. యమధర్మరాజు గధను ఇచ్చాడని, ఇంద్రుడు వజ్రాయుధాన్ని ఇచ్చాడని, వరుణుడు దివ్య శంఖాన్ని ఇచ్చాడని, అగ్నిదేవుడు శక్తి అనే దివ్యాస్త్రాన్ని ఇచ్చాడని, విశ్వకర్మ గొడ్డలి ఇచ్చాడని, బ్రహ్మదేవుడు కమలాన్ని ఇచ్చాడని పురాణగాథలు.

దసరా ఉత్సవ మొబైల్ యాప్ ఆవిష్కరణ

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవాలు-2025 సందర్భంగా భక్తులకు మార్గదర్శకత్వం చేసే దసరా ఉత్సవ మొబైల్ యాప్, చాట్ బాట్‌లను దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఈవో వి.కె.శీనానాయక్‌లు ఆవిష్కరించారు. అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ సంస్థ రూపొందించిన ఈ సాంకేతిక సదుపాయాలు భక్తులకు ఉపయోగపడతాయని కమిషనర్ ఆకాంక్షించారు. ప్లే స్టోర్, యాప్ స్టోర్‌లో దసరా-2025 పేరుతో యాప్, 9441820717 నెంబర్‌తో చాట్ బాట్ అందుబాటులో ఉందని, అమ్మ అని మెసేజ్ సెండ్ చేస్తే సమాచారం వస్తుందని తెలిపారు. యాప్‌లో ఒకే ప్లాట్‌ఫారంలో సింగిల్ విండో డిజిటల్ సొల్యూషన్‌ను అనుసంధానం చేశారు. ఐకాన్ వారీగా చూస్తే దర్శన సమయాలు, అమ్మవారికి దసరా ఉత్సవాలలో నిర్వహించే అలంకారాలు, సేవ బుకింగ్, క్యూఆర్ ఆధారిత సేవా నమోదు, దేశ, విదేశాల భక్తులు ఉత్సవాలను ఎక్కడనుంచైనా వీక్షించేందుకు ప్రత్యక్ష ప్రసారాలు, ప్రసాదాల విక్రయాల కౌంటర్లు, ప్రసాదం అందుబాటు, కౌంటర్ లొకేషన్, క్యూ ఎంతపొడవు ఉన్నదన్న వివరాలు కూడా ఈ యాప్‌లో తెలిసేందుకు అవకాశం ఉంది. దేవస్థానం బస్సుల ట్రాకింగ్, పార్కింగ్ కోసం స్లాట్‌లు, మ్యాప్ నేవిగేషన్, ప్రథమ చికిత్స, పోలీస్, ఫైర్, ఆసుపత్రిల కాంట్రాక్ట్‌లు, మరుగుదొడ్ల లొకేషన్, మంచినీటి సౌకర్యాలు, చిన్నారుల భద్రత, ఆలయ సమాచారం, చరిత్ర, ప్రత్యేక ఈవెంట్లు, దాతలు, వలంటీర్లకు సంబంధించిన డ్యూటీ వివరాలు, ప్రత్యేక సౌకర్యాలు వంటివి ఉంటాయి. అభిప్రాయాలు తెలియజేసేందుకు, ఫిర్యాదులు చేసేందుకు ఫీడ్ బ్యాక్ వంటి సదుపాయాలు ఈ యాప్‌లో ఉన్నాయి. రియల్ టైమ్ అలెర్ట్‌లు, అత్యవసర ప్రకటనలు ఉన్నాయి. చాట్ బాట్‌ను అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ ప్రవేట్ లిమిటెడ్, దుర్గగుడి ఐటీ విభాగం కలిసి రూపొందించారు.చాట్ బాట్ భక్తులకు సురక్షితమైన సౌకర్యవంతమైన పారదర్శక దర్శనం అందించే ప్రధాన డిజిటల్ సాధనమని దుర్గగుడి అధికారులు పేర్కొన్నారు.



దసరా ఉత్సవ మొబైల్ యాప్, చాట్‌బాట్‌లను ఆవిష్కరిస్తున్న దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్



దసరా ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్

దసరా ఏర్పాట్లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వండి

» దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దసరా ఏర్పాట్లపై 48 గంటలల్లోగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వాలని.. ప్రతిష్టాత్మకంగా జరుగబోయే దసరా ఉత్సవాలకు అన్నివిధాల అధికారులు సన్నద్ధం కావాలని, భక్తుల సౌకర్యాల విషయంలో ఏకాభిప్రాయం కలిగి ఉండాలని దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ అన్నారు. దసరా శరన్నవరాత్రుల ఏర్పాట్లను ఈవో శీనానాయక్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. కనకదుర్గానగర్, కొత్త లడ్డూపోటు, అన్నదాన భవనం తదితరాలను అధికారులతో కలిసి పరిశీలించి, పలు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా రామచంద్రమోహన్ మాట్లాడుతూ, దేవస్థానం ఆవరణలో జరుగుతున్న పనుల్లో 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను అదనపు కార్యనిర్వాహక ఇంజనీర్ల సహకారంతో 48 గంటల్లోగా పూర్తిచేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను సమర్పించాలని, నిర్దేశించిన సమయంలోగా మిగిలిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

దుర్గమ్మ సేవలో శేఖర్‌మాస్టర్



ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను సోమవారం విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన ప్రముఖ డాన్స్ మాస్టర్ శేఖర్ మాస్టర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు.



వినగడప వద్ద భారీగా ప్రవహిస్తున్న కట్టలేరు వాగు

తగ్గని వరద ఉధృతి..

గ్రామాలకు నిలిచిన రాకపోకలు

తిరువూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఎగువన తెలంగాణ ప్రాంతంలో పడుతున్న వర్షాలకు కట్టలేరు వాగు, నియోజకవర్గం పరిధిలోని పలువాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గంపలగూడెం మండలం వినగడపవద్ద కట్టలేరు ఉధృతితో రాకపోకలు పూర్తిగా స్తంభించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరువూరు మండల పరిధిలోని విప్లవవాగు, వెదుళ్ల వాగు, పడమటి వాగు, గుర్రపువాగులు, వినగడప వద్ద కట్టలేరులో కలుస్తుండటంతో, ఆప్రాంతంలో నీటి ప్రవాహం ఉధృతంగా మారింది. గతంలో బ్రిడ్జి కొట్టుకుపోవడంతో రాకపోకలకు వీలుగా, డైవర్షన్ రహదారి నిర్మించారు. ఇటీవల భారీ వర్షాలు, వరదలకు డైవర్షన్ రహదారి దెబ్బతినడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కట్టలేరుకు ఎగువన వినగడప, నారికింపాడు, అనుముల్లంక తదితర సుమారు 10 గ్రామాల ప్రజలు, తెలంగాణ ప్రాంతానికి చెందిన గ్రామాల ప్రజలు, మండల కేంద్రమైన గంపలగూడెం వచ్చేందుకు, తిరువూరు గ్రామాల మీదుగా రాకపోకలు సాగించవల్సి వస్తున్నది. ప్రభుత్వం స్పందించి వినగడప వద్ద బ్రిడ్జి నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

జోగి రాసుకుంటే బూడిద రాలుతుందా?

(5వ పేజీ తరువాయి)

ఆయన్ను అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూడిద కాలుష్యంతో అనారోగ్యం పాలవుతున్నామని, వెంటనే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పెట్టాలని జెన్‌కో, ఎన్టీటీపీఎస్ యాజమాన్యాన్ని కోరతానన్నారు. స్థానిక ట్రాన్స్‌పోర్టర్లకు బూడిదను పంచేందుకు తాను సిద్ధమని, అఖిలపక్ష పార్టీలు తనతో కలిసి రావాలని కోరారు. స్థానికంగా నిల్వ ఉన్న బూడిదను బుధవారం పంచేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. అయితే, ఆయన వ్యాఖ్యలను కూటమి నేతలు ఖండిస్తున్నారు. 'ఇన్నాళ్లూ ఏమైపోయావ్.. జోగీ..' అని ప్రశ్నిస్తున్నారు. కేవలం రాజకీయ ఉనికి కోసం కపట ప్రేమ ఒలకబోస్తున్నారని డాక్టర్ ఎన్టీటీపీఎస్ టిప్పర్స్ లారీ ఓనర్స్ సొసైటీ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. అధికారంలో ఉండగా, బూడిదను, ఎన్టీటీపీఎస్ కాంట్రాక్టు ఉద్యోగాలను అమ్ముకుని సొమ్ము చేసుకున్న మాజీమంత్రి జోగి రమేశ్‌ను ఎవరూ నమ్మరని, ఆయన పిలుపును ఎవరూ స్వీకరించే పరిస్థితి లేదని వ్యాఖ్యానిస్తున్నారు.

వినూత్నంగా బూడిద ఉద్యమం



ఎన్టీటీపీఎస్ సీఈకి వినతిపత్రం ఇస్తున్న ట్రాన్స్‌పోర్టర్స్

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టును రద్దు చేసి, తమకు ఉచితంగా బూడిద లోడింగ్ చేయాలని కోరుతూ డాక్టర్ ఎన్టీటీపీఎస్ టిప్పర్స్ లారీ ఓనర్స్ సొసైటీ నేతలు, సభ్యులు చేస్తున్న ఉద్యమం వారంరోజులకు చేరింది. ఈ క్రమంలో సోమవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, విజయవాడ విద్యుత్ సౌధా కార్యాలయంలో, డాక్టర్ ఎన్టీటీపీఎస్ సీఈకి వినతిపత్రాలు అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు. జెన్కో బూడిదను కాంట్రాక్టు సంస్థకు అమ్ముకొని తమను మోసంచేసి 400 మంది స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌ను రోడ్డున పడేసిందని వాపోయారు. అనంతరం గొల్లపూడిలో ఎమ్మెల్యే వసంత ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు రద్దుచేసి బూడిదను ఉచితంగా లోడింగ్‌చేసే వరకు ఉద్యమం ఆగదన్నారు. మంత్రిగా ఉండగా స్థానిక లారీ ఓనర్స్ బాధను ఎప్పుడూ పట్టించుకోని జోగి రమేష్ ఇప్పుడు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కయి మరోవైపు మద్దతు ఇస్తున్నానంటూ దొంగనాటకాలు ఆడుతున్నాడని సొసైటీ అధ్యక్షుడు కోయ వెంకట్రావ్ దుయ్యబట్టారు.

జోగి నోరు మున్సిపాలిటీ డ్రెయినేజీ

- ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

జి.కొండూరు : మాజీమంత్రి జోగి రమేష్ నోరు మున్సిపాలిటీ డ్రెయినేజీ లాంటిదని.. అతడి విమర్శలు పట్టించుకోవాల్సిన పని లేదని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. జి.కొండూరులో 11 మంది లబ్ధిదారులకు రూ.6,18,045ల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బూడిద సమస్యను పక్కన పెట్టి తనపై దుమ్మెత్తిపోయడమే అతని ఎజెండా. అతడి మాటలు ప్రజలు గ్రహిస్తున్నారు. నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రకు అర్హుడివి కావు. వైసీపీలో మంత్రిగా ఉండి సొంత పార్టీ, సామాజిక వర్గం వారికి పోస్టులు అమ్ముకున్న నీచ చరిత్ర నీది. ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయ నిర్ణేతలు. అందుకే ఇంటికి పరిమితం చేశారు.

1,198 టీచర్ పోస్టుల భర్తీ

(5వ పేజీ తరువాయి)

ఈ వివరాలు ఉన్నాయి.

సబ్జెక్టులవారీగా పోస్టుల వివరాలు

జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా సబ్జెక్టుల్లో భర్తీకానున్న పోస్టుల వివరాలు ఇలా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) తెలుగు సబ్జెక్టులో 29 పోస్టులకు 29 మంది ఎంపిక య్యారు. ఎస్ఏ ఉర్దూ విభాగంలో 4 పోస్టులకు మూడింటికే అభ్యర్థులను ఎంపిక చేశారు. ఒక పోస్టుకు ఎవరూ అర్హత సాధించకపోవడంతో భర్తీ నిలిపివేశారు. ఎస్ఏ సంస్కృతం విభాగంలో రెండు పోస్టులకు ఒక పోస్టే భర్తీ చేశారు. మరో పోస్టుకు అభ్యర్థులు అర్హత సాధించకపోవడంతో నిలిపివేశారు. ఎస్ఏ హిందీ విభాగంలో 23 పోస్టులు, ఎస్ఏ ఇంగ్లీష్ విభాగంలో 88 పోస్టులు, ఎస్ఏ మేథమెటిక్స్ విభాగంలో 48 పోస్టులు, ఎస్ఏ ఫిజికల్ సైన్స్ విభాగంలో 53 పోస్టులు, ఎస్ఏ బయోలాజికల్ సైన్స్ విభాగంలో 140 పోస్టులు, ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో 122 పోస్టులు ఉండగా, అన్నింటికీ అభ్యర్థులు అర్హత సాధించడంతో పూర్తిస్థాయిలో భర్తీ చేయనున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టులు 430 ఉండగా, అన్ని పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎస్‌జీటీ ఉర్దూ విభాగంలో 26 పోస్టులు ఉండగా, 23 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. మిగిలిన మూడు పోస్టులకు అభ్యర్థులు అర్హత సాధించకపోవడంతో నిలిపివేశారు.

మున్సిపాలిటీల్లో..

జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఎస్ఏ తెలుగు విభాగంలో 2, సంస్కృతం విభాగంలో 1, హిందీ విభాగంలో 1 పోస్టును భర్తీ చేయనున్నారు. ఎస్ఏ ఇంగ్లీష్ విభాగంలో 2 పోస్టులకు ఒక్కరే అర్హత సాధించారు. దీంతో ఒక పోస్టును నిలిపివేశారు. ఎస్ఏ మేథమెటిక్స్ విభాగంలో ఒక పోస్టును భర్తీ చేయనున్నారు. ఫిజికల్ సైన్స్‌లో 1, బయాలాజికల్ సైన్స్‌లో 1, సోషల్ స్టడీస్‌లో 2, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో 1, ఎస్‌జీలో 18 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎస్ఈటీ విభాగంలో 3 పోస్టులకు ఇద్దరే అర్హత సాధించారు. దీంతో ఒక పోస్టు భర్తీ నిలిపివేశారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపల్ కార్పొరేషన్లలోని పాఠశాలల్లో టీచర్ పోస్టుల ఖాళీలను బట్టి సంబంధిత పాఠశాలల్లో రానున్న రోజుల్లో కొత్తగా ఎంపికైన టీచర్లకు పోస్టింగ్‌లు ఇవ్వడం జరుగుతుందని డీఈవో పీవీజే రామారావు తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం డీఈవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. మచిలీపట్నం ఎంఈవో ఎంవీఎస్‌డీ ప్రసాద్ సెల్ నెంబరు 94415 20389, అవనిగడ్డ ఎంఈవో ఎస్.శివశంకర్ సెల్ నెంబరు 92473 67099, తోట్లవల్లూరు ఎంఈవో బి.సురేష్ సెల్ నెంబరు 94908 79139తో హెల్ప్‌డెస్క్‌లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

మార్పు మంచిదే..

(5వ పేజీ తరువాయి)

భూములు తీసుకోవాలని సూచిస్తోంది. ఆ భూముల్లో రైల్వేస్టేషన్‌ను నిర్మించి ప్రస్తుత మెయిన్ లైన్‌ను ఎలివేటెడ్ విధానంలో విజయవాడ రైల్వేస్టేషన్, కృష్ణానది మీదుగా కృష్ణా కెనాల్ జంక్షన్‌కు తీసుకెళ్లాలని సూచిస్తోంది. రాయనపాడు, కొండపల్లి మీదుగా వచ్చే లైన్లు, ఖమ్మం మీదుగా వచ్చే లైన్లను కూడా అవుటర్ ఏరియా నుంచి ఎలివేటెడ్ విధానంలో తీసుకొచ్చి సింగ్‌నగర్ ఎలివేటెడ్ కారిడార్‌కు అనుసంధానం చేయాలన్నది ప్రతిపాదన.

10-12 వరసల ఎలివేటెడ్ కారిడార్‌కు ప్రతిపాదన

విజయవాడ ఏ1 రైల్వేస్టేషన్‌పై రద్దీని నివారించటానికి వీలుగా 10-12 వరసల ఎలివేటెడ్ కారిడార్ విధానాన్ని పరిశీలించాలని సూచిస్తోంది. విజయవాడ రైల్వేస్టేషన్ విస్తరణ ప్రణాళికల నేపథ్యంలో ఒక వరసకు 5, 6 లైన్లను ప్రతిపాదిస్తోంది. రానూపోనూ 10-12 వరసలకు ప్రతిపాదిస్తోంది. గుణదల రైల్వేస్టేషన్ మీదుగా వచ్చే మెయిన్ లైన్ దాటాక అజిత్‌సింగ్‌నగర్ ప్రతిపాదిత స్టేషన్ వైపు ఎలివేటెడ్ కారిడార్‌ను ప్రారంభించాలని సూచిస్తోంది. ఈ ఎలివేటెడ్ కారిడార్ అర్ధ చంద్రాకారంలో కృష్ణానది మీదుగా కృష్ణా కెనాల్ జంక్షన్‌కు వెళ్తుంది. రాయనపాడు, కొండపల్లి, ఖమ్మం నుంచి వచ్చే లైన్లు కూడా సింగ్‌నగర్ దాటాక ఎలివేటెడ్ కారిడార్‌కు అనుసంధానమవుతాయి.

రోడ్డు కమ్ ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదన

విజయవాడ నుంచి అమరావతి చేరుకోవటానికి వీలుగా రోడ్డు కమ్ బ్రిడ్జి ప్రతిపాదన మంచిదని ఎస్‌సీఆర్ఎంయూ సూచిస్తోంది. ఇలా చేస్తే విజయవాడ నుంచి అమరావతికి నేరుగా మార్గం ఏర్పడుతుందని చెబుతోంది. విజయవాడ నుంచి అమరావతి వెళ్లడానికి ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గమ్మ వారధి మీదుగా తప్ప వేరే మార్గం లేదు. విజయవాడ వెలుపల నుంచి అయితే గొల్లపూడి నుంచి వెస్ట్ బైపాస్ మీదుగా వెళ్లొచ్చు. దీనివల్ల ట్రాఫిక్ కష్టాలను చవిచూడాల్సి వస్తోంది. రైల్వే ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా రోడ్డు మార్గాన్ని కూడా ఏర్పాటుచేస్తే ఉభయతారకంగా ఉంటుందని ప్రతిపాదిస్తోంది.

ఇదే సరైన తరుణం

విజయవాడ రైల్వేస్టేషన్‌ను రీ లొకేట్ చేయటానికి ఇదే మంచి తరుణం. రైల్వేస్టేషన్‌లో రెండు టెర్మినళ్లు ఉన్నాయి. మొదటి టెర్మినల్ శిథిలావస్థకు చేరింది. దానిని కూల్చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఈ టెర్మినల్‌లో చాలావరకు షాపులు ఖాళీ చేయించారు. రెండోది కూడా పాత టెర్మినల్ అయినప్పటికీ బయట మాత్రం కొత్త లుక్ ఇచ్చారు.

డయేరియాపై సీరియస్

(5వ పేజీ తరువాయి)

స్పందించి ప్రతి జిల్లాలో గోకులాల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఉద్యాన పంటలను సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. కౌలురైతులకు కూడా ఈ అవకాశాన్ని కల్పించాల్సిందిగా కోరారు. కాగా, సమావేశం అనంతరం కలెక్టర్ లక్ష్మీశ.. మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రకు ఫోన్‌చేసి డయేరియా వివరాలు కనుక్కున్నారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, డయేరియా మూలాన్ని కనిపెట్టాలని, నివారణా చర్యలు మెరుగుపడాలని ఆదేశించారు.

స్వర్ణాంధ్ర కేపీఐ స్కోర్ ఇలా..

స్వర్ణాంధ్ర కీ పర్ఫామెన్స్ ఇండికేటర్ (కేపీఐ) స్కోర్లను కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047లో భాగంగా నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించటంలో ఆయా జిల్లాల పనితీరును అంచనా వేసేందుకు ప్రభుత్వం కేపీఐ స్కోర్‌ను తొలిసారిగా ప్రవేశపెట్టింది. రాష్ట్రంలోనే ఎన్టీఆర్ జిల్లా మూడో స్థానంలో నిలిచింది. 64 స్కోర్‌తో బీ గ్రేడ్‌ను సాధించింది. కృష్ణాజిల్లా కూడా 61 పాయింట్లతో బీ గ్రేడ్‌ను సాధించింది. మండలాలవారీగా కూడా ముఖ్యమంత్రి కేపీఐ స్కోర్‌ను ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ మండలం 82, విజయవాడ పశ్చిమ మండలం 82, విజయవాడ తూర్పు మండలం 80 స్కోర్‌ను సాధించి ఏ గ్రేడ్‌లో నిలిచాయి. కృష్ణాజిల్లాలో గూడూరు మండలం 56 స్కోర్‌తో బీ గ్రేడ్‌లో నిలిచింది. వ్యవసాయానుబంధ రంగాలకు సంబంధించి చూస్తే కృష్ణాజిల్లా 31 కేపీఐ స్కోర్‌తో ఏడో స్థానంలో నిలిచి సీ గ్రేడ్‌ను సాధించగా, ఎన్టీఆర్ జిల్లా 30 స్కోర్‌తో 9వ స్థానంలో నిలిచి సీ గ్రేడ్ పొందింది.

స్థూల విలువ జోడింపు ఇలా..

వ్యవసాయానుబంధ రంగాల్లో కృష్ణాజిల్లా దుమ్ము దులిపింది. రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రూ.45,679 కోట్ల (15.21%) లక్ష్యానికి రూ.8,368 కోట్ల (18.32%) జీవీఏ సాధించింది. ఎన్టీఆర్ జిల్లా 17వ స్థానంలో నిలిచింది. నిర్దేశించిన రూ.12,632 కోట్ల (15.94%)కు గాను రూ.1,427 కోట్ల (11.29%) జీవీఏ సాధించింది. మత్స్య రంగంలో కృష్ణాజిల్లాలోని కృత్తివెన్ను మండలం రూ.4,663 కోట్లు, నందివాడ మండలం రూ.3,801 కోట్లు, బంటుమిల్లి రూ.3,106 కోట్లు, నాగాయలంక రూ.2,802 కోట్ల జీవీఏ సాధించాయి. పాడి పరిశ్రమకు సంబంధించి కృష్ణాజిల్లా రూ.6.026 కోట్ల జీవీఏ సాధించింది. పారిశ్రామిక రంగంలో ఎన్టీఆర్ జిల్లా 77 స్కోర్‌తో 8వ స్థానంలో నిలిచి ఏ గ్రేడ్, కృష్ణాజిల్లా 49 స్కోర్‌తో 23వ స్థానంలో నిలిచి సీ గ్రేడ్‌ను పొందాయి. కృష్ణాజిల్లాకు ఇచ్చిన లక్ష్యంలో భాగంగా మొదటి క్వార్టర్‌లో రూ.3,064 కోట్ల జీవీఏ సాధించి ఆరో స్థానంలోనూ, ఎన్టీఆర్ జిల్లా రూ.4,943 కోట్లతో 13వ స్థానంలోనూ నిలిచాయి. సేవా రంగంలో కృష్ణాజిల్లా 91 స్కోర్‌తో రెండో స్థానంలో నిలిచి ఏ ప్లస్ గ్రేడ్‌ను సాధించగా, ఎన్టీఆర్ జిల్లా 90 స్కోర్‌తో ఐదో స్థానంలో నిలిచి ఏ ప్లస్ గ్రేడ్‌ను సాధించింది. ఎన్టీఆర్ జిల్లా రూ.14,007 కోట్లు, కృష్ణాజిల్లా రూ.6,357 కోట్ల జీవీఏను సాధించాయి.

ఆక్రమిత భూములకు విముక్తి

(5వ పేజీ తరువాయి)

చేసుకునేందుకు వీలుగా ఎన్టీఆర్, కృష్ణాజిల్లా యంత్రాంగాలు ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేశాయి.

యార్లగడ్డ పోరాటం కారణంగానే..

గన్నవరం నియోజకవర్గంలో ఆక్రమిత భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చాలాకాలంగా పోరాడుతున్నారు. మచిలీపట్నంలో ఇటీవల జరిగిన జెడ్పీ సమావేశంలో కూడా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కృష్ణా పరిధిలోని గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణకు సంబంధించి తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. ఆగస్టులో జరిగిన ఎన్టీఆర్ జిల్లా సమీక్షా సమావేశంలో విజయవాడ రూరల్ మండల పరిధిలోని తొమ్మిది గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కావటాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన రూరల్ మండల తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో కమిటీని ఏర్పాటు చేశారు. ఇక కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కూడా స్పందిస్తూ జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో), గుడివాడ ఆర్‌డీవో, గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు తహసీల్దార్లు, గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు ఎండీవోలు, ఆ మూడు మండలాల పరిధిలోని గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలతో కమిటీ ఏర్పాటు చేశారు.

అభివృద్ధికి ఆస్కారం

ఆక్రమణల చెరలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటే గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి ఉపయోగపడుతుంది. ఇప్పటికే రెండు, మూడు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే అనుమతులు తీసుకొచ్చారు. వీటితో పాటు వాటర్ ట్యాంకులు కట్టడానికి, చెత్త సంపద కేంద్రాలు నిర్మించటానికి, ఉద్యానవనాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు.. ఇలా ఏవి నిర్మించాలన్నా స్థలాలు లేకుండాపోతున్నాయి. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే యార్లగడ్డ సూచనకు రెండు జిల్లాల యంత్రాంగాలు స్పందించి కమిటీలు ఏర్పాటు చేశాయి. ఈ కమిటీలు క్షేత్రస్థాయిలో ఆక్రమణలను నిగ్గు తేల్చాల్సి ఉంటుంది. ఆ తర్వాత సమగ్ర నివేదికను కలెక్టర్లకు సమర్పిస్తారు. ఆ తర్వాత ఎమ్మెల్యే సమక్షంలో చర్చించి వాటి స్వాధీనంపై తుది నిర్ణయం తీసుకుంటారు.

13 మందికి ఎండీవోలుగా పదోన్నతి

(5వ పేజీ తరువాయి)

ఇచ్చారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అధికారులే కాకుండా విజయనగరం, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి వచ్చిన డిప్యూటీ ఎండీవోలకు కూడా ఎండీవోలుగా పదోన్నతి కల్పించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, జడ్పీ సీఈవో కన్నమనాయుడు సోమవారం వీరికి ఉత్తర్వులు జారీ చేశారు. మొవ్వ ఏవోగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావును కృత్తివెన్ను ఎండీవోగా, గన్నవరం ఏవోగా పనిచేస్తున్న డి.శకుంతలను ఇబ్రహీంపట్నం ఎండీవోగా, వీరులపాడు ఏవోగా పనిచేస్తున్న బి.రాజును ఏలూరు మండలం చాట్రాయి ఎండీవోగా, కంచికచర్ల మండలం ఏవోగా పనిచేస్తున్న ఎంఎం ఆనందకుమారిని చల్లపల్లి ఎండీవోగా, పమిడిముక్కల మండలం ఈవోఆర్డీగా పనిచేస్తున్న డి.వెంకటేశ్వరరావును కంచికచర్ల మండలం ఎండీవోగా, ఎ.కొండూరు మండలం ఈవోఆర్డీగా పనిచేస్తున్న టి.సరస్వతిని గంపలగూడెం ఎండీవోగా, నూజివీడు డీఎల్‌పీవో కార్యాలయం ఏవో ఆర్.రాజాబాబును కైకలూరు ఎండీవోగా, కంచికచర్ల డిప్యూటీ ఎండీవో పి.ఏసుబాబును ముసునూరు ఎండీవోగా, బంటుమిల్లి ఈవోఆర్డీ పి.శైలజా కుమారిని బంటుమిల్లి ఎండీవోగా, విజయనగరం జిల్లా గుర్ల డిప్యూటీ ఎండీవో కేఎస్ఎస్ అన్నపూర్ణాదేవిని గుడ్లవల్లేరు ఎండీవోగా, పల్నాడు జిల్లా ముప్పాళ్ల ఈవోఆర్డీ ఎస్.రూపవతిని వీరులపాడు ఎండీవోగా, పల్నాడు జిల్లా మాచవరం ఈవోఆర్డీ డి.వెంగలరావును నాగాయలంక ఎండీవోగా, బాపట్ల జిల్లా అద్దంకి ఆర్‌వీఎస్ ప్రసాదరావును నందిగామ ఎండీవోగా పదోన్నతులు కల్పించారు.

చిల్లర పనులు

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాల నుంచి వస్తారు. ఆది, మంగళ, శుక్రవారాల్లో 45 వేల నుంచి 50 వేలమంది వరకు ఉంటారు. ఇలా వచ్చిన భక్తుల్లో రోజుకు 2 వేల మంది అమ్మవారికి తలనీలాలు సమర్పిస్తారు. ఇక్కడి నుంచే దోపిడీ మొదలవుతుంది. టికెట్ ధరకు మించి డబ్బు వసూలు చేయొద్దని అధికారులు ఆదేశించినా సిబ్బంది ఖాతరు చేసే పరిస్థితి కనిపించట్లేదు. అధికారులు తనిఖీలకు వస్తే మాత్రం జాగ్రత్తగా ప్రవర్తిస్తున్నారు. నిత్యం తలనీలాలు సమర్పించడానికి వచ్చే భక్తుల్లో సగం మందికి తిరిగి చిల్లర ఇవ్వట్లేదనే ఆరోపణలు వస్తున్నాయి. రోజుకు రూ.10 వేల చొప్పున అదనపు ఆదాయాన్ని కేశఖండన శాలలోని కౌంటర్ సిబ్బంది పక్కకు తీస్తున్నారు. దీనిపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భక్తుల నుంచి సేకరిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వేలోనూ సిబ్బంది వసూళ్లపై ఫిర్యాదులు అందుతున్నాయి. తలనీలాలు సమర్పించాక కూడా డబ్బు చెల్లించాల్సి వస్తోంది. తలనీలాలు తీసినందుకు రూ.50 ఇవ్వాలని అడుగుతున్నారు. ఒక కుటుంబంలో నలుగురు తలనీలాలు సమర్పిస్తే రూ.200 క్షురకుడి చేతిలో పెట్టాల్సి వస్తోంది. అడిగినంత ఇవ్వని భక్తులపై పరుష పదజాలంతో మాట్లాడుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140,149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవ స్థానంలో నిత్యాన్నదాన పథకానికి విజయవాడ తాడిగడపకు చెందిన చింతపల్లి రంగారావు దంపతులు చింతపల్లి జగన్మోహన్ పేరు మీద రూ.1,00,116లు సోమవారం అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది దాతకు అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అధికారులు దాతలకు అమ్మవారి చిత్రపటంతో పాటు విరాళం రశీదు, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అందజేశారు.

యువ ఇంజనీర్లకు విశ్వేశ్వరయ్య దిక్సూచి

ఏపీసీపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డి

గుణదల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తుకు జలాశయాలే ప్రధానం అని నమ్మిన వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని ఏపీసీపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డి అన్నారు. ఐటీఐ కళాశాల రోడ్డులోని ఏపీసీపీడీసీఎల్ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలకు పి.పుల్లారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధి ఇంజనీర్ల చేతిలోనే ఉంటుందని చెప్పిన గొప్ప సివిల్ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. యువ ఇంజనీర్లకు ఆయనే దిక్సూచి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్లు టీవీఎస్ఎన్ మూర్తి, మురళీకృష్ణ యాదవ్, ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ పుల్లారెడ్డి



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ విజయసారథి

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో

భారతీనగర్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి జ్యోతి వెలిగించి ఇంజనీర్స్ డే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థి ప్రముఖ ఇంజనీర్ వై.ధనుంజయను ఘనంగా సత్కరించారు. ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎన్నికైన ఎన్.లక్ష్మీ, జి.దుర్గాదేవిని అభినందించారు.ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు కట్లయ్య, శివప్రసాద్, బాబూరావు, పద్మ సుభాషిని, శైలజ, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంజనీర్లకు సన్మానం

టీచర్స్ కాలనీలోని వీఎంసీ పార్కులో పంచాయతీ రాజ్ శాఖలో పనిచేసి పదవీ విరమణ చేసిన పలువురు ఇంజనీర్ అధికారులను సంస్థ ప్రతినిధులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ జయరాజ్ పాల్గొని పదవీ విరమణ చేసిన ఎం. కుటుంబరావు, డి. చంద్రశేఖరరావు, కేబీఆర్ ప్రసాద్, యార్లగడ్డ రంగరావును సన్మానించారు. పంచాయతీరాజ్ సంస్థ అధ్యక్షులు కేబీ ఆర్ ప్రసాద్, కోశాధికారి కె. రామ్మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో ...

ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో ఐక్యూఏసీ సెల్, ఆర్ అండ్ డిసెల్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఫాపిల్ డ్రోన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ఎ. గోపిరాజా మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ రంగానికి విశేషమైన సేవలు చేశారని అన్నారు. ఫాదర్ జోజిరెడ్డి, ఫాదర్ ఇమ్మానుయేల్ , విభాగాధిపతులు పాల్గొన్నారు.



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఈ జయరాజ్, సంస్థ అధ్యక్షుడు కేబీఆర్ ప్రసాద్, కోశాధికారి కె. రామ్మోహన్ రావు తదితరులు

ప్రతి ఒక్కరికీ ట్రేడ్ లైసెన్స్ ఉండాలి

నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అర్జునరావు

వన్‌టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కూడా ట్రేడ్ లైసెన్స్‌లు పొందాలని వ్యాపారులకు నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అర్జునరావు సూచించారు. విజయవాడ తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో సోమవారం ప్రైవేట్ ఆర్వో వాటర్ ప్లాంట్‌ల యాజమానులు, చికెన్, మటన్, సీఫుడ్ విక్రయాల స్టాళ్ల యాజమానులు, హోటళ్లు, రెస్టారెంట్‌లు, క్యాటరర్‌ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్వో ప్లాంట్‌లను తనిఖీ చేసి బీఐఎస్, ఐఎస్ఐ సర్టిఫికెట్‌లు కలిగి ఉండేలా చూడాలన్నారు. రసాయన విశ్లేషణలు, బయాలజికల్ టెస్ట్‌లు, ల్యాబ్ రిపోర్టులు కలిగి ఉండాలన్నారు. హోటళ్లలో ఆర్ఓ ప్లాంట్‌లను ప్రతి మూడు నెలలకొకసారి నీటి పరీక్ష చేయించాలన్నారు. సర్టిఫికెట్ ఉన్నవారి నుంచి మాత్రమే నీటి బబుల్స్‌ను కొనుగోలు చేయాలన్నారు. హోటళ్లలో హ్యాండ్‌వాష్, షింక్, టాయ్‌లెట్ల సౌకర్యాలు ఉండాలన్నారు. వంట చేసేవారు, పనిచేసేవారు పరిశుభ్రంగా ఉండాలన్నారు. మాంసాహారాన్ని విక్రయించేవారు కచ్చితంగా పారిశుధ్యాన్ని నిర్వహించాలన్నారు. నాణ్యమైన, పరిశుభ్రమైన తాజా మాంసాహారాలను వాడాలన్నారు. డస్ట్‌బిన్‌లను ఉంచాలని, వ్యర్థాలను రోడ్లపైన వేస్తే భారీ జరిమానా వేస్తామని హెచ్చరించారు.. వ్యాపారస్తులు ట్రేడ్‌లైసెన్స్ సందర్భంగా డిక్లరేషన్ ఇస్తున్నారు కానీ వాటిని పాటించడం లేదన్నారు. ఇకపై కచ్చితంగా పాటించాలని లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఎంహెచ్‌లు అన్నపూర్ణ, శ్రీనివాసన్, గోపాలకృష్ణనాయక్, ట్రేడ్ అండ్ లేబర్ ఆఫీస్ డిప్యూటీ కమిషనర్ జే.ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎంహెచ్‌వో అర్జునరావు





విజయలక్ష్మీ కాలనీ మెయిన్ రోడ్డులో గుంతలు

ప్రమాదకరంగా గుంతలు

● విజయలక్ష్మీ నగర్ కాలనీవాసుల పాట్లు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: గుంతలు పడి ప్రమాదకరంగా మారిన రోడ్డులో ప్రయాణించడానికి విజయలక్ష్మీ నగర్ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 3వ డివిజన్ పరిధిలోని మహానాడు రోడ్డుకు సమీపంలో విజయలక్ష్మీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు గుంతల పడి అధ్వానంగా మారింది. రోడ్డుపల్లంగా ఉండడంతో చిన్న వర్షం కురిసినా నీళ్ల నిలిచిపోయి చెరువులా మారుతుంది. ఈ కాలనీకి ఇది ప్రధాన రహదారి కావడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

ఏరోబిక్స్ విజేతలు



మహారాష్ట్ర షిరిడిలో జరుగుతున్న అండర్ 11 ఏరోబిక్స్ జాతీయ స్థాయి పోటీల్లో సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా స్కూల్ ఉపాధ్యాయులు, సిద్ధార్థ అకాడమీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.
- విజయవాడ స్పోర్ట్స్, ఆంధ్రజ్యోతి

విద్యుత్ శాఖ విస్తృత తనిఖీలు

● అపరాధ రుసుం రూ. 8.5 లక్షలు

పాయకాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పాయకాపురం ప్రాంతంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు పలు చోట్ల సోమవారం తనిఖీలు చేపట్టారు. 47 మంది అధికారులు 42 బృందాలుగా ఏర్పడి 3380 సర్వీసులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరిల్లో విద్యుత్ వినియోగిస్తున్న వినియోగదారులకు, అధిక లోడ్ వినియోగిస్తున్న వినియోగదారులకు 229 మందికి రూ. 8.5 లక్షలు అపరాధ రుసుం విధించారు.

ఈ సందర్భంగా డీఈఈ ఎంవీవీ రామకృష్ణ మాట్లాడుతూ అపరాధ రుసుం కట్టలేని పరిస్థితుల్లో రెవెన్యూ రికవరి చట్టం కింద ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. డీఈఈలు బసవరాజు, శ్రీధర్, టి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గద్దె క్రాంతికుమార్

వరుణ్ మోటార్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

బెంజిసర్కిల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బెంజిసర్కిల్‌లోని వరుణ్ మోటార్స్, వరుణ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధినేత ప్రభు కిషోర్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జూబ్లీ హరిత సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని టీడీపీ యువ నేత గద్దె క్రాంతి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ నిర్వాహకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో స్థానం సంపాదించుకుందన్నారు. లయన్స్ ఫాస్ట్ గవర్నర్ మిర్యాల వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ జూబ్లీ హరిత ప్రెసిడెంట్ కోట ఫణీంద్రకుమార్, జోన్ చైర్‌పర్సన్ హనుమంతరావు, వరుణ్ ఉద్యోగులు, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

ధనేకులలో 2.0 జెమినీ ఏఐపై సదస్సు

పెనమలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీర్స్‌డే సందర్భంగా ఇంజనీరింగ్ 2.0జెమిని ఏఐ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల మాట్లాడుతూ, విద్యార్థులు జెమిని ఏఐ ప్రోను ఏవిధంగా ఉపయోగించుకోవాలి, విద్య, సమస్యల పరిష్కారంలో జెమిని ఏవిధంగా సహాయపడుతుంది వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమాన్ని గూగుల్ స్టూడెంట్స్ అంబాసిడర్స్ కే.మైత్రి, ఎస్.గాయత్రి, ఎం.లిఖిత, రాంచరిత్‌రెడ్డి నిర్వహించారు.



పార్క్ అభివృద్ధికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పార్క్ అభివృద్ధికి శంకుస్థాపన

మొగల్రాజపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక 7వ డివిజన్లోని పార్క్ అభివృద్ధికి రూ.35 లక్షల వ్యయంతో చేపట్టిన పనులకు భూమి పూజ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి మొక్కలు నరికిస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు మొక్కలు నాటించే ప్రక్రియను ఎల్లవేళలా కొనసాగిస్తున్నారని తెలియజేశారు. రాష్ట్రంలో అత్యధికంగా మొక్కలు నాటిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, పార్టీ నాయకులు గుమ్మడి గురుప్రసాద్, పటమట సతీష్‌చంద్ర, సొంగా సంజయ్ వర్మ, దయాల శిరీషా గాంధీ, తదితరులు పాల్గొన్నారు.



అవార్డు సాధించిన వీఆర్‌డీఎల్ టీమ్‌ను అభినందిస్తున్న డాక్టర్ ఎ.ఏడుకొండలరావు

నేషనల్ వీఆర్‌డీఎల్ క్లాన్‌కేవ్‌లో

సిద్ధార్థ మెడికల్ కాలేజీకి ప్రథమస్థానం

మాచవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నేషనల్ వైరస్ రీసెర్చ్ అండ్ డయాగ్నోస్టిక్ ల్యాబొరేటరీ(వీఆర్‌డీఎల్) క్లానోకేవ్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి సిద్ధార్థ మెడికల్ కాలేజీ(ఎస్ఎంసీ) వీఆర్‌డీఎల్ బృందం ప్రథమ స్థానం దక్కించుకోవడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.వై.రావు అన్నారు. వీఆర్‌డీఎల్ బృందంలోని డాక్టర్ డి.శారద, మిగిలిన సభ్యులను సోమవారం ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ, కాన్‌క్లేవ్‌లో దేశ వ్యాప్తంగా 165 వీఆర్‌డీఎల్ ల్యాబొరేటరీలు పాల్గొంటే రాష్ట్రంలోని తమ కాలేజీ బృందం అత్యధిక స్కోరు సాధించిన రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు.



ప్రజల నుంచి అర్జీలు తీసుకుని పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

అదనపు కమిషనర్ చంద్రశేఖర్

కార్పొరేషన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా పిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా అదనపు కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 16 పిర్యాదులు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కమిషనర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ డైరెక్టర్ అమృత్ డాక్టర్ లత తదితరులు పాల్గొన్నారు.



శిశువు తల్లిదండ్రులతో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.వెంకటేశ్వరరావు, సర్జరీ చేసిన వైద్యులు

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

● 40 రోజుల శిశువుకు లాప్రోస్కోపిక్ పైలోప్లాస్టీ సర్జరీ

మాచవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని శిశు శస్త్రచికిత్స విభాగంలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. 40 రోజుల వయసున్న మగశిశువుకు గర్భదారణ సమయంలో మూత్రపిండాల సమస్య(హైడ్రోనెఫ్రోసిస్) ఉన్నట్టు గుర్తించారు. న్యూక్లియర్ స్కాన్‌లో మూత్రపిండాల పనితీరు కేవలం 30 శాతం ఉన్నట్టు నిర్ధారించారు. లాప్రోస్కోపిక్ పైలోప్లాస్టీ శస్త్రచికిత్సను డాక్టర్ రాజీవ్‌కుమార్, డాక్టర్ శశిధర్, డాక్టర్ రోహిత్ సజ్జా నేతృత్వంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సను ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డా. ఏ.వెంకటేశ్వరరావు మార్గదర్శకంలో, ఎనస్తీషియా విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సుమతి, బృందం సహకారంతో నిర్వమించినట్టు వైద్యులు తెలిపారు. శస్త్రచికిత్స తర్వాత శిశువు ఆరోగ్యం నిలకడగా ఉందని, మూడో రోజు శిశువును డిశ్చార్జ్ చేసినట్టు వైద్యబృందం తెలిపింది.

తాగునీటిని ప్రతి రోజూ పరీక్షించండి

● అధికారులకు నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

లబ్బీపేట,సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాగునీటిని ప్రతి రోజూ క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా సోమవారం ఆయన లబ్బీపేట, టిక్కిల్ రోడ్డు, క్రీస్తురాజుపురం, రమేష్ హాస్పటల్ రోడ్డు, పాలిక్లినిక్ రోడ్డు, గుప్తాకాలనీ రోడ్డు, తారాపేట, కనుమూరి దేవానందం రోడ్డు, జమ్మిచెట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు నీరు పారుదలకు ఎటువంటి అంతరాయం జరగకుండా చూడాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు పారుదల ఉండేలా చూడాలని, పారుదలకు అడ్డు వచ్చిన అనధికార కట్టడాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరుగుతూ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, యాంటి లార్వా ఆపరేషన్లు జరుపుతూ ఉండాలని, దోమలు పెరగకుండా వాటిని నిర్మూలించేందుకు డ్రోన్‌లతో స్ప్రే చేయాలని అధికారులను ఆదేశించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



తెంటు గౌరయ్య వీధిలో పబ్లిక్ ట్యాప్ వద్ద పరీక్ష నిర్వహిస్తున్న నగర కమిషనర్ ధ్యానచంద్ర

ఎలక్ట్రీషియన్ అనుమానాస్పద మృతి

గుణదల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రీషియన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన సోమవారం గులాంనబీ రోడ్లో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం 6వ డివిజన్లోని గులాం నబీ రోడ్లో ఉంటున్న కాళీ శ్యామ్‌ప్రసాద్ ఎలక్ట్రీషియన్. ఇతనికి భార్య, ఇరువురు పిల్లలు. భార్య ఇళ్లల్లో, పిల్లలు ప్రైవేటు కంపెనీలో పని చేస్తుంటారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు వస్తుండటంతో భార్య పిల్లలతో కలిసి మంగళగిరి లోని తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. నాలుగు నెలలుగా ఇంటి అద్దె కట్టటం లేదని ఇల్లు ఖాళీ చేయమని యజమాని కోరాడు. భార్య ఇప్పటికే కొన్ని సామాన్లు తీసుకెళ్లిపోయింది. మిగిలిన సామాన్లు తీసుకుని ఇల్లు ఖాళీ చేద్దామని పెద్ద కుమారుడు సోమవారం వచ్చి చూసేసరికి ఇంట్లో తండ్రి ఉరేసుకుని కనిపించాడు. మాచవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మాచవరం పోలీసులు తెలిపారు.

నియంత్రణలో డయేరియా కేసులు

● జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడ న్యూరాజ రాజేశ్వరిపేటలో డయేరియా పూర్తి నియంత్రణలో ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ల సదస్సుకు వెళ్లడానికి ముందు స్థానిక అధికారులతో కాల్ కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ చర్యలు, ప్రజాచైతన్యంతో కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. అయిన క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొత్తం 275 మంది చికిత్స పొంది ఇంటికి వెళ్లారని, ఇంకా 42 మంది చికిత్స తీసుకుంటున్నారని చెప్పారు. న్యూ రాజరాజేశ్వరిపేటలోని పరిస్థితి దృష్ట్యా విజయవాడ అర్బన్ పరిధిలో ఎక్కడా డయేరియా ప్రబలకుండా చర్యలకు ఆదేశించామని ఆయన వివరించారు.

టీటీడీ ట్రస్టులకు రూ.20 లక్షల విరాళం



తిరుమల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి చెందిన ట్రస్టులకు సోమవారం రూ.20 లక్షలు విరాళంగా అందాయి. విజయవాడకు చెందిన మన్యం శ్రీనివాసరావు తన కుమార్తె మన్యం హారిక పేరుపై ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు, మరో కుమార్తె మన్యం హరిత పేరుపై ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.10 లక్షలు చొప్పున అందజేశారు. ఈ విరాళాల డీడీలను దాత తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు.

యూటీఎఫ్ రణభేరి బైక్ జాతా ప్రారంభం



జగ్గయ్యపేట, సెప్టెంబ రు 15 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ నాటికి ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన నాలుగు డీఏలలో రెండైనా ఇవ్వాలని, పీఆర్సీ కమిషన్‌ను వేసి మధ్యంతర భృతి ప్రకటించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సోమవారం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో యూటీఎఫ్ నిర్వహిస్తున్న రణభేరి బైక్ జాతాను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పట్టించుకోవాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కుసుమ కుమారి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు, యూటీఎఫ్ నేత ఎం.కృష్ణయ్య మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జాతా ద్వారా ఉపాధ్యాయులను 25న జరిగే రాష్ట్ర సదస్సుకు వచ్చేలా చైతన్యపరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఏ.సుందరయ్య పాల్గొన్నారు.

మెడికల్ రిప్రజెంటేటివ్స్ సమస్యలు పరిష్కరించాలి

- విజయవాడ ధర్నాలో వక్తలు

విజయవాడ (గాంధీనగర్), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ అండ్ రిప్రజెంటేటివ్స్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం రాష్ట్రస్థాయి ధర్నా జరిగింది. వక్తలు మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌ను రద్దుచేసి కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేజ్‌బోర్డు స్థాపించి హైలి స్కిల్స్ లేబర్‌గా గుర్తించి నెలకు రూ26 వేల జీతం చెల్లించాలన్నారు. మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు చట్టబద్ధమైన పనివిధానాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగే డిజిటల్ పద్ధతులను నిలుపుదల చేయాలన్నారు. ప్రభుత్వరంగ మందుల కంపెనీలను పునరుద్ధరించాలని, మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య రంగానికి జీడీపీలో కనీసం 6 శాతం నిధులు కేటాయించాలన్నారు. నకిలీ, కల్తీ, నాసిరకం మందులను అరికట్టేందుకు తనిఖీ యంత్రాంగాన్ని పటిష్టం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ కుమార్, సి.వెంకటరావు తదితరులు డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర నేతలు సీహెచ్ బాబూరావు, ఉమామహేశ్వరరావు, సీఐటీయూ నేతలు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, ట్యాక్స్ పేయర్స్ సంఘం నేత అంజనేయులు తదితరులు ధర్నాకు మద్దతు తెలిపారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, లేదంటే ప్రజలు, ప్రజా సంఘాలను కలుపుకొని పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

మహిళల ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని

విజయవాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని, మహిళల ఆరోగ్యం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాయని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. నగరంలోని జిల్లా వైద్యశాఖ భవనంలో మంగళవారం "స్వస్థనారి శసక్త పరివార్ అభియాన్" పథకానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పుట్టిన ఆడ శిశువు మొదలు మహిళలందరి ఆరోగ్య సంరక్షణకు కేంద్రం ప్రత్యేకంగా "స్వస్థనారి శసక్త పరివార్ అభియాన్" అనే పథకాన్ని త్వరలోనే ప్రారంభించబోతున్నారన్నారు. ఈ పథకాన్ని ఈ నెల 17న ఇండోర్‌లో ప్రధాని మోదీ ప్రారంభిస్తుండగా, అదే రోజు జిల్లాలోను ప్రారంభమవుతుందని ఆమె తెలిపారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పథకానికి సంబంధించిన క్యాంపులు నిర్వహించి మహిళల ఆరోగ్య సమస్యలపై వైద్యులతో పరీక్షలు నిర్వహిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సర్వజన ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఆమె తెలిపారు.

50శాతం పునరుత్పాదక ఇంధన సామర్థ్యమే లక్ష్యం: సీఎస్

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా 2030 నాటికి 50శాతం పునరుత్పాదక ఇంధన సామర్థ్యం సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే సందర్భంగా సోమవారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో ఏపీఎస్ఈబీ ఇంజనీర్ల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన ఆంధ్రప్రదేశ్ పవర్ ట్రెండ్స్ అనే న్యూస్ లెటర్‌ను సీఎస్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో అనేక నూతన విధానాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు అమలు చేయడం ద్వారా రాష్ట్ర విద్యుత్తు రంగం విశేష ప్రగతి సాధించిందన్నారు. కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్లు ఏకేవీ భాస్కర్, జేవీరావు, ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు. ఇంజనీర్స్‌డేను పురస్కరించుకుని ఏపీజెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్ బాబు విద్యుత్తు సౌధలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

సమాజ పునర్నిర్మాణానికి పాటుపడాలి

- కృష్ణా వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాంజీ
- ఐఈఐ ఏపీ సెంటర్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే

విజయవాడ సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాజ పునర్నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.రాంజీ అన్నారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెంటర్ (ఐఈఐ-ఏపీఎస్‌సీ) ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే విజయవాడలోని కేఎల్‌రావు భవన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. వీసీ కె.రాంజీ మాట్లాడుతూ భావితరాలకు ఆదర్శంగా నిలిచే ఆవిష్కరణలవైపు యువత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆయన జీవితకాలంలో ఎన్నో అద్భుతమైన ఆవిష్కరణలు చేసి దేశ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. సీఎం చంద్రబాబు అమరావతిలో క్వాంటమ్ టెక్నాలజీని ప్రవేశపెడుతుండటం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, ఐఈఐ-ఏపీఎస్‌సీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, కార్యదర్శి ఏవీ నరేష్ బాబు, డాక్టర్ సీవీ శ్రీరామ్ పాల్గొన్నారు.

ఆరుగురికి అవార్డుల ప్రదానం

ఇంజనీర్స్ డే సందర్భంగా ఐఈఐ-ఏపీఎస్‌సీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఆరుగురు ఇంజనీర్లకు అవార్డులను ప్రదానం చేశారు. కృష్ణా వర్సిటీ వీసీ కె.రాంజీ, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ఈ అవార్డులను అందజేశారు. ఉత్తమ ప్రతిభా అవార్డును ప్రొఫెసర్ కె.శ్రీనివాస్ (కమల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్), డిస్టింగ్విష్ ఇంజనీర్ (ఇండస్ట్రీ) అవార్డును ఎం.సత్యనారాయణ (సీఈవో, ఐజీఐపీ అస్టస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్), డిస్టింగ్విష్ ఉమెన్ ఇంజనీర్ అవార్డును డాక్టర్ సి.శోభాబిందు (జేఎన్‌టీయూఏ), డిస్టింగ్విష్ ఇంజనీర్ (సొసైటీ సర్వీస్) అవార్డును ఎం.శివప్రసాద్ (అదనపు కమిషనర్, పీఆర్ అండ్ ఆర్డీ), డిస్టింగ్విష్ ఇంజనీర్ (అకడమిక్) అవార్డును డాక్టర్ వి.శ్రీనివాస నరేష్ (వాసవీ ఇంజనీరింగ్ కాలేజీ, తాడేపల్లిగూడెం), డిస్టింగ్విష్ యంగ్ ఇంజనీర్ అవార్డును డాక్టర్ ఎం.నవీన్‌కుమార్ (వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్శిటీ, పశ్చిమగోదావరి) అందుకున్నారు. ఈ అవార్డులను ప్రొఫెసర్ డాక్టర్ ఆలపాటి సూర్యనారయణ, మలినేని నారాయణప్రసాద్, కె.పద్మజ సమకూర్చారు.



సత్యనారాయణ ప్రసాద్‌ను సన్మానిస్తున్న అతిథులు

అక్టోబరులో అనురాధ పదవీ విరమణ

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ ఏఆర్ అనురాధ అక్టోబరు 9న పదవీ విరమణ చేయనున్నారు. ఏపీపీఎస్సీ నిబంధనల ప్రకారం 62ఏళ్లు నిండితే ఆ పదవిలో కొనసాగకూడదు. ఈ నేపథ్యంలో ఆమె పదవీ విరమణపై సాధారణ పరిపాలన శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. గతేడాది అక్టోబరు 23న ఆమె కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు.

రాహుల్‌దేవ్ శర్మకు ఎక్సైజ్ డైరెక్టర్ బాధ్యతలు

ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ బాధ్యతలను ఆ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మకు అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా పనిచేసిన నిషాంత్‌కుమార్ ఇటీవల అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో ఈ మేరకు అదనపు బాధ్యతలు అప్పగించారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు కన్నయ్య నాయుడు

ఇంజనీర్లు చరిత్ర నిర్మాతలుగా ఎదగాలి

- ప్రభుత్వ సలహాదారు కన్నయ్య నాయుడు
- సిద్ధార్థలో ఘనంగా ఇంజనీర్స్ డే

కానూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భావి ఇంజనీర్లు చరిత్ర నిర్మాతలుగా ఎదగాలని విశ్రాంత ఇంజనీర్, ప్రభుత్వ సలహాదారు ఈ.ఆర్.ఎన్. కన్నయ్య నాయుడు పిలుపునిచ్చారు. సోమవారం కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ, వీవీపీ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఘనంగా ఇంజనీర్స్ డే నిర్వహించారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కన్నయ్య నాయుడు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు సైన్స్, గణితం, సామాజిక శాస్త్రం వంటి వాటి నుంచి జ్ఞానాన్ని పొందాలని చెప్పారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన స్వభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. నాగార్జున సాగర్, శ్రీశైలం, తుంగభద్ర ఆనకట్ట వంటి ప్రాజెక్టుల అనుభవాన్ని ఆయన విద్యార్థులతో పంచుకున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, పరిశ్రమల అభివృద్ధి, దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్రను వివరించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య, కార్యదర్శి పి.లక్ష్మణరావు ప్రసంగించారు. కార్యక్రమాల్లో వర్సిటీ వైస్‌చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రో వీసీ ఏవీ రత్నప్రసాద్, డైరెక్టర్ బి.పాండురంగారావు, కోఆర్డినేటర్ డాక్టర్ వి.మల్లికార్జున్, డాక్టర్ వెంకట్రావు, వీవీపీ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహంతో ధర్నా

- మృతికి కారణమైన హిజ్రాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- గిరిపురంలో ఉద్రిక్తత.. ఏసీపీ హామీతో ఆందోళన విరమణ
- ఈ కేసులో ఇప్పటికే ఏడుగురు అరెస్టు
- మరో ఐదుగురి కోసం గాలింపు



మృతదేహంతో రోడ్డుపై ఆందోళన చేస్తున్న బంధువులు

గుణదల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళ మృతికి కారణమైన హిజ్రాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గిరిపురంలో మృతదేహంతో బంధువులు సోమవారం ఆందోళనకు దిగారు. దీంతో గిరిపురం వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే... గిరిపురానికి చెందిన పల్లెపోగు గోపీచంద్ ఓ యువతిని ప్రేమించాడు. ఈ నెల 11వ తేదీన ఆమె తల్లిదండ్రుల వద్దకు వెళ్లి నేను మీ అమ్మాయి ప్రేమించుకున్నాం.. పెళ్లి చేసుకుందామని అనుకుంటున్నామని చెప్పాడు. దీంతో ఆగ్రహించిన ఆమె తండ్రి రాజశేఖర్, మేనమామలు గోపీచంద్‌తో గొడవపడ్డారు. ఆ తర్వాత గోపీచంద్ నివాసం ఉంటున్న ఇంటికి హిజ్రాలను పంపించారు. వారు గోపీచంద్ తల్లి పల్లెపోగు కుమారిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. హిజ్రాల దాడితో మనస్తాపం చెందిన గోపీచంద్ తల్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 13వ తేదీన మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మహిళ మృతికి కారణమైన హిజ్రాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో సోమవారం ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న మాచవరం పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆందోళనకారులు తమకు సరైన న్యాయం చేయలేదని, తమ వాదనను అసలు వినలేదంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది.

బంధువులతో ఏసీపీ చర్చలు

విషయం తెలుసుకున్న సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ సిబ్బందితో గిరిపురం చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. మృతురాలి భర్త పల్లెపోగు కుమార్‌బాబు ఫిర్యాదు మేరకు మొదట ఈ కేసును అనుమానాస్పద మృతిగా నమోదు చేశామని, పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా హత్య కేసుగా మార్చినట్టు చెప్పారు. ఇప్పటికే ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పరారీలో ఉన్న ఐదుగురు హిజ్రాల కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టామని చెప్పారు. హిజ్రాలపై చర్యలు తీసుకోకుండా తమకు ఏది చెప్పినా వినేది లేదంటూ ఆందోళనకారులు రోడ్డుపై బైటాయించారు. వైసీపీ సెంట్రల్ నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు గిరిపురం చేరుకుని ఆందోళనకారులకు మద్దతు తెలియజేశారు. దళితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఆందోళన సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలను ప్రత్నామ్నాయ మార్గాల ద్వారా దారి మళ్లించారు. పోలీసులు భారీగా మోహరించారు. అనంతరం ఏసీపీ దామోదర్ మరోమారు చర్చలు జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గాంధీకొండ పునర్వైభవానికి కృషి

వన్‌టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): విజయవాడ వన్‌టౌన్‌లోని గాంధీ కొండకు పునర్వైభవం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని గాంధీ హిల్ ఫౌండేషన్ కమిటీ సభ్యుడు, విజయవాడ నగర మాజీ మేయర్ జంధ్యాల శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1969లో గాంధీ జయంతి సందర్భంగా కొండపైన 56 అడుగుల ఎత్తులో గాంధీస్థూపాన్ని ప్రారంభించారన్నారు. ప్లానిటోరియం, లైబ్రరీ, మ్యూజియం, పిల్లల రైలు, ఉద్యాన వనం వంటివి ఆకట్టుకుంటున్నాయన్నారు. అయితే వివిధ కారణాల వల్ల ఆ సదుపాయాలన్ని జీర్ణదశకు చేరడంతో డాక్టర్ గాంధీ పి.సి కాజా ఐపీఎస్ అధ్యక్షతన కొత్త కార్యనిర్వాహక కమిటీ ఏర్పడిందన్నారు. కమిటీ ఆధ్వర్యంలో పిల్లల రైలు పునరుద్ధరణ, ఎలివేటర్ ఏర్పాటు, రహదారి విస్తరణ, వారసత్వ ప్రదేశాల అభివృద్ధి వంటి చర్యలు చేపట్టారన్నారు. మహాత్మాగాంధీ పర్యటించిన జ్ఞాపకాలతో సంబంధమున్న ఫొటోలు, వస్తువులు, కథనాలు లేదా ఇతర సమాచారం ఉన్నవారు, వాటిని గాంధీకొండపై మ్యూజియంలో భద్రపరచడానికి అందించాలని కోరారు. వివరాలకు 9440625778, 8985550485 నెంబర్లను సంప్రదించాలన్నారు.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి నూకానమ్మ



వన్‌టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి యలగాల నూకానమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్‌తో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. నామినేటెడ్ పదవులలోనూ, ప్రజా ప్రతినిధులుగా బీసీలకు ప్రాధాన్యమి స్తున్నందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందన్నారు. దీని వల్ల 16,500 మందికి పదవులు పొందలేక పోయారన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ, బీసీ రక్షణ చట్టం అమలుకు కృషి చేయాలని కోరారు. అంతకుముందు బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు.

టీడీపీ నేత రాంబాబు విగ్రహం ధ్వంసం

- తోటమూలలో వైసీపీ కార్యకర్తల దుశ్చర్య
- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు



తోటమూల(గంపలగూడెం), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు, గ్రామ మాజీ సర్పంచ్ ఇనుగంటి రాంబాబు విగ్రహాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గత నెల తోటమూల రింగ్ సెంటర్‌లో టీడీపీ ఆధ్వర్యంలో రాంబాబు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని ధ్వంసం చేయడంతో రాంబాబు సోదరుడు ఇనుగంటి మధుసూదనరావు ఆదివారం రాత్రే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీకెమెరాలు పరిశీలించగా, వైసీపీకి చెందిన కొంగల వినాయకరావు, మోదుగు శ్రీనివాసరావు, ఇడుపులపాటి రాంబాబు తదితరులు విగ్రహం ధ్వంసం చేసినట్టు గుర్తించారు. సీఐ గిరిబాబు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి తిరువూరు తరలించారు. కాగా విగ్రహం ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ సోమవారం తోటమూల సెంటర్‌లో బంద్ పాటించి, నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు, రింగ్ సెంటర్‌లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

టీడీపీ నేతల ఆందోళన

రాంబాబు విగ్రహం ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ టీడీపీ శ్రేణులు సోమవారం ఆందోళన నిర్వహించాయి. తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు మాట్లాడుతూ మీ తలచుకుంటే మీరు రోడ్లపై కూడా తిరగలేరని అన్నారు. నాడు మీ అరాచకాలను చూసి ప్రజలు మిమ్ములను అధికారానికి దూరంగా పెట్టారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమే ఇటువంటివి చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు మానుకొండ రామకృష్ణ, రేగళ్ల వీరారెడ్డి, దిరిశాల వెంకటకృష్ణారావు, వేముల బాలయ్య, ఇనుగంటి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఘటనతో వైసీపీకి సంబంధంలేదు : కావూరి

టీడీపీ నాయకుడు ఇనుగంటి రాంబాబు విగ్రహం ధ్వంసం ఘటనతో వైసీపీ సంబంధంలేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కావూరి వినయ్‌కుమార్ అన్నారు. కొంగల వినాయకరావును పార్టీ నుంచి రెండేళ్ల క్రితమే సస్పెండ్ చేశామని చెప్పారు. ఇడుపులపాటి రాంబాబుకు వైసీపీ సభ్యత్వం లేదని, అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా కాగడ గుర్తుపై పోటీ చేశాడన్నారు. మోదుగు శ్రీనివాసరావు ఎన్నికల సమయంలో టీడీపీలో చేరి, తదుపరి రాంబాబు విగ్రహం పెట్టవద్దని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడని తెలిపారు.

కాలుష్యం నుంచి కాపాడండి

- కలెక్టర్‌కు జగ్గయ్యపేట ఇండస్ట్రియల్ ఏరియా ప్లాట్‌ల యజమానుల మొర
- కాలుష్యనియంత్రణ మండలి అధికారులతో తనిఖీలు చేయిస్తానని హామీ

మొగల్రాజపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జగయ్యపేట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న ఫార్మాకంపెనీలు, కెమికల్ కంపెనీల నుంచి వెలువడే కాలుష్యంతో గాలి, భూగర్భ జలాలు కలుషితం అయిపోయాయని, రోగాల బారిన పడి ప్రాణాలు పోతున్నాయని తమను ఆ కాలుష్యం నుంచి కాపాడాలని లేకపోతే ఆత్మహత్యలే శరణ్యం అని ఎస్టేట్‌లో ఉన్న ప్లాట్‌ల యాజమానులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు వారు వినతి పత్రం ఇచ్చారు. వారి మొర విన్న కలెక్టర్ జి.లక్ష్మీశ కాలుష్య నియంత్రణ మండలి అధికారులను పంపి తనిఖీలు చేయిస్తానని, నివేదిక రాగానే తాను స్వయంగా వచ్చి చూసి న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం ప్లాట్స్ యజమానుల సంఘం అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం జాతీయ రహదారి పక్కన ఏపీఐఐసీ వేసిన ఆటోనగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో 370 మంది ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ప్లాట్‌లు తీసుకున్నామని, ఈ ప్లాట్‌లలో చిన్న చిన్న షెడ్‌లు, వర్క్‌షాపులు, ఆటోమొబైల్ యూనిట్‌లు పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నామని చెప్పారు. కానీ ఇక్కడి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో కెమికల్ ఫ్యాక్టరీలు, ఫార్మాకంపెనీలు వచ్చిన తరువాత వ్యర్థాలను భూమిలోకి పంపుతున్నారని, ఒక్కోసారి ఖాళీ ప్లాట్‌లలో వదిలేస్తున్నారని చెప్పారు. భూగర్భజలాలు రంగు మారి తీవ్ర దుర్వాసన వస్తున్నాయని చెప్పారు. గాలి నీరు కలుషితం అవడంతో కార్మికులు మానేయడంతో వర్క్‌షాపులను మూసేయాల్సి వచ్చిందన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ధరణి కోట రమణ, ఎన్.శ్రీనివాసరావు, సుధీర్, నాగబాబు, నరసింహారావు, సలుమూరి వాసు, ఎం.రామారావు, గద్దె నాని తదితరులు ఉన్నారు.

ప్రతి అర్జీపైన ప్రత్యేక దృష్టి పెట్టండి : జేసీ

వన్‌టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలకు పరిష్కారం కోరుతూ ప్రజలు చేసుకున్న ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ అన్నారు. విజయవాడలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను అధికారులతో కలిసి నిర్వహించిన ఆమె మొత్తం 168 అర్జీలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్‌కు అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు భావిస్తారని, దీంతో ప్రత్యేక దృష్టిసారించి వాటి కి నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలని వివిధ విభాగాల అధికారులకు సూచించారు. అర్జీల పరిష్కారానికి అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. నిర్ధేశ గడువు లోగా వాటికి పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కేఆర్ సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్తు సంస్థల్లో ఉన్న 23 సంఘాల ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 22వ తేదీ వరకు వివిధ రూపాల్లో నిరసన తెలిపి, అప్పటికీ యాజమాన్యాలు స్పందించకుంటే 24న జేఏసీ సమావేశమై తదుపరి కార్యాచరణ ప్రకటిస్తుందని ఏపీఎస్‌పీఈజేఏసీ ప్రకటించింది.

నాడు మెడికల్ కాలేజీల పేరుతో నిధులు పక్కదారి: సుజాత

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వైద్యకళాశాలల పేరుతో వైసీపీ కొత్త నాటకాలకు తెరతీసిందని మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 17 వైద్యకళాశాలల గురించి జగన్ రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ మెడికల్ కాలేజీల పేరుతో అప్పులు చేసి ఆ నిధులను పక్కదారి పట్టించిన విషయాన్ని ఎందుకు దాస్తున్నారని ఆమె ప్రశ్నించారు. ఆ విషయాన్ని కూడా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

పేద కమ్మ కుటుంబాలకు అండగా ఉంటాం: నాదెండ్ల బ్రహ్మం

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కమ్మ కులంలో వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడమే కార్పొరేషన్ లక్ష్యమని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన నేతృత్వంలో డైరెక్టర్లు తొలిసారిగా సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కమ్మ కులంలో ఆర్థిక ఇబ్బందులు వల్ల ఒక్క విద్యార్థి కూడా చదువు ఆపకుండా చూడాల్సిన బాధ్యత కార్పొరేషన్‌పై ఉందన్నారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా స్టడీసర్కిల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, కార్పొరేషన్ వెబ్‌సైట్‌ను ఆధునిక సాంకేతికతతో రూపొందించాలని నిర్ణయించారు. సమావేశంలో డైరెక్టర్లు అడుసుమిల్లి శ్రీనివాసరావు, సజ్జ అజయ్, గరికిపాటి సుదర్శన్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య డాక్టర్
మంగళవారం • 16 సెప్టెంబరు 2025

అధ్యయనం

డైట్ సోడాలతో చేటు

క్యాలరీలను తగ్గించుకోవాలనే ఆలోచనతో డైట్ సోడాలను ఎంచుకుంటున్నారా? నిజానికి వాటితో మధుమేహం ముప్పు పొంచి ఉంటుందని అధ్యయనాలు నిరూపిస్తున్నాయి.

డైట్ సోడాలతో సాధారణ సోడాలకు మించి మధుమేహ ముప్పు పొంచి ఉంటుంది. రోజుకొక డైట్ సోడాతో 36% టైప్ 2 మధుమేహం ముప్పు ఉంటుందని అధ్యయనాల్లో వెల్లడైంది. 14 ఏళ్ల పాటు 36 వేల మంది మీద చేపట్టిన ఒక పరిశోధనలో, రోజుకొక కృత్రిమ తీపి పానీయం తాగిన వారిలో టైప్2 మధుమేహం ముప్పు, సాధారణ తీపి పానీయం తాగే వారి కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు కనిపెట్టారు. అలాగే డైట్ సోడాల్లోని కృత్రిమ కొవ్వులు పేగుల్లోని బ్యాక్టీరియాను అస్తవ్యస్థం చేస్తాయనీ, ఇన్సులిన్ సంకేతాలను ప్రభావితం చేస్తాయనీ, రక్తంలోని చక్కెరను క్రమబద్ధీకరించుకోవడంలో శరీర సామర్థ్యాన్ని అయోమయానికి గురి చేస్తాయనీ పరిశోధకులు అంటున్నారు. డైట్ సోడాల్లోని ఆస్పర్టేమ్, సుక్రలోజ్‌లు మధుమేహ ముప్పును మధుమేహ ముప్పును పెంచడంతో పాటు స్థూలకాయానికి కూడా దోహదపడతాయి



కాబట్టి అన్ని రకాల శీతల పానీయాలకు దూరంగా ఉండాలని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

తెలుసుకుందాం

విత్తనాలు ఎప్పుడు తినాలి?

శరీరం సమర్థంగా శోషించుకోవడం కోసం కొన్ని విత్తనాలను కొన్ని నిర్దిష్ట సమయాల్లోనే తినాలంటున్నారు ఎయిమ్స్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, డాక్టర్ సౌరభ్ సేథి. మరిన్ని వివరాలు...

చియా విత్తనాలు: ఈ విత్తనాల్లోని పీచు జీర్ణ ప్రక్రియను నెమ్మదిస్తుంది, రక్తంలో చక్కెర మోతాదులను స్థిరంగా ఉంచుతుంది. కాబట్టి వీటిని ఉదయాన్నే లేదా వ్యాయామానికి ముందు తినాలి.

అవిసె: వీటిని ఉదయాన్నే తినాలి. మెత్తగా దంచి తినడం వల్ల పొట్టలోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది.



నువ్వులు: వీటిలోని క్యాల్షియం ఎముకల సాంద్రతను పెంచుతుంది. రాత్రివేళ ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గుతుంది కాబట్టి వీటిని రాత్రి భోజనంలో తినాలి.

సోంపు: వీటిలోని అనెథోల్ పొట్టలోని కండరాలను రిలాక్స్ చేసి పొట్ట ఉబ్బరం తగ్గిస్తుంది కాబట్టి వీటిని భోజనం తర్వాత తినాలి.

నానబెడితే?

చియా, సబ్జా విత్తనాలను నానబెట్టడం వల్ల వాటి బాహ్య పొర బెత్తబడి, పోషకాలు మరింత మెరుగ్గా శోషణ చెందడానికి తోడ్పడే ఎంజైమ్స్ విడుదల అవుతాయి. చియా విత్తనాలను నీళ్లలో నానబెట్టినప్పుడు అవి 12 రెట్లు బరువు పెరుగుతాయి. అలాగే జీర్ణశక్తికి తోడ్పడే జిగట పదార్థాన్ని కూడా విడుదల చేస్తాయి. దాంతో ఆకలి అదుపులో ఉంటుంది. వీటిలో విటమిన్ బి, ఖనిజలవణాలు మెండుగా ఉంటాయి. కాబట్టి ఇలా నానబెట్టిన చియా, సబ్జాలను పరగడుపున తీసుకోవడం వల్ల, అప్పటివరకూ ఉపవాస స్థితిలో ఉన్న శరీరానికి సరిపడా శక్తి అందుతుంది. అలాగే ఏ విత్తనమైనా ఒకటి నుంచి రెండు స్పూన్లకు పరిమితం చేయాలి.

అధిక కొలెస్ట్రాల్



కొలెస్ట్రాల్ మనకు మిత్రుడా? శత్రువా?

అతి కచ్చితంగా అనర్థదాయకమే! ఈ సూత్రం కొలెస్ట్రాల్‌కూ వర్తిస్తుంది. తగు మోతాదుల్లో ఆరోగ్యానికి మేలు చేసే కొలెస్ట్రాల్, మితిమీరితే కచ్చితంగా చేటు చేస్తుందంటున్నారు వైద్యులు. మరీ ముఖ్యంగా గుండెకు హాని కలగకుండా ఉండడం కోసం కొలెస్ట్రాల్ మోతాదును ఎలా పరిమితం చేసుకోవాలో ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ రమేష్ గూడపాటి ఇలా వివరిస్తున్నారు.

కొలస్ట్రాల్ అనగానే అందరికీ గుండెజబ్బులే గుర్తొస్తాయి. కానీ నిజానికి కొలస్ట్రాల్ మన శరీరానికి అత్యవసరమైన ముడి పదార్థం. శరీరంలో హార్మోన్ స్రావాల ఉత్పత్తిలో, కణ సంశ్లేషణలో కొవ్వులు కీలక పాత్ర పోషిస్తాయి. కానీ పరిమితిలో ఉన్నంత కాలం వీటితో ఎలాంటి హానీ ఉండదు. అయితే వీటిలో రకాలతో పాటు, మంచివీ, చెడ్డవీ కూడా ఉంటాయి. వాటి రకాలు, ఆరోగ్యకర మోతాదులు ఏవంటే...

టోటల్ కొలస్ట్రాల్: 200 (మిల్లీగ్రామ్స్ పర్ డెసిలీటర్) కంటే తక్కువ ఉండాలి

ఎల్‌డిఎల్ కొలస్ట్రాల్: ఇది చెడు కొలస్ట్రాల్. ఇది వంద లోపు ఉండాలి

హెచ్‌డిఎల్ కొలస్ట్రాల్: ఇది మంచి కొలస్ట్రాల్. 40 కంటే ఎక్కువ ఉండాలి

విఎల్‌డిఎల్ కొలస్ట్రాల్: 30 కంటే తక్కువ ఉండాలి

ట్రైగ్లిజరైడ్స్: 150 కంటే తక్కువ ఉండాలి. మంచి కొలస్ట్రాల్స్ కూడా వాటి పరిమితులు దాటకుండా చూసుకోవాలి. పరిమితి మించితే ఇవి కూడా శరీరానికి హాని చేస్తాయి.

ఒక్కొక్కరిలో ఒక్కోలా...


కొలస్ట్రాల్ మోతాదులు, వాటి ప్రభావం అందరికీ ఒకేలా ఉండదు. కొవ్వు మోతాదులు వ్యక్తుల ఆరోగ్య పరిస్థితులను బట్టి మారుతూ ఉంటాయి. ఆరోగ్యవంతుల మోతాదులకూ, హృద్రోగులు, మధుమేహుల మోతాదులకూ తేడాలుంటాయి. మధుమేహుల మోతాదులు సాధారణ స్థాయిల కంటే తక్కువగా ఉండాలి. అలాగే గుండె రక్తనాళాల్లో అవరోధాలున్నవాళ్లలో కూడా కొలస్ట్రాల్ స్థాయులు మరింత తక్కువగా ఉండాలి. మధుమేహుల్లో ఎల్‌డిఎల్ 70 కంటే తక్కువ ఉండాలి. మధుమేహంతో పాటు గుండెజబ్బు కూడా ఉన్నప్పుడు, ఎల్‌డిఎల్ 55 కంటే తక్కువ ఉండాలి. గుండెజబ్బు మాత్రమే ఉన్నవాళ్లు, 70 కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలి.

కొలస్ట్రాల్ మీద కన్నేసి...

మూడింట రెండొంతుల కొలస్ట్రాల్ మన శరీరంలోనే తయారవుతుంది. మూడింట ఒక వంతు కొలస్ట్రాల్ మాత్రమే మనం తీసుకునే ఆహారం, అనుసరించే అలవాట్ల మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి శరీరంలోనే తయారయ్యే కొలస్ట్రాల్ మన జన్యు నిర్మాణం మీద ఆధారపడి ఉంటుంది కాబట్టి దాన్ని మనం నియంత్రించలేం! అయితే జన్యుపరమైన కారణాల వల్ల కొందర్లో సహజసిద్ధంగానే కొలస్ట్రాల్ ఎక్కువ మోతాదుల్లో ఉత్పత్తి అవుతూ ఉంటుంది. కాబట్టి శరీర దారుఢ్యం కలిగి ఉండి, మంచి ఆహారపుటలవాట్లను కలిగి ఉండి, ఆరోగ్యంగా ఉన్నవాళ్లు తమకు కొలస్ట్రాల్ ఎక్కువగా ఉండే అవకాశం లేదని అనుకోడానికి వీల్లేదు. అలాగే స్థూలకాయులై ఉండి, అనారోగ్యకరమైన జీవనవిధానాన్ని కొనసాగించే వాళ్లలో కొలస్ట్రాల్ సాధారణ మోతాదుల్లో ఉండే అవకాశాలూ ఉంటాయి. కొలస్ట్రాల్ మోతాదులు పెరిగినా ఎటువంటి లక్షణాలూ కనిపించవు కాబట్టి, జన్యు నిర్మాణం ఎలా ఉందో ఎవరికి వారు తెలుసుకునే వీలు లేదు కాబట్టి ప్రతి ఒక్కరూ రక్త పరీక్షతో ఈ కొవ్వు మోతాదులను పరీక్షించుకుంటూ ఉండాలి. 30 ఏళ్లు పైబడిన వాళ్లు కొలస్ట్రాల్‌ను పరీక్షించుకుని, కొవ్వులన్నీ సరైన మోతాదుల్లో ఉండి, ఎటువంటి ఆరోగ్య సమస్యలూ లేనప్పుడు, ఐదేళ్లకోసారి కొలస్ట్రాల్‌ను పరీక్షించుకుంటూ ఉంటే సరిపోతుంది. 50 ఏళ్లకు చేరుకున్న తర్వాత ఏడాదికోసారి తప్పనిసరిగా పరీక్షించుకోవాలి. అలాగే మధుమేహం, అధిక రక్తపోటు ఉన్నవాళ్లు వయసుతో సంబంధం లేకుండా ఏడాదికోసారి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.

ఏ నూనె ఉత్తమం?

వంటనూనెల్లో మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు, అన్ శాచురేటెడ్ కొవ్వులు, శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. వీటిలో మొదటి రెండు కొవ్వులూ మన శరీరానికి మంచివి. శాచురేటెడ్ కొవ్వులు కొంత హానికరమైనవి. కాబట్టి శాచురేటెడ్ కొవ్వులు ఎక్కువగా ఉండే డాల్డా, పామాయిల్, కొబ్బరినూనెల వాడకం తగ్గించాలి. పొద్దుతిరుగుడు, నువ్వులు, వేరుసెనగ, రైస్ బ్రాన్, ఆలివ్ మొదలైన నూనెల్లో కొవ్వులన్నీ వివిధ నిష్పత్తుల్లో ఉంటాయి. కాబట్టి ప్రతి రెండు, మూడు నెలలకూ ఈ నూనెలను మార్చి వాడుకుంటూ ఉండాలి. వంటకు ఏ నూనె వాడుకుంటున్నాం? అనే దాని కంటే ఎంత నూనె వాడుకుంటున్నాం? అన్నది ముఖ్యం. ఒక వ్యక్తి నెలకు అర కిలో నూనె మాత్రమే వాడుకోవాలి.



కుటుంబ చరిత్రలో గుండె జబ్బులున్నవాళ్లు రెట్టింపు అప్రమత్తంగా ఉంటూ, కొలస్ట్రాల్ మోతాదులను సాధారణ స్థాయిల కంటే తక్కువలో ఉంచుకోవాలి.

కొలస్ట్రాల్ ఎక్కువైతే?

కొవ్వు మోతాదులు మించితే రక్తనాళాల్లోని గోడల్లో పేరుకుపోయి, పూడికలు ఏర్పడతాయి. వీటి మీద రక్తపు గడ్డలు ఏర్పడి గుండెపోటుకు దారి తీయవచ్చు. ఇలా గుండె రక్తనాళాల్లో పూడికలతో గుండెపోటు వచ్చినట్టే మెదడు రక్తనాళాల్లో పూడికలు ఏర్పడితే బ్రెయిన్ స్ట్రోక్ వస్తుంది. ఇది పక్షవాతానికి దారి తీస్తుంది. అదే విధంగా మూత్రపిండాల రక్తనాళాల్లో పూడికలు ఏర్పడితే మూత్రపిండాల సామర్థ్యం కుంటుపడవచ్చు. ఈ ప్రదేశాల్లోనే కాకుండా శరీరంలోని ఏ రక్తనాళంలోనైనా కొలస్ట్రాల్ పూడికలు ఏర్పడవచ్చు. ఫలితంగా సంబంధిత అవయవానికి రక్తసరఫరా తగ్గి ఆ అవయవం దెబ్బతినే అవకాశం ఉంటుంది. కాబట్టి అధిక కొలస్ట్రాల్‌ను గుండెకు ముప్పు తెచ్చే అంశంగానే పరిగణించాలి. ప్రపంచవ్యాప్త మరణాలకు... గుండె, రక్తనాళాల సమస్యలే ప్రధాన కారణాలు. ప్రతి వంద మందిలో 30 మంది ఈ రెండు సమస్యల వల్లే ప్రాణాలు కోల్పోతూ ఉంటారు. ఈ రెండు సమస్యలకు దారి తీసే ముఖ్యమైన ప్రమాద కారకాల్లో అధిక కొలస్ట్రాల్ ఒకటి.

నియంత్రణ ఇలా...

కొలస్ట్రాల్‌ను ఆరోగ్యకర మోతాదుల్లో ఉంచుకోవడం కోసం ఆరోగ్యకరమైన జీవనవిధానాన్ని కొనసాగించాలి. అందుకోసం...

ఆహారం: ఆహారంలో పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు ఎక్కువగా, మటన్, బీఫ్, పోర్క్‌లు (రెడ్ మీట్) తక్కువగా ఉండేలా చూసుకోవాలి. అలాగే కొవ్వు తక్కువగా ఉండే పాల ఉత్పత్తులు తీసుకోవాలి. వెన్న, నెయ్యిలను పరిమితం చేసి, మీగడ తీసిన పెరుగు, కొవ్వు తొలగించిన పాలు తీసుకోవాలి. బాదం, పిస్తా లాంటి నట్స్ కూడా పరిమితంగా తీసుకోవాలి. వేపుళ్లు, తీపి పదార్థాలు తగ్గించుకోవాలి.

వ్యాయామం: రోజుకు కనీసం అరగంట చొప్పున, వారంలో ఐదు రోజుల పాటు వ్యాయామం చేయాలి. నడక, పరుగు, ఈత, సైకిల్ తొక్కడం... ఇలా ఏదో ఒక వ్యాయామం తప్పనిసరిగా చేయాలి.

దురలవాట్లు: ధూమపానం, మద్యపానం కొలస్ట్రాల్ మోతాదులను పెంచుతాయి. కాబట్టి వీటిని మానేయడం మంచిది.

అధిక బరువు: ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూసుకోవాలి. అధిక బరువును ఐదు శాతం తగ్గించుకున్నా కొలస్ట్రాల్ మోతాదులు చాలా బాగా తగ్గుతాయి

పరీక్షలు: క్రమం తప్పక ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.

సమర్థమైన మందులున్నాయి

అస్తవ్యస్థ జీవనశైలి వల్ల కొందర్లో కొలస్ట్రాల్ మోతాదులు పెరిగిపోవచ్చు. జన్యుపరమైన కారణాల వల్ల కూడా కొందర్లో ఈ పరిస్థితి తలెత్తవచ్చు. ఇలాంటి సందర్భాల్లో కొవ్వు మోతాదులను తగ్గించే మందులను వాడుకోవాలి. కొలస్ట్రాల్‌ను తగ్గించుకోవడం కోసం సాధారణంగా స్టాటిన్స్ మందులనే వాడుకుంటూ ఉంటాం. ఈ మందులు టోటల్ కొలస్ట్రాల్, హెచ్‌డిఎల్, ఎల్‌డిఎల్ కొలస్ట్రాల్స్‌ను తగ్గిస్తాయి. అయితే ట్రైగ్లిజరైడ్స్‌ను మాత్రమే తగ్గించే ఫిబ్రేట్స్ మందులు కూడా ఉన్నాయి. కొలస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్... ఈ రెండూ ఎక్కువగా ఉన్నప్పుడు, రెండు రకాల మందులూ కలిపి వాడుకోవాలి. ఎక్కువ శాతం కొలస్ట్రాల్ మన శరీరంలో రాత్రివేళ్లే తయారవుతుంది. కాబట్టి ఈ మందులను రాత్రి భోజనం తర్వాతే వేసుకోవాలి. ఈ మందులతో ఎల్‌డిఎల్ కొలస్ట్రాల్ 30 నుంచి 40 శాతానికి తగ్గుతుంది. ఇటీవలి కాలంలో ఇంజెక్షన్ రూపంలోని మందులు కూడా అందుబాటులోకొచ్చాయి. ఆరు నెలలకోసారి తీసుకునే ఇంజక్షన్‌తో పాటు రెండు వారాలకోసారి తీసుకునే ఇంజక్షన్లు కూడా ఉన్నాయి. వీటితో కొలస్ట్రాల్ మోతాదులను 60% మేరకు తగ్గించుకునే వీలుంది. స్టాటిన్స్ వాడుతున్నప్పటికీ కొలస్ట్రాల్ స్థాయులు ఆశించిన స్థాయికి తగ్గకపోయినప్పుడు ప్రత్యామ్నాయంగా ఇంజక్షన్లను ఎంచుకోవచ్చు. అలాగే స్టాటిన్లతో ఒళ్లునొప్పులు దుష్ప్రభావాలు ఎదుర్కొనేవాళ్లు కూడా ఇంజక్షన్లను ఎంచుకోవచ్చు. కొందరికి స్టాటిన్లు ఒక్కటే సరిపోవు, అలాంటి వారికి కూడా ఇంజక్షన్లు అవసరమవుతాయి. అయితే స్టాటిన్స్‌తో పోల్చితే ఇంజక్షన్లు ఖరీదైనవి. నెలకోసారి తీసుకునే ఇంజక్షన్ ధర సుమారు లక్ష రూపాయలుంటే, రెండు వారాలకోసారి తీసుకునే ఇంజక్షన్ 20 వేలు ఉంటుంది. ఈ రోజు కొలస్ట్రాల్‌ను నియంత్రించుకుంటే, రేపటి కోసం గుండెను కాపాడుకోవచ్చు. సంతులన జీవనవిధానం, క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు, సమర్థమైన చికిత్సలతో కొలస్ట్రాల్ మోతాదులను అదుపులో ఉంచుకోవడం కచ్చితంగా సాధ్యమే!

అపోహలు - వాస్తవాలు

అపోహ: సన్నగా, ఫిట్‌గా ఉంటే అధిక కొలస్ట్రాల్ సమస్య ఉండదు

వాస్తవం: ఇది నిజం కాదు. కొలస్ట్రాల్ మోతాదులు జన్యునిర్మాణం మీద ఆధారపడి ఉంటాయి కాబట్టి ఆరోగ్యవంతుల్లో కూడా అధిక కొలస్ట్రాల్ ఉండే అవకాశం లేకపోలేదు

అపోహ: మందులతో కొలస్ట్రాల్ తగ్గితే మందులు వాడుకోవలసిన అవసరం లేదు

వాస్తవం: మధుమేహం, అధిక రక్తపోటు మాదిరిగానే కొలస్ట్రాల్ మందులు కూడా దీర్ఘకాలం వాడుకోవాల్సి ఉంటుంది. కాబట్టి కొలస్ట్రాల్ తగ్గిందని మందులు ఆపకూడదు. అలాగే వ్యాయామాలు, ఆహార నియమాలు కూడా ఆపడానికి వీల్లేదు. అవసరమైతే మందుల మోతాదు పెంచుకుందామనే ఆలోచనతో ఆహారనియమాలను ఉల్లంఘించకూడదు

అపోహ: అధిక కొలస్ట్రాల్ ఉన్నవాళ్లు గుడ్డు పచ్చ సొన తినకూడదు

వాస్తవం: ఒక రోజుకు ఒకట్రెండు గుడ్ల పచ్చసొనలు తినడం వల్ల ఎలాంటి సమస్యా ఉండదు

డాక్టర్ రమేష్ గూడపాటి
సీనియర్ కన్సల్టెంట్ అండ్
హెచ్ఒడి, ఇంటర్వెన్షనల్
కార్డియాలజీ,
స్టార్ హాస్పిటల్స్ హైదరాబాద్.



ఆ లక్షణాలు అసాధారణం

పిత్తాశయానికి క్యాన్సర్ సోకినప్పుడు తొలి దశల్లోనే గుర్తించడం ఒకింత కష్టమవుతూ ఉంటుంది. కానీ ఈ క్యాన్సర్‌లో బయల్పడే కొన్ని అసాధారణ లక్షణాల మీద కన్నేసి ఉంచగలిగితే తొలినాళ్లలోనే కనిపెట్టి, క్యాన్సర్ నుంచి విముక్తి పొందడం సులభమే! ఆ అసాధారణ లక్షణాలు ఏవంటే...

చర్మం దురద: పిత్తాశయ క్యాన్సర్‌లో ప్రధాన లక్షణం కామెర్లు. అయితే దురదలు వేధిస్తూ ప్రత్యేకించి రాత్రివేళల్లో తీవ్రమవుతూ ఉంటాయి. క్యాన్సర్ గడ్డ బైల్ డక్ట్‌కు అడ్డుపడడం వల్ల, బైల్స్ బయటకు వెళ్లలేక కణజాలాల్లో బైల్ సాల్ట్స్ పేరుకుపోయి దురదలు వేధిస్తాయి. కాబట్టి కామెర్లతో పాటు, దురదలు కూడా వేధిస్తుంటే అప్రమత్తం కావాలి.

ముదురు రంగు మూత్రం: కామెర్ల కంటే ముందు కనిపించే లక్షణమిది. మూత్రం, మలం ముదురు రంగులోకి మారిపోతాయి. కణితి వల్ల బైల్ డక్ట్ మూసుకుపోయి, బైల్ స్రావాలు పేగుల్లోకి చేరుకోలేకపోవడంతో, రక్తంలో బైల్ సాల్ట్స్ పేరుకుపోవడం మూలంగా మలమూత్రాలు రంగు మారతాయి.



క్యాన్సర్ కేర్

పొత్తికడుపులో గడ్డ: చివరి దశలో బయల్పడే లక్షణమిది. పొత్తికడుపులో గడ్డ ఉబ్బెత్తుగా కనిపిస్తూ ఉంటుంది. బైల్‌డక్ట్ మూసుకుపోవడం మూలంగా పిత్తాశయం ఉబ్బిపోతుంది. లేదంటే క్యాన్సర్ పిత్తాశయం నుంచి కాలేయానికి పాకినప్పుడు కూడా ఇదే పరిస్థితి తలెత్తుతుంది.

బరువు, ఆకలి తగ్గడం: అకారణంగా బరువు తగ్గడం, ఆకలి కోల్పోవడం కూడా పిత్తాశయ క్యాన్సర్ లక్షణాలే! శరీరం శక్తిని ఖర్చు చేసుకునే తీరు, జీర్ణ ప్రకియలు తీవ్రంగా దెబ్బతినడం వల్ల ఈ లక్షణాలు మొదలవుతాయి. కొద్దిపాటి ఆహారానికే కడుపు నిండిపోతున్నా, ఆకలి తగ్గిపోయినా, బరువు కోల్పోతున్నా అప్రమత్తం కావాలి.

నొప్పి, అసౌకర్యం: పొత్తికడుపు పైభాగంలో కుడి వైపు స్వల్ప నొప్పి, అసౌకర్యం కొనసాగుతూ ఉంటాయి. ఈ నొప్పి, పిత్తాశయంలో రాళ్ల నొప్పిని పోలినట్టు తీవ్రంగా ఉండదు. విడతలవారీగా వస్తూ, పోతూ వెన్నులోకీ, భుజాల మధ్యకూ పాకుతూ ఉంటుంది.



ప్రతి ఏటా సెప్టెంబరు 17న, ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ రోగుల భద్రతా దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నేతృత్వంలో అన్ని ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో రోగి భద్రత ప్రాముఖ్యతను తెలియజెప్పడం కోసం ఈ ప్రయత్నానికి పూనుకుంటూ ఉంటారు. "నవజాత శిశువు, బిడ్డల సంరక్షణ" ఈ ఏడాది థీమ్. వైద్య పరిసరాల్లో పిల్లల భద్రత, హక్కుల పట్ల అత్యవసర శ్రద్ధ వహించడమే ఈ థీమ్ లక్ష్యం.

సెప్టెంబరు 17
ప్రపంచ రోగుల భద్రతా దినోత్సవం

పసికందుల భద్రత తల్లితండ్రుల చేతుల్లో..

ఎదిగే క్రమంలో పిల్లల అవసరాలు భిన్నంగా ఉంటాయి. వారి శరీరంలో చోటుచేసుకునే మార్పులు కూడా భిన్నంగా ఉంటాయి. పిల్లల భావవ్యక్తీకరణ సంక్లిష్టంగా ఉంటుంది. అయితే వీటన్నిటి పట్ల శ్రద్ధ కనబరుస్తూ, పసికందుల ఆరోగ్యాన్ని కాపాడుకునేలా నడుచుకోవడం తల్లితండ్రుల బాధ్యత. ప్రసవం మొదలు, ఆరోగ్యకరమైన నవజాత శిశువుతో ఇంటికి చేరుకునే వరకూ అనేక జాగ్రత్తలు పాటించవలసి ఉంటుంది. తీసుకోవలసిన జాగ్రత్తల్లో ఏ చిన్న తప్పు జరిగినా, లక్షణాలను అశ్రద్ధ చేసినా, మందుల మోతాదు క్రమం తప్పినా పిల్లలు దీర్ఘకాలపు పర్యవసానాలను ఎదుర్కోవలసి వస్తుంది. కాబట్టి ప్రత్యేకించి నవజాత శిశువులు, పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచడం అవసరం. ప్రపంచవ్యాప్తంగా లక్షల మంది పిల్లలు, నియంత్రించే వీలున్న వైద్యపరమైన తప్పిదాల బారిన పడుతున్నారు. నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్న నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు బహుళ మందులు, ఫీడింగ్ సపోర్ట్, శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే పరికరాలు, నిరంతర పర్యవేక్షణలు అవసరవుతాయి. వీటిలో ఏ ఒక్క అంశంలో తప్పిదం జరిగినా బిడ్డ ప్రాణాలకే ప్రమాదం వాటిల్లుతుంది. కాబట్టి నవజాత శిశువుల భద్రత విషయంలో పూర్తిగా యంత్రాల మీదే ఆధారపడకుండా, అనుభవజ్ఞులైన నిపుణులను ఎంచుకోవడం కూడా అవసరమే!

సురక్షితమైన ప్రసవం కోసం...

ప్రసవమైన తొలి 28 రోజులు ఎంతో కీలకమైనవి కాబట్టి నిపుణులైన ప్రసూతి వైద్యులతో పాటు ప్రసవ సహాయకులను ఎంచుకోవడమూ అవసరమే! పరిశుభ్రమైన ప్రసవ పరిస్థితులు, నియోనాటల్ కేర్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. అలాగే...

బరువును బట్టి మోతాదు: పసికందులకు ఇచ్చే మందులు వారి బరువు ఆధారంగా అంచనా వేయాలి. పసిపిల్లలకు పొంచి ఉండే ప్రమాదాల్లో మందుల మోతాదు ప్రధానమైనది.

కమ్యూనికేషన్: ఆరోగ్య సంరక్షకులు, కుటుంబాల మధ్య సంభాషణ స్పష్టంగా సాగాలి. కుటుంబ సభ్యులు తమకు నచ్చని అంశాన్ని సూటిగా ప్రశ్నించి సంతృప్తికరమైన సమాధానం రాబట్టాలి.

ఇన్‌ఫెక్షన్లు: చేతులు శుభ్రం చేసుకోవడం, పరికరాలను స్టెరిలైజ్ చేయడం, ఆస్పత్రుల్లో మరీ ముఖ్యంగా పిల్లల వార్డుల్లో, ఎన్ఐసియుల్లో పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవడం వల్ల పిల్లలకు ప్రాణాంతక ఇన్‌ఫెక్షన్ల ముప్పు తప్పుతుంది.

తల్లితండ్రులు ఇలా నడుచుకోవాలి

- బిడ్డకు అందించే మందుల పట్ల పూర్తి అవగాహన పెంచుకుని, వైద్యులతో ఒకటికి రెండుసార్లు చర్చించాలి
- చికిత్స, వ్యాధినిర్ధారణ గురించి వైద్యులను అడిగి అవగాహన పెంచుకోవాలి
- బిడ్డకు సంబంధించిన ఏ ఒక్క లక్షణాన్నీ వైద్యుల నుంచి దాచకూడదు
- బిడ్డ పరిపూర్ణ ఆరోగ్యానికి దోహదపడే అంశాలన్నిటినీ వైద్యులను అడిగి తెలుసుకోవాలి.

డాక్టర్ సురేష్ కుమార్ పానుగంటి
సీనియర్ పీడియాట్రిషియన్,
యశోద హాస్పిటల్స్
సోమాజిగూడ, హైదరాబాద్.



ప్లాస్టిక్‌ను వదిలించే చింతపండు

చింతపండు కలిగి ఉండే ఆరోగ్య ప్రయోజనాల గురించి మనకున్న అవగాహన తక్కువే! కానీ చింతపండుతో ఒరిగే ఒక ఆశ్చర్యకరమైన ఆరోగ్య ప్రయోజనాన్ని తాజా పరిశోధన బహిర్గతం చేసింది. అదేంటంటే....

మన శరీరంలోకి చేరుకునే మైక్రోప్లాస్టిక్స్ ఎంతటి ఆరోగ్య ముప్పును తెచ్చి పెడతాయో అందరికీ తెలిసిందే! అయితే వీటిని శరీరం నుంచి తొలగించే మహత్తరమైన శక్తి చింతపండుకు ఉందని తాజా పరిశోధనలో బహిర్గతమైంది. చింతపండు సారం,

పరిశోధన



శరరంలోని మైక్రోప్లాస్టిక్ అణువులతో పరస్పర చర్య జరుపుతున్నట్టు నియంత్రిత ప్రయోగాల్లో వెల్లడైంది. ప్రయోగశాలల్లో చేపట్టిన పరీక్షల్లో చింతపండు సారం, నీళ్లలోని 90% మైక్రోప్లాస్టిక్స్‌ను తొలగించడాన్ని పరిశోధకులు కనిపెట్టారు. చింతపండులోని కాంపౌండ్స్, సహజసిద్ధ పాలిమర్స్‌ను సృష్టించడమే ఇందుకు కారణం. ఈ పాలిమర్స్ సూక్ష్మప్లాస్టిక్స్‌ను వెతికి బంధించడమే కాకుండా, వాటిని తమతో పాటు మోసుకుపోతున్నట్టు పరిశోధకులు కనిపెట్టారు. అయితే సూక్ష్మప్లాస్టిక్స్ నుంచి మనుషులను డిటాక్స్ చేయడానికి చింతపండు ఉపయోగపడుతుందని నిర్థారించడానికి మరికొన్ని అధ్యయనాలు అవసరమవుతాయనీ, తాజా పరిశోధనతో ప్లాస్టిక్ కాలుష్యానికి సహజసిద్ధ పరిష్కారాల పట్ల ఆసక్తి పెరుగుతుందనీ పరిశోధకులు అంటున్నారు.

'ప్లేయర్ ఆఫ్ ద మంత్' సిరాజ్



దుబాయ్: భారత పేసర్ మహ్మద్ సిరాజ్ ఆగస్టు మాసానికిగాను ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్‌గా ఎంపికయ్యాడు. వాస్తవానికి ఆగస్టు నెలలో అతను ఒక్క టెస్టే ఆడాడు. ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లోని ఆఖరిదైన ఐదో టెస్టులో సిరాజ్ ఏకంగా 9 వికెట్లు పడగొట్టి భారత్‌ను గెలిపించాడు. తద్వారా సిరీస్ కూడా 2-2తో సమమైంది. ఈ అద్భుత ప్రదర్శనతో అతడు న్యూజిలాండ్ పేసర్ మ్యాట్ హెన్రీ, వెస్టిండీస్ పేసర్ జేడెన్ సీల్స్‌ను వెనక్కి నెట్టి పురస్కారం అందుకున్నాడు. అటు ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్‌గా ఎంపిక కావడం గర్వంగా ఉందని సిరాజ్ తెలిపాడు.

శ్రీలంక కష్టంగా..

ఆసియా కప్‌లో నేడు
అఫ్ఘానిస్థాన్ × బంగ్లాదేశ్
రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

పోరాడి ఓడిన హాంకాంగ్ • ఆసియాకప్


నిస్సాంక (68)

దుబాయ్: తాజా ఆసియాకప్‌లో తొలిసారిగా ఉత్కంఠభరిత మ్యాచ్ చోటుచేసుకుంది. సోమవారం శ్రీలంకతో జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో హాంకాంగ్ చివరి వరకు పోరాడింది. అయితే ఆఖర్లో హసరంగ (9 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 20 నాటౌట్) స్వేచ్ఛగా ఆడడంతో మరో ఏడు బంతులుండగా 4 వికెట్ల తేడాతో లంక గట్టెక్కింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హాంకాంగ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 149 పరుగులు చేసింది. నిజాకత్ ఖాన్ (52 నాటౌట్) అజేయ అర్ధసెంచరీ సాధించగా, ఓపెనర్ అన్షుమన్ రథ్ (48) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ జోడీ మూడో వికెట్‌కు 61 పరుగులు జోడించింది. పేసర్ చమీరకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో లంక 18.5 ఓవర్లలో 153/6 స్కోరుతో నెగ్గింది. నిస్సాంక (68) అర్ధసెంచరీతో రాణించాడు. డెత్ ఓవర్లలో వేగంగా వికెట్లు కోల్పోయిన లంక ఓటమి దిశగా సాగింది. కానీ 18వ ఓవర్‌లో హసరంగ సిక్స్‌తో 14 రన్స్ రావడంతో మ్యాచ్‌పై హాంకాంగ్ పట్టు చేజారింది. అలాగే ఈ మ్యాచ్‌లో ఆరు క్యాచ్‌లు జారవిడవడంతో ఆ జట్టు మూల్యం చెల్లించుకున్నట్టయ్యింది.

సంక్షిప్త స్కోర్లు: హాంకాంగ్: 20 ఓవర్లలో 149/4 (నిజాకత్ 52 నాటౌట్, అన్షుమన్ 48; చమీర 2/29). **శ్రీలంక:** 18.5 ఓవర్లలో 153/6 (నిస్సాంక 68, హసరంగ 20, పెరీర 20; ముర్తజా 2/37).

ఒమన్‌పై యూఏఈ గెలుపు

• వసీం, షరాఫు అర్ధ శతకాలు
• సూపర్-4కు భారత్

ఆసియా కప్


వసీం (69)

అబుధాబి: కెప్టెన్ మహ్మద్ వసీం (69), అలీషాన్ షరాఫు (51) అర్ధ శతకాలతో రాణించడంతో.. ఆసియా కప్‌లో యూఏఈ బోణీ చేసింది. గ్రూప్-ఎలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో 42 పరుగుల తేడాతో ఒమన్‌పై గెలిచిన యూఏఈ సూపర్-4 అవకాశాలను సజీవంగా నిలబెట్టుకొంది. కాగా, ఈ మ్యాచ్ ఫలితంతో భారత్ మరో మ్యాచ్ మిగిలుండగానే సూపర్-4 బెర్త్‌ను ఖరారు చేసుకొంది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన టీమిండియా నాలుగు పాయింట్లతోపాటు మెరుగైన రన్‌రేట్‌తో టాప్‌లో ఉంది. తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 172 పరుగులు చేసింది. జితెన్ రామనంది రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేదనలో ఒమన్ 18.4 ఓవర్లలో 130 పరుగులకు కుప్పకూలింది. ఆర్యన్ (24), కెప్టెన్ జతిందర్ సింగ్ (20), వినాయక్ శుక్లా (20) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు.

సంక్షిప్త స్కోర్లు: యూఏఈ: 20 ఓవర్లలో 172/5 (వసీం 69, షరాఫు 51; జితెన్ 2/24). **ఒమన్:** 18.4 ఓవర్లలో 130 ఆలౌట్ (ఆర్యన్ 24, జతిందర్ సింగ్ 20, శుక్లా 20; జునైద్ 4/23).

వైశాలి..చరిత్ర సృష్టించింది

• టైటిల్ నిలబెట్టుకున్న భారత జీఎం
• 'క్యాండిడేట్స్'కు క్వాలిఫై • స్విస్ గ్రాండ్ ప్రీ చెస్



సమర్‌కండ్ (ఉజ్బెకిస్థాన్): భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. వైశాలి చరిత్ర సృష్టించింది. స్విస్ గ్రాండ్ ప్రీ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ నిలబెట్టుకుంది. ఇక పురుషుల టైటిల్‌ను అనీష్ గిరి (నెదర్లాండ్స్-8 పాయింట్లు) అందుకున్నాడు. తమిళనాడుకు చెందిన వైశాలి సోమవారం ఇక్కడ జరిగిన 11వ, ఆఖరి రౌండ్‌ను ప్రపంచ మాజీ చాంపియన్ టాన్ జోంగ్యీతో డ్రా చేసింది. దాంతో మొత్తం 8 పాయింట్లతో వైశాలి విజేతగా నిలిచింది. తద్వారా 2023లో గెలిచిన ఈ టైటిల్‌ను ఆమె నిలబెట్టుకుంది. అంతేకాదు హంపి, దివ్యాదేశ్‌ముఖ్ తర్వాత ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీకి అర్హత సాధించిన మూడో భారత మహిళగా ఘనత సాధించింది. ఇక..ఈసారి స్విస్ చాంపియన్‌షిప్ రన్నరప్‌గా నిలిచిన లగ్నో (రష్యా) కూడా క్యాండిడేట్స్ టోర్నీ బెర్త్ ఖాయం చేసుకుంది. ద్రోణవల్లి హారిక (6.5) ఆఖరి రౌండ్‌లో కరీసా ఇప్‌పై నెగ్గింది. గ్రాండ్‌మాస్టర్ అర్జున్ 11వ రౌండ్‌ను విన్సెంట్ కీమర్‌తో డ్రా చేశాడు. కీమర్‌తోపాటు రెండో స్థానంలో నిలిచిన మథియాస్ పురుషుల విభాగం నుంచి క్యాండిడేట్స్ చెస్‌కు అర్హత సాధించాడు.

డుప్లాంటిస్ 14వసారి..

● వరల్డ్ రికార్డు తిరగరాసిన పోల్‌వాల్ట్ స్టార్
● ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్



టోక్యో: స్వీడన్ పోల్ వాల్ట్ స్టార్ అర్మాండ్ డుప్లాంటిస్ 14వ సారి ప్రపంచ రికార్డును తిరగరాశాడు. వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో సోమవారం జరిగిన పురుషుల పోల్‌వాల్ట్ ఈవెంట్‌లో డుప్లాంటిస్ మూడో, ఆఖరి ప్రయత్నంలో 6.30 మీటర్ల ఎత్తు దూకి మూడోసారి వరల్డ్ టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు. ఈ క్రమంలో హంగేరిలో జరిగిన ఈవెంట్‌లో తన రికార్డు 6.29 మీటర్లను అధిగమించాడు. సోవియట్ యూనియన్ మాజీ పోల్‌వాల్టర్ సెర్గీ బుబ్కా 13 సార్లు ప్రపంచ రికార్డును తిరగరాశాడు. ఇప్పుడు డుప్లాంటిస్ అతడిని అధిగమించాడు.



మారథాన్‌లో ఫొటో ఫినిష్..: పురుషుల మారథాన్‌లో 100 మీ. తరహా ఫొటో ఫినిష్ పోరు అనిపించింది. 42.195 కిలోమీటర్ల రేస్‌లో అల్ఫాన్సో ఫెలిక్స్ శింబు (టాంజానియా) 0.05 సెకన్ల తేడాతో స్వర్ణం ఎగరేసుకుపోయాడు. పెట్రోస్ (జర్మనీ-2 గంటల 09:48 సె) రజతం, అవాని (ఇటలీ-2:09:53) కాంస్యం దక్కించుకొన్నారు.

శ్రీశంకర్, తేజస్, పారుల్ విఫలం: భారత అథ్లెట్లు తీవ్రంగా నిరాశపర్చారు. లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ ఫైనల్స్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. 3000 మీ. స్టీపుల్ ఛేజ్‌లో పారుల్ చౌదరి, అంకిత హీట్స్‌లోనే వెనుదిరగ్గా..110మీ. హర్డిల్స్‌లో తేజస్ షిర్సే సెమీస్‌కు క్వాలిఫై కాలేకపోయాడు.

తెలుగు టైటాన్స్ ఓటమి

జైపూర్: ప్రొ.కబడ్డీ లీగ్‌లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ ఓటమి పాలైంది. ఉత్కంఠభరితంగా సాగిన పోరులో బెంగళూరు బుల్స్ 34-32తో తెలుగు టైటాన్స్‌పై నెగ్గింది. బెంగళూరుకు ఇది వరుసగా నాలుగో విజయం కావడం విశేషం. మరోవైపు తెలుగు టైటాన్స్‌కిది వరుసగా రెండో పరాజయం. అంతకుముందు హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో హరియాణ స్టీలర్స్ 40-37తో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గింది.



కరచాలన వివాదం!

ఐసీసీకి పాక్ బోర్డు ఫిర్యాదు

రెఫరీ పైక్రాఫ్ట్‌ను తప్పించాలి
లేదంటే ఆసియా కప్ బహిష్కరణ?


ఆండీ పైక్రాఫ్ట్

దుబాయ్: ఆసియా కప్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై విజయానంతరం ఆ జట్టు ఆటగాళ్లతో భారత క్రికెటర్లు కరచాలనం చేయకపోవడం పెద్ద వివాదానికి దారితీసింది. ఈ ఉదంతంపై ఆగ్రహం ప్రకటించిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మ్యాచ్ రెఫరీ ఆండీ పైక్రాఫ్ట్ (జింబాబ్వే)ను ఆ బాధ్యతలనుంచి తప్పించాలని డిమాండ్ చేసింది. లేదంటే ఆసియా కప్‌ను బహిష్కరించాలని పీసీబీ యోచిస్తున్నదనే వార్తలు కూడా వినవస్తున్నాయి. కాగా..టీమిండియా క్రికెటర్లు తమ జట్టుతో కరచాలనం చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన పీసీబీ ఈ విషయంపై ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ)తోపాటు ఐసీసీకి కూడా ఫిర్యాదు చేసింది. అయితే..పీసీబీ చీఫ్ మొహిసిన్ నక్వీయే ఏసీసీ ఛైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నాడు. అలాగే ఐసీసీకి భారత్‌కు చెందిన జైషా చీఫ్‌గా వ్యవహరిస్తుండడం గమనార్హం. 'క్రికెట్ స్ఫూర్తికి సంబంధించి ఎంసీసీ నియమావళిని మ్యాచ్ రెఫరీ ఉల్లంఘించాడు. అందువల్ల అతడిపై చర్యలు తీసుకోవాలి' పీసీబీ చీఫ్ నక్వీ ఎక్స్‌లో కోరాడు. అయితే ఆసియా కప్‌తో ఐసీసీకి సంబంధంలేదు. ఇది ఏసీసీ నిర్వహించే టోర్నీ. అలాంటప్పుడు ఐసీసీకి పీసీబీ ఫిర్యాదు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కాగా టీమిండియా చర్యకు బదులుగా..మ్యాచ్ అనంతరం జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ ఆఘా బహిష్కరించాడు.

పైక్రాఫ్టే సూచించాడు..: భారత కెప్టెన్‌తో కరచాలనం చేయొద్దని టాస్ సమయంలో పాకిస్థాన్ సారథి సల్మాన్ ఆఘాకు పైక్రాఫ్ట్ సూచించినట్టు పీసీబీ ఆరోపించింది.

పైక్రాఫ్ట్ ఆదేశం మేరకే ఆటగాళ్ల జాబితాను ఇరుజట్ల కెప్టెన్లు పరస్పరం మార్చుకోలేదని పాక్ మేనేజర్ నవేద్ చీమా ఆరోపించాడు. ఈమేరకు అతడు ఏసీసీకి ఫిర్యాదు చేశాడు. అలాగే మ్యాచ్ తర్వాత తమ క్రికెటర్లతో భారత ఆటగాళ్లు కరచాలనం చేయకపోవడం క్రీడా స్ఫూర్తికి విరుద్ధమంటూ మరో ఫిర్యాదునూ ఏసీసీకి పాకిస్థాన్ మేనేజర్ చేశాడు.



నక్వీతో నో..?

పాకిస్థాన్‌కు చెందిన మొహిసిన్ నక్వీ ఈనెల 28న జరిగే ఫైనల్ అనంతరం బహుమతి ప్రదాన వేదికమీద ఉంటారు. ఒకవేళ టీమిండియా ఫైనల్‌కు చేరితే మొహిసిన్ నక్వీతో కలసి మన ఆటగాళ్లు వేదికను పంచుకోవాల్సివుంటుంది. మన టీమ్ గెలిస్తే ఏసీసీ ఛైర్మన్‌గా విజేత జట్టుకు నక్వీయే ట్రోఫీ ప్రదానం చేయాల్సివుంది. అదే జరిగితే భారత్ నక్వీతో కలిసి వేదికను పంచుకోబోదని అంటున్నారు. మరి ప్రత్యామ్నాయంగా గంభీర్ జట్టు ఏం చేస్తుందో వేచి చూడాల్సిందే.

సరైన సమాధానమిచ్చాం : సూర్యకుమార్

'ప్రత్యర్థి జట్టుతో కరచాలనం చేయకూడదని ముందుగానే నిర్ణయం తీసుకున్నాం. మేం వారికి సరైన సమాధానమే ఇచ్చాం' అని మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా సమావేశంలో అడిగిన ప్రశ్నకు టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ బదులిచ్చాడు.

'చైనా మాస్టర్స్'పై లక్ష్య, సాత్విక్ గురి

షెన్‌జెన్: చైనా మాస్టర్స్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టైటిల్‌పై భారత షట్లర్లు లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్ జోడీ గురి పెట్టారు. మంగళవారం షెన్‌జెన్ వేదికగా ఈ పోటీలు ప్రారంభమవనున్నాయి. ఇటీవల ముగిసిన హాంకాంగ్ ఓపెన్‌లో సేన్ ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచాడు. ఫామ్ కోల్పోయిన తర్వాత గత రెండేళ్లలో ఒక ప్రధాన టోర్నీలో సేన్ ఫైనల్ చేరడం అదే తొలిసారి. డబుల్స్‌లో ఈ సీజన్‌లో ఆరు టోర్నీల్లో సెమీస్, హాంకాంగ్ ఓపెన్‌లో ఫైనల్ చేరిన సాత్విక్ జోడీ సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతోంది. మహిళల సింగిల్స్‌లో 30 ఏళ్ల పీవీ సింధు, డబుల్స్‌లో రుతపర్ణ, శ్వేతపర్ణ, మిక్స్‌డ్‌లో రోహన్-రుత్విక శివానీ, ధ్రువ్-తనీషా జోడీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు.

విజేత సెంట్రల్ జోన్

ఫైనల్లో సౌత్‌పై గెలుపు • దులీప్ ట్రోఫీ

బెంగళూరు: పదకొండేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సెంట్రల్ జోన్ జట్టు దులీప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఫైనల్లో సోమవారం ఆఖరి రోజు సెంట్రల్ ముందు సౌత్ జోన్ కేవలం 65 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే ఉంచగలిగింది. ఈ ఛేదనను సెంట్రల్ 20.3 ఓవర్లలో ముగించింది. అయితే సౌత్ బౌలర్ల ధాటికి నాలుగు వికెట్లు కోల్పోవడం గమనార్హం. అంతకుముందు సౌత్ రెండో ఇన్నింగ్స్‌లో 426 పరుగులకు ఆలౌటైంది. అంకిత్ శర్మ (99), సిద్ధార్థ్ (84), స్మరణ్ (67) అర్ధసెంచరీలు సాధించారు. కార్తికేయకు 4, సారాంశ్‌కు 3 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో సౌత్ 149, సెంట్రల్ 511 పరుగులు చేశాయి.

టెకీలకు హైదరాబాద్‌లో భలే గిరాకీ



బెంగళూరు కంటే ఎక్కువ జీతాలు

హైదరాబాద్: టెక్నాలజీ ఉద్యోగాల ముఖచిత్రం మారిపోతోంది. గతంలో టెక్నాలజీ జాబ్స్ అంటే బెంగళూరు. ఇప్పుడు ఈ విషయంలో హైదరాబాద్.. భారత సిలికాన్ వ్యాలీగా పిలిచే బెంగళూరును మించిపోయింది. నిన్న మొన్నటి వరకు బ్యాక్ ఎండ్ ఉద్యోగాలకే పరిమితమైన హైదరాబాద్ తాజాగా ఫ్రంట్‌లైన్ టెక్నాలజీ ఉద్యోగాలకూ కేంద్రంగా మారుతోంది. డేటా ఇంజనీరింగ్, కృత్రిమ మేధ (ఏఐ), ఆర్ అండ్ డీ రంగాల్లో ఈ ఉద్యోగ నియామకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ రంగాలకు చెందిన సీనియర్లకు కంపెనీలు జీతాలు కూడా బాగానే ఆఫర్ చేస్తున్నాయి. ప్రస్తుతం సీనియర్ సాఫ్ట్‌వేర్ డెవలర్లకు హైదరాబాద్‌లో సగటున రూ.30.4 లక్షల వరకు కంపెనీలు ఆఫర్ చేస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది 8.6 శాతం ఎక్కువని కంపెనీలకు నియామకాల సేవలు అందించే టీమ్‌లీజ్ తెలిపింది. ఇదే సమయంలో బెంగళూరులో జీతాల వృద్ధి రేటు 5.6 శాతం మాత్రమే. డేటా ఇంజనీరింగ్, ఆర్ అండ్ రంగాల్లో పనిచేసే టెకీల సగటు జీతాలూ హైదరాబాద్‌లో గత ఏడాది కాలంలో 11.1 శాతం పెరిగి రూ.20 లక్షలకు చేరాయి. బెంగళూరుతో పోలిస్తే ఇది 4.6 శాతం ఎక్కువ.

కలిసి వస్తున్న అంశాలు

- బెంగళూరుతో పాటు హైదరాబాద్ వైపు చూస్తున్న టెక్ కంపెనీలు
- బెంగళూరుతో సమానంగా అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాలు
- ప్రభుత్వ సానుకూల విధానాలు
- టాప్ టాలెంట్‌ను ప్రధాన నగరాలన్నిటిలోనూ మోహరించాలనే కంపెనీల విధానం
- ఏటా మూడు లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల అందుబాటు
- దేశ డిజిటల్ టెక్ నైపుణ్యాల్లో 14 శాతం హైదరాబాద్‌లో లభించడం
- హైదరాబాద్‌లో పెరుగుతున్న జీసీసీలు

4 నెలల గరిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

ఆహార, తయారీ వస్తువుల ధరల పెరుగుదలతో ఆగస్టు నెలలో టోకు ద్రవ్యోల్బణం నాలుగు నెలల గరిష్ఠ స్థాయి 0.52 శాతానికి చేరింది. అయితే ఇంధనం, విద్యుత్ విభాగంలో మాత్రం ద్రవ్యోల్బణం తగ్గింది. టోకు ద్రవ్యోల్బణం గత రెండు నెలల తిరోగమన స్థితి నుంచి బయటపడి ఎగువకు కదిలింది. టోకు ద్రవ్యోల్బణం జూలైలో (-) 0.58% ఉండగా జూన్ నెలలో (-) 0.19% ఉంది.

వచ్చే ఏడాది ఐపీఓకి మెడికవర్ హాస్పిటల్స్

• 2025-26లో రూ.2,000 కోట్ల టర్నోవర్ లక్ష్యం
• డిసెంబరు నాటికి కోకాపేట్ హాస్పిటల్ రెడీ
• నేడు సికింద్రాబాద్ హాస్పిటల్ ప్రారంభం
• మెడికవర్ సీఎండీ అనిల్ కృష్ణ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న మెడికవర్ హాస్పిటల్స్ వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. కార్యకలాపాల విస్తరణతో పాటు రుణ భారాన్ని తగ్గించుకునేందుకు ఐపీఓకి రావాలని భావిస్తున్నట్లు మెడికవర్ హాస్పిటల్స్ సీఎండీ అనిల్ కృష్ణ వెల్లడించారు. ఐపీఓలో భాగంగా పూర్తిగా కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ విలువను 100 కోట్ల డాలర్లు (రూ.8,800 కోట్లు) లెక్కగట్టే అవకాశం ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో హాస్పిటల్ టర్నోవర్ రూ.1,850 కోట్లుగా ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో దీన్ని రూ.2,000 కోట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అనిల్ తెలిపారు. కాగా మెడికవర్ రుణ భారం రూ.1,000 కోట్ల వరకు ఉందని ఆయన చెప్పారు. ప్రస్తుతం మెడికవర్.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకల్లో కార్యకలాపాలు సాగిస్తోంది.

రూ.250 కోట్లతో విస్తరణ

విస్తరణలో భాగంగా ఈ ఏడాది సికింద్రాబాద్, కోకాపేట్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో కొత్తగా రెండు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అనిల్ కృష్ణ వెల్లడించారు. ఇందులో రూ.100 కోట్ల పెట్టుబడితో 300 పడకల సామర్థ్యంతో సికింద్రాబాద్ హాస్పిటల్‌ను, రూ.150 కోట్లతో 500 పడకలతో కోకాపేట్ హాస్పిటల్‌ను నెలకొల్పుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కోకాపేట్ హాస్పిటల్ డిసెంబరు నాటికి అందుబాటులోకి రానుండగా సికింద్రాబాద్ హాస్పిటల్‌ను ఈ నెల 16న (మంగళవారం) ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే చందానగర్ హాస్పిటల్ సామర్థ్యాన్ని 150కి పడకలను పెంచనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కొత్త హాస్పిటల్స్‌తో మొత్తం పడకల సంఖ్య 6,400కు చేరుకోనుండగా దేశవ్యాప్తంగా ఆస్పత్రుల సంఖ్య 25కు చేరుకుంటుందన్నారు. కాగా రానున్న రోజుల్లో మెట్రో నగరాలైన బెంగళూరు, పుణెల్లో కొత్త హాస్పిటల్స్ ఏర్పాటుతో పాటు ద్వితీయ శ్రేణి నగరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు అనిల్ తెలిపారు.

బిజినెస్

'క్యాష్‌లెస్' సేవలు పునరుద్ధరించాలి

• స్టార్ హెల్త్‌కు ఏహెచ్‌పీఐ వినతి

న్యూఢిల్లీ: స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు.. సంస్థ నెట్‌వర్క్ హాస్పిటల్స్ మధ్య వివాదం మరింత ముదిరింది. తన నెట్‌వర్క్‌లోని కొన్ని హాస్పిటల్స్‌లో నగదు రహిత (క్యాష్‌లెస్) వైద్య సేవలను స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ నిలిపి వేయడంపై అసోసియేషన్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ ఆఫ్ ఇండియా (ఏహెచ్‌పీఐ) తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. వెంటనే ఈ సేవలను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. స్టార్ హెల్త్ నిర్ణయంతో రోగులు నగదు రహిత సేవలు అందక మానసిక, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపింది. ఈ ప్రభావం వైజాగ్‌లోని రాంనగర్‌లో ఉన్న కేర్ హాస్పిటల్‌పైనా పడింది. క్లెయిమ్స్‌కు సంబంధించిన వివాదాలతో స్టార్ హెల్త్‌కేర్ ఇన్సూరెన్స్ రెండు రోజుల క్రితం ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. అయితే ఈ వార్తలపై స్టార్ హెల్త్ అధికారికంగా నోరు మెదపడం లేదు.

రిలయన్స్ రూ.21,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ మరోసారి పెద్దమొత్తంలో నిధులు సమీకరించింది. మూడు ట్రస్టుల ద్వారా 240 కోట్ల డాలర్లు (సుమారు రూ.21,000 కోట్లు) సమీకరించింది. ఇందులో నాలుగింట మూడు వంతుల నిధులను ఆదిత్య బిర్లా సన్ లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, నిప్పాన్ లైఫ్ ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ కంపెనీలు సమకూర్చాయి. రిలయన్స్ గ్రూప్ నిర్వహణలోని మూడు ట్రస్టులు పాస్ త్రూ సర్టిఫికెట్ల జారీ ద్వారా ఈ నిధులు సమీకరించాయి.

ఆగస్టు ఎగుమతుల్లో 6.7% వృద్ధి

న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం ఆగస్టులో పుంజుకుంది. వార్షిక ప్రాతిపదికన ఎగుమతులు 6.7% వృద్ధితో 3,510 కోట్ల డాలర్లకు (రూ.3.09 లక్షల కోట్లు) చేరగా దిగుమతులు 10.12% క్షీణించి 6,159 కోట్ల డాలర్లకు (రూ.5.42 లక్షల కోట్లు) తగ్గాయి. ఆగస్టు నెలలో బంగారం దిగుమతులు 56% క్షీణించి స్థూలంగా దిగుమతులు తగ్గేందుకు కారణమయ్యాయి. వాణిజ్య లోటు గత ఆగస్టుతో పోల్చితే 3,564 కోట్ల డాలర్ల (రూ.3.14 లక్షల కోట్లు) నుంచి 26.49 కోట్ల డాలర్లకు (రూ.2.33 లక్షల కోట్లు) తగ్గింది. అమెరికా 686 కోట్ల డాలర్లతో ఎగుమతుల ప్రధాన గమ్యంగా ఉండగా 324 కోట్ల డాలర్లతో యూఏఈ, 183 కోట్ల డాలర్లతో నెదర్లాండ్స్, 121 కోట్ల డాలర్లతో చైనా, 114 కోట్ల డాలర్లతో యూకే తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అమెరికా విధించిన సుంకాల ప్రభావంతో భారత-అమెరికా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. భారత్ దిగుమతి చేసుకున్న దేశాల్లో 1,091 కోట్ల డాలర్లతో చైనా అగ్రస్థానంలో నిలవగా 483 కోట్ల డాలర్లతో రష్యా, 466 కోట్ల డాలర్లతో యూఏఈ, 360 కోట్ల డాలర్లతో అమెరికా, 250 కోట్ల డాలర్లతో సౌదీ అరేబియా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.



17-18 తేదీల్లో విజయవాడలో

హై లైఫ్ ఎగ్జిబిషన్

హై లైఫ్ ఎగ్జిబిషన్.. ఈ నెల 17-18 తేదీల్లో విజయవాడలోని నోవాటెల్ విజయవాడ వరుణ్‌లో అతిపెద్ద లైఫ్‌స్టైల్ ఉత్పత్తుల ప్రదర్శనను నిర్వహించనున్నట్లు ప్రకటించింది. రెండు రోజుల పాటు సాగే ఈ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక డిజైనర్ వేర్, ఫైన్ జువెలరీ, పండగ ఫ్యాషన్స్‌తో పాటు మరెన్నో ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని హై లైఫ్ వెల్లడించింది.

మార్కెట్ ర్యాలీకి బ్రేక్

ముంబై: ఈక్విటీ మార్కెట్లో గత వారం ఏర్పడిన ర్యాలీకి బ్రేక్ పడింది. ఐటీ, ఆటో షేర్లలో లాభాల స్వీకారం సోమవారం మార్కెట్‌ను నష్టాల్లోకి నడిపింది. ఐదు రోజుల ర్యాలీకి తెర దించిన సెన్సెక్స్ 118.96 పాయింట్ల నష్టంతో 81,785.74 వద్ద ముగియగా ఎనిమిది రోజుల ర్యాలీకి తెర దించిన నిఫ్టీ 44.80 పాయింట్ల నష్టంతో 25,069.20 వద్ద ముగిసింది. ఈ వారంలో జరగనున్న అమెరికన్ ఫెడరల్ సమావేశం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తమై లాభాల స్వీకారానికి దిగారని విశ్లేషకులంటున్నారు.

కెనరా రొబెకో, కెనరా హెచ్ఎస్‌బీసీ ఐపీఓలకు ఓకే: తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) జారీకి కెనరా రొబెకో ఏఎంసీ, కెనరా హెచ్ఎస్‌బీసీ, హీరో మోటార్స్ సహా ఆరు కంపెనీలకు సెబీ ఆమోదం తెలిపింది. అనుమతి పొందిన మిగతా కంపెనీల్లో ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్, ఫైన్ ల్యాబ్స్, మణిపాల్ పేమెంట్స్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్, ఎంటీఆర్ ఫుడ్స్ ఉన్నాయి. ఈ కంపెనీలన్నీ రూ.9,000 కోట్లు సమీకరించనున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	విజయవాడ	140
వరంగల్	118	గుంటూరు	135
కరీంనగర్	118	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	127
కర్నూలు	118	నెల్లూరు	132
విశాఖపట్నం	134	అనంతపురం	132
గోదావరి	140		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,060 ▼	1,01,800 ▼	1,43,000 ▲
విజయవాడ	1,13,300 ▼	1,07,500 ▲	1,32,800 ▲
విశాఖపట్నం	1,12,850 ▲	1,01,800 ▲	1,43,000 ▲
రాజమండ్రి	1,11,050 ▼	1,01,800 ▼	1,32,000 ▲
ప్రొద్దుటూరు	1,13,550 ▲	1,04,280 ▲	1,32,500 ▲
ముంబై	1,09,511 ▼	1,00,312 ▼	1,27,791 ▼

నవ కల్పనలకు 'నియంత్రణ'లు వద్దు

» బాధ్యతాయుత ఏఐ వినియోగానికి ఓకే
» ఏఐతో కొన్ని ఉద్యోగాలు పోతాయి
» ఏఐ నైపుణ్యాలతో కొత్త ఉద్యోగాలు
» ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: నియంత్రణలు కృత్రిమ మేధ (ఏఐ)తో సహా టెక్నాలజీ రంగంలో అందరికీ ఉపయోగపడే నవ కల్పనలను ప్రోత్సహించేవిగా ఉండాలే తప్ప.. దెబ్బతీసేవిగా ఉండకూడదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఏఐ ఆధారిత టెక్నాలజీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అదే సమయంలో వివిధ రంగాల్లో ఏఐని బాధ్యతాయుతంగా వినియోగించేలా చూసేందుకూ కృషి చేస్తామన్నారు. 'వికసిత భారత్ కోసం ఏఐ' పేరుతో నీతి ఆయోగ్ రూపొందించిన ఒక నివేదికను విడుదల చేస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐ ద్వారా ఉత్పాదకతను పెంచుకోవడంపై కంపెనీలు దృష్టి పెట్టాలని కోరారు. ఉద్యోగులకూ ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. లేకపోతే పెద్దఎత్తున ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఏఐతో 60,000 కోట్ల డాలర్లు: పరిశ్రమల్లో ఏఐ వినియోగాన్ని వేగవంతం చేస్తే 2035 నాటికి మన జీడీపీ 6.6 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని నీతి ఆయోగ్ అంచనా. అందులో ఏఐ ద్వారా సమకూరే మొత్తమే 50,000 కోట్ల డాలర్ల నుంచి 60,000 కోట్ల డాలర్ల (ప్రస్తుత మారకం రేటు ప్రకారం సుమారు రూ.44.10 లక్షల కోట్ల నుంచి రూ.52.92 లక్షల కోట్లు) వరకు ఉంటుందని తెలిపింది. ఏఐతో కార్మికుల ఉత్పత్తి సామర్థ్యం కూడా పెరుగుతుందని పేర్కొంది. అంతర్జాతీయంగా చూసినా ఏఐ వినియోగంతో వచ్చే పదేళ్లలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 17 నుంచి 26 లక్షల కోట్ల డాలర్ల మేర పెరగనుందని తెలిపింది. ఇందులో 10 నుంచి 15 శాతం మన దేశం ద్వారా సమకూరే అవకాశం ఉందని అంచనా వేసింది. పెద్ద సంఖ్యలో ఉన్న సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్ గ్రాడ్యుయేట్లు, విస్తరిస్తున్న పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు, పెరుగుతున్న డిజిటల్, టెక్నాలజీ సామర్థ్యాలు ఈ విషయంలో మన దేశానికి పెద్ద సానుకూల అంశాలని నివేదిక పేర్కొంది. ఏఐతో క్లరికల్, రోజువారీ ఉద్యోగాలు, పెద్దగా నైపుణ్యాలు అవసరం లేని ఉద్యోగాలు పోయినా, కొన్ని కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని నీతి ఆయోగ్ అంచనా. ఏఐ వినియోగంతో ఆర్థిక సేవలు, తయారీ రంగం బాగా లబ్ధి పొందబోతున్నట్టు తెలిపింది.

పింఛన్‌కు 'సర్వీస్ బ్రేక్' అడ్డు కాదు

- ఏపీ 'విభజన' ఉద్యోగులకు సుప్రీంలో స్వల్ప ఊరట
- పనిచేయని కాలానికి జీతం చెల్లింపునకు మాత్రం నిరాకరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజనలో భాగంగా తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఉద్యోగంలో చేరడంలో జరిగిన సర్వీస్ బ్రేక్ అనేది పింఛన్ ప్రయోజనాలకు అడ్డంకి కాదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. అయితే, పనిచేయని కాలానికి జీతం ఇవ్వాలనే విజ్ఞప్తిని తోసిపుచ్చింది. 'నో వర్క్-నో పే' సూత్రం వర్తిస్తుందని తెలిపింది. పిటిషన్‌ను కొట్టివేసింది. 2014లో రాష్ట్ర విభజన సమయంలో కొందరు ఉద్యోగులను తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. తెలంగాణలో పదవీ విరమణ వయసు 58 ఏళ్లకు కుదించగా, ఏపీలో 60 ఏళ్లు అమలులో ఉంది. కొందరిని ఏపీలో మళ్లీ విధుల్లోకి తీసుకునే క్రమంలో కొంత పాలనాపర జాప్యం జరిగింది. తెలంగాణ నుంచి రిలీవై ఏపీలో ఉద్యోగంలో చేరిన సమయానికి మధ్య కొన్ని నెలల అంతరం ఏర్పడింది. ఈ ఖాళీ కాలాన్ని సర్వీసుగా పరగణించి, పూర్తికాల వేతనం చెల్లించాలని కోరుతూ ఈశ్వరయ్య, మరికొందరు ఫిబ్రవరి 17న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి ధర్మాసనం సోమవారం ఆ పిటిషన్‌ను విచారించింది. ఇరుపక్షాల వాదనల అనంతరం.. ఉద్యోగుల పింఛన్ లెక్కింపు కోసం సర్వీస్ కొనసాగినట్టు పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనివల్ల 60 ఏళ్ల సర్వీస్‌కు పూర్తి పింఛన్ ప్రయోజనాలు పొందుతారని తెలిపింది. ఆ ప్రయోజనం పొందాలంటే.. ఖాళీ సమయంలో తాము పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు నిరూపించే ఏదైనా పత్రం ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఐపీఎస్ అధికారి సంజయ్ బెయిల్‌పై 18న తీర్పు

విజయవాడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్ బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు ఈ నెల 18న తీర్పు వెలువరించనుంది. సంజయ్ అగ్నిమాపకశాఖ డీజీగా ఉన్నప్పుడు.. యాప్ అభివృద్ధి పేరుతో, సీఐడీలో ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన పేరుతోనూ.. కోట్లాది రూపాయల నిధులను దుర్వినియోగం చేశారన్న అభియోగాలపై ఏసీబీ కేసు నమోదు చేసి, అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. సంజయ్ పిటిషన్‌పై వాదప్రతివాదనలు పూర్తయ్యాయి. దీంతో తీర్పును 18వ తేదీన వెలువరిస్తామని న్యాయాధికారి పి.భాస్కరరావు తెలిపారు.

మరో 41,170 టన్నుల యూరియా రాక: అచ్చెన్న

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మరో 41,170 టన్నుల యూరియాను కేంద్రం కేటాయించిందని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 16-18 తేదీల్లో వివిధ పోర్టుల ద్వారా రాష్ట్రానికి చేరుతుందని పేర్కొన్నారు. కాకినాడ పోర్టు నుంచి 18,765, కృష్ణపట్నం పోర్టు నుంచి 11,605, జైగడ్ పోర్టు నుంచి 8,100, మంగుళూరు పోర్టు నుంచి 2,700 టన్నులు వస్తుందని వివరించారు. యూరియా సరఫరాపై వైసీపీ అబద్ధాలు ప్రచారం చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఎరువుల కొరత లేకుండా తగిన చర్యలు చేపడుతున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

యూరియాకు ప్రత్యామ్నాయం అవసరం

- రబీ పంటల జాతీయ సదస్సులో అగ్రి డైరెక్టర్ డిల్లీరావు

వాతావరణ మార్పులకు అనుగుణంగా చేసే పరిశోధనల్లో.. సమతుల ఎరువుల వినియోగం, నేల ఆరోగ్యం, భూసారం పెరుగుదలపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు ఐసీఏఆర్ శాస్త్రవేత్తలను కోరారు. సోమవారం ఢిల్లీలో జరిగిన రబీ పంటల కార్యక్రమం-2025 జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు తక్కువ ధరకు లభ్యమయ్యే యూరియాను అధికంగా వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందని చెప్పారు. శాస్త్రీయ విధానాలతో కూడిన ప్రత్యామ్నాయం అవసరమన్నారు. దీనిపై దృష్టి సారిస్తామని కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి దేవేష్ చతుర్వేది చెప్పారు.

ఉధృతంగా గోదావరి


పట్టిసీమ నుంచి రెండు పంపుల ద్వారా విడుదలవుతున్న నీరు

- పట్టిసీమ నుంచి పోలవరం కుడికాలువకు నీటి విడుదల
- నేడు రాయలసీమలో భారీ వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం సోమవారం అనూహ్యంగా పెరిగింది. ఉపనదులు శబరి, సీలేరు, మంజీర, ప్రవర, ఇంద్రావతి నుంచి భారీగా వచ్చిన వరద కలుస్తుండటంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పోలవరం ప్రాజెక్టు నుంచి 6,60,977 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. పోలవరం స్పిల్‌వే ఎగువన 31, దిగువన 22.1, తెలంగాణలోని భద్రాచలం వద్ద 39.50 అడుగులకు నీటిమట్టం పెరిగింది. మరోవైపు పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 708 క్యూసెక్కుల జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేస్తున్నారు. గోదావరి నీటిమట్టం 14 మీటర్లకు పైగా చేరడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు పంపుల ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఈఈ ఏసుబాబు తెలిపారు.

వాతావరణ అనిశ్చితి..: విదర్భ పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. కోస్తాలో అనేక చోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. నెల్లూరులో 37.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వాతావరణ అనిశ్చితితో సోమవారం అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి.మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా చెదురుమదురు వర్షాలు కురుస్తాయని, రాయలసీమలో అక్కడక్కడ భారీవర్షాలు పడతాయని వాతావరణశాఖ తెలిపింది. ఈనెల 20 లేదా 21న వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా వేసింది. మంగళవారం పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు, పలు ఇతర జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

కోర్టులను తేలిగ్గా తీసుకోవద్దు!

- ప్రమాణ పూర్వక అఫిడవిట్ దాఖలు చేయండి
- విఫలమైతే మాముందు హాజరుకండి
- కేంద్ర మానవవనరుల కార్యదర్శి, పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శికి హైకోర్టు ఆదేశం
- సర్వశిక్షా పథకం బోధనా సిబ్బంది వ్యవహారం

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సర్వశిక్షా అభియాన్ పథకం కింద నడిచే విద్యాసంస్థల్లో శాశ్వత ప్రాతిపదికన బోధనా సిబ్బందిని నియమించే వ్యవహారంపై తమ వైఖరి తెలియజేస్తూ కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ కార్యదర్శి, పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి అఫిడవిట్ దాఖలు చేయకపోవడాన్ని హైకోర్టు ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. కోర్టులను తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించింది. తదుపరి విచారణ తేదీ నాటికి ప్రమాణ పూర్వక అఫిడవిట్ దాఖలు చేయాలని ఇరువురు అధికారులకూ స్పష్టం చేసింది. విఫలమైతే వివరణ ఇచ్చేందుకు నేరుగా తమ ముందు హాజరుకావాలని తేల్చిచెప్పింది. అప్పీల్‌పై తదుపరి విచారణను సెప్టెంబరు 22కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ బట్టుదేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మ ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో పార్ట్‌టైం పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీలు)గా పనిచేస్తున్న తమను అర్ధంతరంగా తొలగించడాన్ని సవాల్ చేస్తూ 2023లో కొందరు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు.. పిటిషనర్లను ఉద్యోగాల్లో నుంచి తొలగించడాన్ని తప్పుబట్టారు. వారిని కొనసాగించాలని స్పష్టం చేశారు. ఒప్పందం ముగిసిన అనంతరం కూడా పిటిషనర్లను పీజీటీలుగా కొనసాగించే విషయాన్ని పరిశీలించాలని ఆదేశిస్తూ 2023 డిసెంబరు 5న తీర్పు ఇచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ అధికారులు 2024 జనవరిలో ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. ఇటీవల విచారణకు రాగా.. శాశ్వత ప్రాతిపదికన బోధనా సిబ్బందిని నియమించకుండా విద్యాసంస్థల్లో చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం ఎలా సాధ్యమని ధర్మాసనం ప్రశ్నించింది. శాశ్వత ప్రాతిపదికన బోధన సిబ్బందిని నియమించే వ్యవహారంపై వైఖరిని తెలియజేస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ కార్యదర్శి, పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. ఈ అప్పీళ్లు సోమవారం విచారణకు రాగా కేంద్రం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, రాష్ట్ర విద్యాశాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది జి.రామచంద్రరావు స్పందిస్తూ.. అఫిడవిట్ల దాఖలుకు మరికొంత సమయమివ్వాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల కారణంగా తీరిక లేకుండా ఉండడంతో అఫిడవిట్ దాఖలు చేయలేకపోయామని ఏఎస్‌జీ అన్నారు. ఈ వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. తాము ఖాళీగా ఉండడం లేదని, బిజీగానే ఉంటున్నామని వ్యాఖ్యానించింది. కోర్టు ఆదేశాలను తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించింది.



ఉద్యోగం ఇస్తామని.. ఇవ్వకపోతే ఎలా?

- భూమి తీసుకునేప్పుడు చూపించే ఉత్సాహం హామీలు నెరవేర్చేందుకు ఎందుకు ఉండట్లేదు?
- విద్యుదుత్పత్తి సంస్థనుద్దేశించి హైకోర్టు వ్యాఖ్యలు

ప్రాజెక్టుల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన కోసం భూములు తీసుకొనేటప్పుడు ఉద్యోగం ఇస్తామని ఇచ్చిన హామీని ఏళ్ల తరబడి అమలు చేయకపోవడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. భూములు తీసుకునేప్పుడు చూపే ఉత్సాహం, ఉద్యోగాలు ఇచ్చేప్పుడు ఎందుకు చూపడం లేదని ప్రశ్నించింది. జీవనాధారమైన భూమిని ఇచ్చిన వారికి ఉద్యోగం ఇవ్వకుంటే వారు ఎలా జీవిస్తారని నిలదీసింది. ఇది రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కును హరించడమేనని వ్యాఖ్యానించింది. రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్(ఆర్‌టీపీపీ)లో భాగంగా రైల్వే లైన్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన కడపజిల్లా, ముద్దనూరు గ్రామానికి చెందిన రామసుబ్బయ్య కుమారుడు రాజశేఖర్‌ను జూనియర్ ప్లాంట్ అటెండెంట్ పోస్టుకు పరిగణనలోకి తీసుకోవాలని 2023లో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఏపీ విద్యుదుత్పత్తి సంస్థ దాఖలు చేసిన అప్పీల్‌పై తీర్పు రిజర్వ్ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. రామసుబ్బయ్య 1992లో ఆర్‌టీపీపీ ఫేజ్-1 రైల్వేట్రాక్ కోసం తనకు చెందిన 60 సెంట్ల భూమిని ఇచ్చారు. ఆ సమయంలో విద్యుత్ ఉత్పత్తి సంస్థ.. భూమి ఇచ్చిన రామసుబ్బయ్యకు ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. ఏళ్లుగడిచినా సదరు హామీ అమలు కాకపోవడంతో 2022లో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. తనకు బదులు కుమారుడు రాజశేఖర్‌కు అయినా ఉద్యోగం ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి.. జూనియర్ ప్లాంట్ అసిస్టెంట్ పోస్టుకు రామసుబ్బయ్య కుమారుడి పేరును పరిగణనలోకి తీసుకోవాలని 2023లో తీర్పు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ అదే ఏడాది ఏపీ విద్యుదుత్పత్తి సంస్థ ఎండీ హైకోర్టులో అప్పీల్ వేశారు. సోమవారం జరిగిన విచారణలో ఎండీ తరఫున అడ్వొకేట్ జనరల్, పిటిషనర్ తరఫున న్యాయవాది జీవీ శివాజీ వాదనలు వినిపించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే..

324 రకాల వైద్య సేవలు

- బీమా ద్వారా మరో 2,550 రకాలు: సత్యకుమార్

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇన్సూరెన్స్ విధానంలో 324 రకాల వైద్య సేవలను ప్రభుత్వాసుపత్రుల ద్వారానే అందించాలని నిర్ణయించినట్లు ఆరోగ్య మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం 169 రకాల సేవలు అందుతున్నాయని, మరో 155 సేవలను అందించనున్నట్లు వివరించారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద లబ్ధిదారులకు ఉచితంగా అందుతున్న వైద్య సేవలు, కొత్త హైబ్రీడ్ విధానంలో అమలు చేయనున్న సేవలను క్రమబద్ధీకరించడంపై అధ్యయనం చేసినట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం చికిత్సలో సారూప్యత, ఒకేరకం ప్యాకేజీ, విలువ కలిగిన పలు వైద్యసేవలను వేర్వేరుగా చూపి సేవల సంఖ్య 3,257కు పెరిగినట్లు ప్రచారం చేసుకుందన్నారు. అలాంటి ఒకే రకమైన 186 సేవలను ఒకే ప్యాకేజీ కిందకు తీసుకువచ్చామని తెలిపారు. ప్రభుత్వాసుపత్రులకు కేటాయించిన 324 సేవలు, అరుదుగా అందిస్తున్న మరో 197 రకాల సేవలు, ఒకే ప్యాకేజీ కిందకు తీసుకువచ్చిన 186 సేవలు మినహా.. మిగిలిన 2,550 సేవలను ఇన్సూరెన్స్ కింద అందించనున్నట్లు వెల్లడించారు. అధిక సంఖ్యలో జరిగే గర్భాశయ, ఎపెండిక్స్ తొలగింపు, ఈఎన్‌టీ సేవలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందిస్తామని వివరించారు. తొలిసారి పేదరిక రేఖకు ఎగువన(ఏపీఎల్) ఉన్న కుటుంబాలకు కూడా ఆరోగ్యబీమా లభిస్తుందన్నారు.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

- మంత్రి ఫరూక్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

వక్ఫ్ చట్టంపై సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పును స్వాగతిస్తున్నామని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన వక్ఫ్ చట్టం సవరణలపై ముస్లిం వర్గాల్లో నెలకొన్న ఆందోళనను దృష్టిలో పెట్టుకుని.. ఈ అంశాన్ని జేపీసీ దృష్టికి వెళ్లేలా సీఎం చంద్రబాబు కృషి చేశారని ఫరూక్ తెలిపారు. అప్పుడు జేపీసీ కొన్ని అసమంజస సవరణలను తొలగించగా, ఇప్పుడు సుప్రీంకోర్టు మిగిలిన వాటిపై స్టే విధించిందన్నారు. సీఎం చంద్రబాబు దూరదృష్టి వల్లే ముస్లిం సమాజానికి న్యాయం దక్కిందని అజీజ్ అన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఎడారిలో పోరాటం



అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఏఏ22 ఏ6' షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతోంది. ఇటీవలె దాదాపు 50 రోజుల పాటూ జరిగిన ముంబై షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలతో పాటూ అల్లు అర్జున్‌పై ఓ సాంగ్‌నూ చిత్రీకరించారు. తదుపరి షెడ్యూల్ అబుదాబిలోని లివా ఒయాసిస్‌లో అక్టోబరు నుంచి ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌లో భారీ పోరాట సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. అల్లు అర్జున్, దీపికా పడుకొనే తదితరులు పాల్గొంటారు. ప్రస్తుతం అబుదాబిలో లొకేషన్ల వేటలో ఉన్నారు అట్లీ. అతి త్వరలోనే ఈ షెడ్యూల్ మొదలయ్యే తేదీని ప్రకటించనున్నారు. సమాంతర ప్రపంచం నేపథ్యంలో సాగే ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌లో అల్లు అర్జున్ నాలుగు పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం.


ఆయనతో సినిమా చేస్తా



అడివి శేష్

మౌళి తనూజ్, శివానీ నాగారం జంటగా సాయి మార్తాండ్ తెరకెక్కించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఆదిత్య హాసన్ నిర్మించారు. ఇటీవలె విడుదలై విజయవంతంగా థియేటర్లలో ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన హీరో అడివి శేష్ మాట్లాడుతూ 'ఈ సినిమా చూశాను బాగుంది. సాయి మార్తాండ్ డైరెక్షన్‌లో మూవీ చేయాలని ఉంది' అని అన్నారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ "లిటిల్ హార్ట్స్' విజయం చిన్న చిత్రాలకు మరోసారి దారి చూపించింది. ఒక చిన్న సినిమా హిట్ అయితే వంద సినిమాలు తీసే ధైర్యాన్ని ఇస్తుంది' అని అన్నారు. సినిమా రిలీజ్ చేసిన బన్నీ వాసు, వంశీ నందిపాటి మాట్లాడుతూ మా సినిమాపై ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమను మర్చిపోలేం' అని అన్నారు.

మాస్ లుక్...



రవితేజ సోదరుడి కుమారుడు మాధవ్ భూపతిరాజు కథానాయకుడిగా తెరంగేట్రం చేస్తున్న చిత్రం 'మారెమ్మ'. మంచాల నాగరాజ్ దర్శకత్వంలో మయూర్‌రెడ్డి బండారు నిర్మిస్తున్నారు. సోమవారం మాధవ్ పుట్టినరోజు సందర్భంగా సినిమా నుంచి ప్రత్యేక పోస్టర్, గ్లింప్స్ విడుదల చేశారు. ఇందులో మాస్ లుక్‌లో కనిపించారు మాధవ్. విజువల్స్, సంగీతం ఆకట్టుకున్నాయి. ఈ చిత్రానికి ఎడిటర్: దేవ్ రాథోడ్, డీఓపీ: ప్రశాంత్ అంకిరెడ్డి, సంగీతం: ప్రశాంత్ ఆర్ విహారి.



హంగ్రీ చీతా

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కించిన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'ఓజీ'. డీవీవీ దానయ్య నిర్మించారు. ఈనెల 25న పాన్ ఇండియా స్థాయిలో చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్ పాటలు సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయి. సోమవారం చిత్రం నుంచి 'గన్స్ అండ్ రోజెస్' పాటను విడుదల చేశారు మేకర్స్. 'అతనొక తూటా.. నెత్తురుకి మరిగిన హంగ్రీ చీతా.. ఎవ్వరికి అందదు అతని రేంజ్' అంటూ శక్తిమంతమైన పదాలు, అద్భుతమైన ఎలివేషన్లతో సాగిన ఈ గీతం ఇప్పుడు నెట్టింట అభిమానులను ఖుషీ చేస్తోంది. తమన్ సంగీతం అందించారు. ఇందులో ఓజాస్ గంభీరగా పవన్‌కల్యాణ్, ఓమీగా ప్రతినాయకుడి పాత్రలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ కనిపించనున్నారు. ప్రియాంక అరుళ్‌మోహన్ కథానాయిక.



తెలంగాణ రాష్ట్రంలో సినిమాల షూటింగ్స్‌కు, థియేటర్ల నిర్మాణానికి పొందాల్సిన అనుమతులు అన్నీ ఇకపై సింగిల్ విండో ద్వారా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఫిల్మ్ ఇన్ తెలంగాణ' పేరుతో ఒక ప్రత్యేక వెబ్ సైట్ రూపొందిస్తున్నట్లు తెలంగాణ ఎఫ్‌డీసీ అధ్యక్షుడు దిల్ రాజు చెప్పారు. ఈ వెబ్ సైట్ రూపకల్పనకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన చిత్ర ప్రముఖులను, వివిధ శాఖల అధికారులను కోరారు. వెబ్ సైట్‌ను పూర్తి స్థాయిలో రూపొందించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంతరెడ్డి, సినమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని దిల్ రాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక, టూరిజం కార్పొరేషన్ ఎండీ క్రాంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓ కొత్త ప్రపంచం సృష్టించా



శివరాజ్‌కుమార్, శిథిల్ శెట్టి, నాగశ్రీ జీఎస్ ప్రధాన పాత్రధారులుగా రవి బస్రూర్ తెరకెక్కించిన చిత్రం 'వీర చంద్రహాస'. సినిమా ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. చిత్ర దర్శకుడు రవి బస్రూర్ మాట్లాడుతూ 'యక్షగానం సంస్కృతిని ప్రతిబింబించేలా చిత్ర కథ ఉంటుంది. నా పన్నెండు సంవత్సరాల కల ఇది. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యేలా సినిమా ఉంటుంది. ఈ చిత్రంతో ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించాను. మన సంస్కృతిని కాపాడుకునేలా ఈ చిత్రం ఉంటుంది' అని చెప్పారు. నిర్మాతలు ఎమ్‌వీ రాధాకృష్ణ, జేమ్స్ డబ్ల్యూ కొమ్ము, ఎన్ ఎస్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ 'ఇటీవల కన్నడలో విడుదలై అఖండ విజయం సాధించిన 'వీర చంద్రహాస'ను తెలుగులో విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

ఓ మధ్యతరగతి అమ్మాయి కథ



జేఎస్ఎస్ వర్ధన్

'ఈ సినిమాలో ఓ మధ్యతరగతి అమ్మాయి జీవితాన్ని చూపించబోతున్నాను. ఇప్పుడు అందరూ తమ జీవితాన్ని పక్కనోళ్ల జీవితంతో పోల్చుకుంటున్నారు. మనం ఎంత చేసినా చిన్న లోటు కనిపిస్తే దాన్ని మన పిల్లలు ఎత్తి చూపుతారు. అదే ఈ చిత్ర కథ' అని అన్నారు దర్శకుడు జేఎస్ఎస్ వర్ధన్. అంకిత్ కొయ్య, నీలఖి జంటగా జేఎస్ఎస్ వర్ధన్ తెరకెక్కించిన చిత్రం 'బ్యూటీ'. సినిమా ఈనెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వర్ధన్ మీడియాతో ముచ్చటించారు.

- ఈ కథ డైరెక్టర్ మారుతి పిలిచి నాకు ఇచ్చారు. దీన్ని సుబ్రహ్మణ్యం అనే జర్నలిస్టు రాశారు. అయనే డైరెక్ట్ చేయాలి. కానీ 'జీ' సంస్థ వాళ్లు నన్ను సూచించారు. మొదటిసారి నేను వేరే వాళ్ల కథకు పనిచేశాను.
- ఈ సినిమాలో హీరో, హీరోయిన్ల మధ్య సన్నివేశాలు బాగా కుదిరాయి. సినిమా ఎక్కడా బోర్ కొట్టదు. హీరోయిన్‌ని చూస్తే పక్కింటి అమ్మాయి అనిపిస్తుంది. ఒక అంకిత్ తప్ప మిగతా నటీనటులందరినీ నేనే ఎంపిక చేసుకున్నాను. అంకిత్ సహజంగా నటించారు.
- ఈ చిత్రంలో లవ్ స్టోరీతోపాటు థ్రిల్లింగ్ పాయింట్ కూడా ఉంటుంది. ఒక జంట ఏమీ లేకుండా బయటకు వచ్చేస్తే వాళ్లు ఎలాంటి కష్టాలు పడతారు అని చూపించాను.

రౌడీ మంచిగా మారితే...



శ్రీరామ్, మిథున ప్రియ జంటగా కిశోర్‌శ్రీకృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'యంగ్ అండ్ డైనమిక్'. శ్రీరామ రాజు, లక్ష్మణరావు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కిశోర్‌శ్రీకృష్ణ మాట్లాడుతూ 'విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే చిత్రమిది. ఒక రౌడీ మంచివాడిగా మారితే ఎలా ఉంటుందో ఇందులో ఆసక్తికరంగా చూపిస్తున్నాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకులు వీరశంకర్, వి సముద్ర, వీఎన్ ఆదిత్య పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలు ఉండకూడదు

రాష్ట్రంలో రహదారుల పనులు ఆగకూడదు

- గ్రామీణ రహదారులకు కనెక్టివిటీ పెంచాలి
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఆదేశం
- డిసెంబరు కల్లా గుంతల రహిత రోడ్లు: కృష్ణబాబు

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో కూడా రోడ్లపై గుంతలు ఉండకూడదని సీఎం చంద్రబాబు అధికారులకు నిర్దేశించారు. ఒక వేళ గుంతలు పడితే.. అదే రోజు పూడ్చాలని ఆదేశించారు. రహదారుల పరిస్థితిపై కలెక్టర్ల సదస్సులో సమీక్ష సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో రహదారుల పనులు ఏవీ ఆగకూడదని ఆర్అండ్‌బీ అధికారులకు స్పష్టం చేశారు. గ్రామీణ రహదారుల నుంచి జాతీయ రహదారులకు, అర్బన్ రోడ్లకు, జిల్లా రోడ్లకు కనెక్టివిటీ పెంచాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను ఆదేశించారు. రాష్ట్రంలోని రహదారుల పరిస్థితిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు.. ఈ ఏడాది డిసెంబరుకల్లా రాష్ట్రంలోని అన్ని రహదారులను గుంతల రహితంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. దీనిపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. 'రాష్ట్రంలో ఇప్పటికే రూ.860 కోట్ల వ్యయంతో 19,000 కిలోమీటర్ల రోడ్లను గుంతల రహితంగా మార్చాం. మరో 5,946 కిలోమీటర్ల రోడ్లను గుంతల రహితంగా మార్చడానికి రూ.500 కోట్లు మంజూరు చేశాం. రాష్ట్రవ్యాప్తంగా 4,223 కి.మీ. మేర రోడ్లు దారుణంగా దెబ్బ తిన్నాయి. వాటిని బాగుచేయడానికి రూ.2వేల కోట్లు అవసరం' అని వివరించారు. వర్షాకాలంలో రోడ్లపై గుంతలు పూడ్చడానికి ఎకోఫిక్స్ విధానం ఉపయోగిస్తున్నామని, దీంతో గుంతలు పూడ్చితే వర్షాలకు కొట్టుకుపోకుండా ఉంటాయన్నారు. జాతీయ రహదారుల నిర్మాణానికి ఎక్కడెక్కడ భూసేకరణ సమస్యలున్నాయో.. వాటిపై దృష్టి సారించాలని కలెక్టర్లకు సూచించారు.

గిరిజన ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ: శశిభూషణ్‌కుమార్

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ.. రోడ్డు కనెక్టివిటీ లేక ఇబ్బందిపడుతున్న గిరిజన ప్రాంతాలకు 'అడవి తల్లి బాట' కార్యక్రమంలో రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా 63.60 లక్షల మందికి పని కల్పించామని, ఈ పథకానికి రూ.6,057.84 కోట్లు వెచ్చించామన్నారు. రాష్ట్రంలో 22,514 పశుసంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

ఏడాదిలోగా నాలుగు పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు పూర్తి: కృష్ణబాబు

రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడ గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను ఏడాదిలోగా పూర్తిచేస్తామని మౌలిక సదుపాయాల కల్పన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు వెల్లడించారు. అలాగే జువ్వలదిన్నె, నిజాపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్లను కూడా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. రామాయపట్నం పోర్టు పనులు 71.90 శాతం పూర్తయ్యాయన్నారు. వచ్చే ఏడాది మే నాటికి మూలపేట పోర్టు, డిసెంబరు నాటికి మచిలీపట్నం పోర్టు, కాకినాడ పోర్టు పనులు పూర్తిచేస్తామని వెల్లడించారు. ఇక ఈనెల 25 నాటికి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ దాదాపు 98 శాతం పూర్తవుతుందన్నారు. నిజాంపట్నం, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్లను ఏడాది మార్చి నాటికి, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్‌ను వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రానికే తలమానికంగా నిలవనున్న భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసే లక్ష్యంతో నిర్మాణ పనులు శరవేగంగా చేపడుతున్నామని కృష్ణబాబు వెల్లడించారు. ఇప్పటికే 86.06 శాతం మేర పనులు పూర్తయ్యాయని చెప్పారు. రాజమండ్రి, కర్నూలు, కడప, తిరుపతి ఎయిర్‌పోర్టులను విస్తరిస్తున్నామని చెప్పారు. కుప్పం, దగదర్తి, పలాస విమానాశ్రయాలను నిర్మించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.



కలెక్టర్ల సదస్సు సందర్భంగా మంత్రులతో కలిసి భోజనం చేస్తున్న సీఎం చంద్రబాబు

విద్యా రుణాలపై 4% వడ్డీ రాయితీ

'పీఎం విద్యాలక్ష్మి'లో కేంద్రం ఇస్తున్న 3 శాతం రాయితీతో అనుసంధానిద్దాం

- త్వరలోనే పథకాన్ని ప్రారంభిస్తాం
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు వెల్లడి
- విద్యార్థులపై మరింత తగ్గనున్న భారం

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యా రుణాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులపై ఆర్థిక భారాన్ని తగ్గించేలా రుణాలపై 4 శాతం వడ్డీ రాయితీ కల్పించే పథకాన్ని త్వరలో ప్రారంభించనుంది. ఈ విషయాన్ని సోమవారం కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ పథకం 'పీఎం విద్యాలక్ష్మి'కి ఈ 4 శాతం వడ్డీ రాయితీని అనుసంధానం చేద్దామని, దానిపై కసరత్తు చేసుకురావాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. త్వరలోనే ఈ పథకాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు. దీంతో విద్యార్థులు ఎంత వరకైనా చదువుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. ఉద్యోగం సాధించిన తర్వాత 14 ఏళ్లలోపు రుణాన్ని తిరిగి చెల్లించవచ్చన్నారు. కాగా, కేంద్రం పీఎం విద్యాలక్ష్మి పేరుతో ఇప్పటికే విద్యా రుణ పథకాన్ని అమలు చేస్తోంది. ఎలాంటి గ్యారెంటీ లేకపోయినా విద్యార్థులకు రూ.7.5 లక్షల వరకు రుణం ఇస్తారు. దానిపై 3 శాతం వరకు వడ్డీ రాయితీ కల్పిస్తోంది. దేశవ్యాప్తంగా నాణ్యమైన విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధించిన విద్యార్థులకు ఇది వర్తిస్తోంది. ఇప్పుడు దీన్ని మన రాష్ట్ర విద్యార్థులకు అనుసంధానం చేయనున్నారు. కేంద్రం 3 శాతం, రాష్ట్రం 4 శాతం వడ్డీ రాయితీ ఇస్తే విద్యార్థిపై అతి తక్కువ వడ్డీ పడుతుంది. దీంతో విద్యార్థులు ఉన్నత విద్య కోర్సుల్లో స్వేచ్ఛగా చేరే అవకాశం ఏర్పడుతుంది.

అపార్ ఐడీలు పూర్తికావాలి

విద్యార్థుల అకడమిక్ రికార్డులకు సంబంధించిన అపార్ ఐడీల నమోదులో అధికారులు విఫలమవుతున్నారని విద్యాశాఖపై సమీక్షలో సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే కలెక్టర్ల సదస్సు నాటికి (సుమారు 45 రోజుల్లో) వంద శాతం నమోదు కావాలని స్పష్టం చేశారు. ఏడాది మొత్తం ఒకే పుస్తకంలో పరీక్షలు రాసే విధానం తెచ్చామని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ వివరించగా... మొత్తం సాఫ్ట్ కాపీలుగా మార్చి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చంద్రబాబు సూచించారు. దానివల్ల విద్యార్థులు, టీచర్ల పనితీరుపై అధ్యయనం సులభమవుతుందన్నారు. సిలబస్‌ను భవిష్యత్తు ఆధారంగా అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. మన విద్యార్థులు జాతీయ విద్యాసంస్థల్లో అత్యధిక సీట్లు సాధించేలా పాఠశాల విద్య ఉండాలన్నారు. అంతకముందు కోన శశిధర్ మాట్లాడుతూ త్వరలో విద్యార్థులకు బోధన అనంతరం రెండు నిమిషాల వీడియో ప్రదర్శిస్తామని తెలిపారు. స్క్రీన్‌పై ప్రశ్నలు చూసి.. చేతిలో క్లిక్కర్ ద్వారా సమాధానాలు చెప్పే విధానం త్వరలో ప్రారంభిస్తామని, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈ విధానం అమలు చేస్తామని పేర్కొన్నారు.

ఇక నివేదికలు అడగరు.. 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన!

కలెక్టర్లను నివేదికలు అడగటంపై సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇకపై కలెక్టర్లు, ఇతర అధికారులను నివేదికలు అడిగే విధానం ఉండదని స్పష్టం చేశారు. అపార్ ఐడీలపై కొన్ని జిల్లాలు వెనుకబడటంపై స్పందించే క్రమంలో 'నివేదికలు, లెక్కలు, సమీక్షలు'పై సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. "పదేపదే నివేదికలు అడుగుతున్నామని ఇటీవల కొందరు రాస్తున్నారు. ఇకపై నివేదికలు అడగటం ఉండదు. మొత్తం రియల్ టైమ్ గవర్నెన్స్ తీసుకొస్తాం. కొందరు కార్యదర్శులకు ప్రతిదానికీ నివేదికలు అడగటం పరిపాటి అయింది. మొత్తం ఆన్‌లైన్‌లో ఉన్నప్పుడు నివేదికల అవసరం ఉండదు" అని పేర్కొన్నారు.

పాఠశాలలకు అనుసంధానంగా అంగన్వాడీలు

పాఠశాలలకు అనుసంధానంగా అంగన్వాడీలు ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి సూచించారు. 6 సంవత్సరాల పైబడిన పిల్లలు కూడా అంగన్వాడీల్లో ఉండిపోతున్నారని, వీరిని బడిలో చేర్చడంపై దృష్టి సారించాలన్నారు. అంగన్వాడీల్లో తండ్రులను కూడా భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. అటల్ వయో అభ్యుదయ యోజన పథకం కింద రాష్ట్రంలో కొత్తగా మరో 13 వృద్ధాశ్రమాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 17 నుంచి రాష్ట్రీయ పోషణ్ మా కార్యక్రమం మొదలవుతోందని, దీన్ని విజయవంతం చేయాలన్నారు. అంగన్వాడీల్లో పిల్లల హాజరు తక్కువపై జిల్లాల కలెక్టర్లు దృష్టి సారించాలని సూచించారు.

దశ దిశ

దుర్భిక్ష నివారణ చర్యలు తీసుకుంటున్నాం

9,221.40 కోట్లతో పలు ప్రాజెక్టులు పూర్తి: సాయిప్రసాద్

రాష్ట్రంలో మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దుర్భిక్ష నివారణకు చర్యలు చేపట్టామని జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ వెల్లడించారు. జల వనరుల ప్రగతిని సీఎం చంద్రబాబుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 'ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. తుంగభద్రతో సహా.. ప్రాజెక్టుల గేట్లను అవసమైనచోట మారుస్తున్నాం. శ్రీశైలం జలాశయం రక్షణ చర్యలను ఏడాదిలోగా పూర్తి చేస్తాం. పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబరు కల్లా పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ మోడర్నైజేషన్ (ఎంకాడా) కింద పైపుల ద్వారా సాగు నీటిని తీసుకువెళ్లే పథకానికి రూపకల్పన చేశాం. ఏడాదిలోగా రాష్ట్రంలో రూ.9,221.40 కోట్లతో పలు ప్రాజెక్టులు పూర్తి చేస్తాం' అని సాయిప్రసాద్ వివరించారు.



ఒక్కొక్కరికి 26 వేల నుంచి 78 వేల లబ్ధి

ఎక్కువ మంది పిల్లలున్నవారికి 'తల్లికి వందనం'

గత జగన్ ప్రభుత్వం కుటుంబంలో ఒక్కరికే అమ్మఒడి కింద రూ.13వేలు ఇచ్చింది. కానీ కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం పథకం అమలు చేసింది. ఫలితంగా లక్షల మంది తల్లులు అదనపు ప్రయోజనం పొందారు. కలెకర్ల సదస్సులో విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ తల్లికి వందనంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో ఆరుగురు, అంతకంటే ఎక్కువ మంది బడికి వెళ్లే పిల్లలున్న తల్లులు 353 మంది ఉన్నారు. వీరందరికీ రూ.78 వేలు చొప్పున నగదు అందింది. ఐదుగురు పిల్లలున్న తల్లులు 2,714 మంది ఉండగా, వారి ఖాతాల్లో రూ.65 వేలు చొప్పున నగదు జమ చేశారు. నలుగురు పిల్లలున్న 27,711 మంది తల్లులకు రూ.52 వేలు చొప్పున తల్లికి వందనం నగదు వచ్చింది. ముగ్గురు పిల్లలున్న 2,97,226 మంది తల్లులకు రూ.39 వేలు చొప్పున నగదు అందింది. ఇక ఇద్దరు పిల్లలున్న 18.27 లక్షల మంది తల్లులకు రూ.26వేలు చొప్పున ఖాతాల్లో జమఅయ్యింది. కాగా తల్లికి వందనం పథకం కింద వివిధ కారణాలతో నగదు పొందలేకపోయిన 2,79,720 మంది విద్యార్థులకు సంబంధించి మూడో విడతలో తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు విద్యా శాఖ కార్యదర్శి వెల్లడించారు.



డ్వాక్రాల పొదుపు రూ.20,739 కోట్లు

సెర్ప్ కార్యదర్శి వీ కరుణ

'రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలు బ్యాంకుల్లో రూ.20,739 కోట్లు పొదుపు చేశాయి. ఈ విషయంలో దేశంలో ఆంధ్ర మొదటి స్థానంలో ఉంది' అని సెర్ప్ కార్యదర్శి వీ కరుణ తెలిపారు. సోమవారం అమరావతి సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో ఆమె సెర్ప్ కార్యకలాపాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. 'డ్వాక్రా సంఘాలు రుణాలు పొందేలా జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలి. వీటిలో రుణాల ఎగవేత కేవలం 0.02% మాత్రమే. రాష్ట్రంలో మొత్తం 8.32 లక్షల డ్వాక్రా సంఘాలున్నాయి. 89 లక్షల మంది మహిళలు వీటిలో సభ్యులుగా ఉన్నారు. డ్వాక్రా సంఘాలపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ పనితీరు ఆదర్శప్రాయం. యువతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. పొదుపు సంఘాల్లోని మహిళలు ఎక్కువగా పాడి పరిశ్రమ పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అడిగిన వారందరూ రుణాలు త్వరితగతిన పొందేలా జిల్లా కలెక్టర్లు చొరవ చూపాలి. 3,000 మంది డ్వాక్రా మహిళలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మారటానికి ఆసక్తి చూపుతున్నారు. వీరితో మొత్తం 875 మిల్లెట్ కేఫ్‌లు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం. పైలెట్ ప్రాజెక్టు 12 జిల్లాల్లో ఏర్పాటు చేసిన 200 యూనిట్లు విజయవంతంగా సాగుతున్నాయి' అని కరుణ చెప్పారు.



కరుణకు సీఎం ప్రశంసలు

సెర్ప్ కార్యదర్శి కరుణను సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. 'కరుణకు ఏ పని అప్పజెప్పినా బాధ్యతతో చేస్తారు. పొదుపు సంఘాలను సమర్థంగా పని చేయించడంలో ఆమె ఎంతో చొరవ చూపించారు. డ్వాక్రా, పొదుపు సంఘాల పనితీరు సంతృప్తికరంగా ఉంది. పొదుపు సొమ్ము, రుణాల, తదితర విషయాలను తెలుసుకోవడానికి కృత్రిమమేథను వినియోగించడం అభినందనీయం' అని సీఎం అన్నారు.

ఏపీ బ్రాండ్‌ను తిరిగి తీసుకొస్తున్నాం: అనగాని

జాతీయ జీఎస్‌డీపీని అధిగమించాం: పయ్యావుల



'ఏపీ బ్రాండ్‌ను తిరిగి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమ ప్రాధాన్యమిచ్చి అన్ని పథకాలనూ విజయవంతం చేస్తున్నాం' అని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. 'ప్రజలకు సంబంధించిన అన్ని సమస్యలను పీజీఆర్ఎస్ విధానంలో సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రెవెన్యూలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. తప్పులులేని పట్టాదార్ పాస్ పుస్తకాలను అందించేందుకు కృషి చేస్తున్నాం. తప్పుడు రిజిస్ట్రేషన్ల నివారణకు అనేక మార్పులు తీసుకొచ్చాం. ల్యాండ్ సీలింగ్ భూములను పటిష్ఠంగా క్రమబద్ధీకరించాం. రెవెన్యూ రికార్డులన్నీ డిజిటలైజేషన్ చేయడం ద్వారా ప్రజలకు మంచి సేవలందిస్తున్నాం. వారసత్వ భూములకు హక్కులు కల్పించేందుకు వీలుగా ఫీజును తగ్గించాం. రైతుల నీటి తీరువా వడ్డీ రూ.85 కోట్లు మాఫీ చేశాం' అని మంత్రి అన్నారు.



ప్రభుత్వ ముఖచిత్రాన్ని ప్రతిబింబించేలా...

ప్రభుత్వ ముఖచిత్రాన్ని క్షేత్రస్థాయిలో ప్రతిబింబించేలా జిల్లా కలెక్టర్లు కృషి చేయాలని ఆర్థిక మంత్రి పయ్యావుల అన్నారు. 'సీఎం ఉన్నత స్థాయి ఆలోచనలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు ఎదగాలి. ప్రజలకు సంతృప్త స్థాయిలో సేవలు అందించాలి. ఏ ప్రభుత్వంలోనూ ప్రణాళిక శాఖలకు అంతగా ప్రాధాన్యమివ్వరు. కానీ ఈ సీఎం ఎంతో ఉన్నతంగా ఈ శాఖను వినియోగించుకోవడం వల్ల జీఎస్‌డీపీ సాధనలో దేశంలోనే ప్రథమ స్థానంలో రాష్ట్రం నిలిచింది. జాతీయ స్థాయి జీఎస్‌డీపీ 8.8% అధిగమించి 10.8%ని సాధించాం' అని పయ్యావుల పేర్కొన్నారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

కొత్త టీచర్లలో సగం మహిళలే!

(మొదటి పేజీ తరువాయి)

విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబు తొలి సంతకం, మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నారా లోకేశ్ తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైలుపైనే పెట్టారని గుర్తుచేశారు. పది మేనేజ్‌మెంట్ల పాఠశాలల్లో 16,347 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశామని తెలిపారు. ఇప్పటి వరకూ వందకు పైగా కేసులు మెగా డీఎస్సీపై వచ్చాయని, వాటిని అధిగమించి పారదర్శకంగా ప్రక్రియ పూర్తిచేశామని చెప్పారు. 3,36,300 మంది అభ్యర్థులు 5,77,675 దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ప్రాథమిక కీలపై 1.4 లక్షల అభ్యంతరాలు వచ్చాయని, వాటిని పరిష్కరించి తుది కీలు విడుదల చేశామని వివరించారు. మిగిలిపోయిన 406 పోస్టులను క్యారీ ఫార్వార్డ్ విధానంలో తర్వాత డీఎస్సీలో భర్తీ చేస్తామన్నారు. అంతేగానీ ఈ డీఎస్సీలో వెయిట్ లిస్ట్, రెండో జాబితాలు ఉండవని అధికారులు స్పష్టంచేశారు. ఈ డీఎస్సీలో తొలిసారి హారిజంటల్ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులు అమలుచేశామని తెలిపారు. ఎంపికైన 15,941 మందిలో 7,955 (49.9శాతం) మంది మహిళలు, 7,986 (50.97శాతం) పురుషులు ఉన్నారని తెలిపారు.

నవంబరులో టెట్.. ఏటా డీఎస్సీ

ఈ నెల 19న ఎంపికైన వారికి సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తారన్నారు. 22 నుంచి 29 వరకు కొత్త టీచర్లకు శిక్షణ, కౌన్సెలింగ్ ఉంటుందని చెప్పారు. హారిజంటల్ రిజర్వేషన్ విధానంపై సందేహాలను నివృత్తి చేసేందుకు డీఈవో కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. ఇకపై ప్రతి ఏటా డీఎస్సీ ప్రకటిస్తామని, రాబోయే నంబరులో టెట్ జరుగుతుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. గతంలో వెయిటింగ్ జాబితా ఉండేదని, కానీ ఇప్పుడు ఒక పోస్టుకు ఒకరు చొప్పునే సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రాధాన్యతలపై న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై న్యాయ సలహా తీసుకుంటామన్నారు. అభ్యర్థులు ఇచ్చిన ప్రాధాన్యతల ఆధారంగానే ఎంపిక జరిగిందని, మొత్తం 150 రోజుల వ్యవధిలోనే మెగా డీఎస్సీ ప్రక్రియ పూర్తయ్యిందని చెప్పారు. తర్వాత స్పెషల్ డీఎస్సీపైనా కసరత్తు ప్రారంభిస్తామన్నారు. కాగా ఉమ్మడి కర్నూలులో అత్యధికంగా 88, చిత్తూరు 70 పోస్టులు మిగిలాయి.



ఉమ్మడి జిల్లాలు, జోన్ల వారీగా
డీఎస్సీ భర్తీ వివరాలు

జిల్లా	ఖాళీలు	భర్తీ	మిగులు
అనంతపురం	8,11	7,55	56
చిత్తూరు	1,478	1,408	70
తూర్పుగోదావరి	1,353	1,349	4
గుంటూరు	1,159	1,140	19
కడప	712	680	32
కృష్ణా	1,213	1,203	10
కర్నూలు	2,678	2,590	88
నెల్లూరు	673	657	16
ప్రకాశం	672	661	11
శ్రీకాకుళం	543	535	8
విశాఖపట్నం	1,139	1,134	5
విజయనగరం	583	578	5
పశ్చిమగోదావరి	1,074	1,063	11
జోన్-1	395	390	5
జోన్-2	347	330	17
జోన్-3	572	558	14
జోన్-4	686	667	19
రాష్ట్ర స్థాయి	259	243	16
మొత్తం	16,347	15,941	406

లోకేశ్ అభినందనలు

కొత్త టీచర్ల ఎంపిక జాబితాలను విడుదల చేసిన మంత్రి లోకేశ్ మెగా డీఎస్సీపై ఎక్స్ వేదికగా స్పందించారు. సీఎం తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీ హామీని నెరవేర్చామని లోకేశ్ పేర్కొన్నారు. 150 రోజుల్లోనే పాఠశాల విద్యాశాఖ విజయవంతంగా మెగా డీఎస్సీని పూర్తిచేసిందని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారుల మేధస్సును తీర్చిదిద్దుతూ ఏపీ మోడల్ విద్యా విధానాన్ని ప్రతి తరగతి గదికి చేర్చే దిశగా కొత్త టీచర్లు ముందుకు సాగబోతున్నారని లోకేశ్ పేర్కొన్నారు. కొత్త టీచర్లను ఆత్మీయంగా ఆహ్వానించి, వారికి మార్గనిర్దేశం చేయాలని ఉపాధ్యాయ వర్గానికి మంత్రి సూచించారు. ఈ డీఎస్సీలో అవకాశం అందుకోలేకపోయినవారు నిరుత్సాహపడొద్దని, ఇచ్చిన హామీ ప్రకారం ఇకపై ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి లోకేశ్ పునరుద్ఘాటించారు.



ఏపీలోని చింతలపూడి పోలీసుల వాహనాన్ని అడ్డుకున్న దమ్మపేట వాసులు

పందెం కోళ్ల చోరీ గొడవ

- ఏపీ, తెలంగాణ పోలీసుల మధ్య వివాదం
- విచారణ పేరుతో ఇంట్లోకి ప్రవేశించిన ఏపీ పోలీసులు
- అడ్డుకున్న గ్రామస్థులు.. స్థానిక పోలీసులకు ఫిర్యాదు
- ఏపీ పోలీసులను స్టేషన్‌కు తరలించిన స్థానిక పోలీసులు
- తమ వాళ్లను విడిపించుకొని వెళ్లిన ఏపీ సీఐ

దమ్మపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మందిమార్బలంతో నాలుగు కార్లలో ఏపీ పోలీసులొచ్చి.. ఓ ఇంట్లోకి ప్రవేశించి అక్కడివారిని భయభ్రాంతులకు గురిచేస్తే స్థానికులు తీవ్రంగా ప్రతిఘటించారు. ఆ పోలీసులను తెలంగాణ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. చివరికి ఆ ఏపీ స్టేషన్ నుంచి సీఐ స్వయంగా వచ్చి తమ సిబ్బందిని విడిపించుకొని తీసుకెళ్లాల్సి వచ్చింది. ఇంత గలాటా జరిగింది ఓ దొంగకోళ్ల కేసులో భాగంగా అంటే నమ్మాలి! స్థానిక పోలీసులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విచారణ పేరుతో ఏపీ పోలీసుల ఈ దుందుడుకు చర్య కొత్తగూడెం జిల్లా దమ్మపేటవాసుల్లో తీవ్ర ఆగ్రహావేశాలను రగిల్చింది. చోరీకి గురైనవి నాలుగు కోళ్లు! వాటి విలువ రూ.4 లక్షలు! అంత ఖరీదా? అనంటే.. అన్నీ కూడా పిస్తా, బాదాం పప్పులు గట్రా మేస్తూ వచ్చే సంక్రాంతి కోసం సిద్ధమవుతున్న పందెం కోళ్లు! ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం పట్టాయిగూడెం గ్రామానికి చెందిన రంగనాథ్ అనే వ్యక్తికి చెందిన ఈ కోళ్లను పదిరోజుల క్రితం దొంగలెత్తుకెళ్లారు. వెంటనే రంగనాథ్, చింతలపూడి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఎలా తెలుసుకున్నాడో ఏమో గానీ ఆ రంగనాథే తన కోళ్లను పిల్లి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి దొంగిలించాడని.. ఆ కోళ్లలో రెండింటిని దమ్మపేటకు చెందిన గోపవరపు శేషగిరికి విక్రయించాడని తెలుసుకొని పోలీసులకు ఉప్పందించాడు. సోమవారం చింతలపూడి స్టేషన్ నుంచి హెడ్ కానిస్టేబుల్, ఓ కానిస్టేబుల్, ఓ హోంగార్డు కలిసి ఓ కార్లో... స్థానికంగా ఉంటున్న కొందరు మరో మూడు కార్లలో బయలుదేరి దమ్మపేటలో వాలారు. నేరుగా గోపవరపు శేషగిరి ఇంట్లోకి వెళ్లారు. ఆ సమయంలో శేషగిరి ఇంట్లో లేడు. అతడి భార్య రాజేశ్వరిని ఉద్దేశించి 'నీ భర్త ఎక్కడ?' అంటూ పోలీసులు గద్దించారు. 'దొంగకోళ్లు ఎందుకు కొన్నారు?' అని ప్రశ్నించారు. లోపలి నుంచి గేట్లు మూసేసి.. ఇంట్లోని సీసీ కెమెరాలు, హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లో ఓ చోట.. వేరే రెండు కోళ్లు కట్టేసి ఉండటం చూసి.. ఇవే కదా.. మీరు కొన్న కోళ్లు? అంటూ దుర్భాషలాడారు. ఆ కోళ్లను తమ కార్లో వేసుకున్నారు. అయితే అప్పటికే అక్కడికి చేరుకున్న గ్రామస్థులు, ఏపీ పోలీసులు అక్కడి నుంచి వెళ్లకుండా అడ్డుకున్నారు. వెంటనే.. దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు సమాచారమిచ్చారు. స్టేషన్ నుంచి ఓ పోలీసు ఘటనా స్థలానికి చేరుకొని.. ఏపీ పోలీసులను, వారి వెంట వచ్చినవారిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. కాగా చింతలపూడి సీఐ క్రాంతి కుమార్ సోమవారం రాత్రి దమ్మపేటకు చేరుకుని తమ సిబ్బందిని విడిచిపించుకుని తీసుకెళ్లారు. ఈ విషయంపై దమ్మపేట ఎస్సై సాయికిషోర్‌రెడ్డి వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. వాస్తవానికి పిల్లి వెంకటేశ్వర్లు నుంచి ఓ రెండు కోళ్లను శేషగిరి కొన్నట్లు తెలిసింది. వాటిని అతడు మరో వ్యక్తి ఇంట్లో ఉంచి.. అక్కడి నుంచి వెరే రెండు కోళ్లను తెచ్చి పెట్టుకున్నట్లు సమాచారం. అయితే మిగిలిన రెండు పందెం కోళ్లను వెంకటేశ్వర్లు తన వద్దే పెట్టుకున్నాడు. గ్రామానికి పోలీసులొచ్చారనే విషయం తెలుసుకొని.. శివార్లలోని ఓ చర్చి వద్ద ఆ రెండు కోళ్లను వదిలేసి అతడు పరారయ్యాడు. నాలుగు కోళ్లు దొరకడంతో ఏపీ పోలీసులు శేషగిరికి సంబంధించిన రెండు కోళ్లను అతడికిచ్చేసి, పందెం కోళ్లతో వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

ప్రియుడిని వెతుక్కుంటూ 600 కి.మీ వెళ్లి..

- అతడి చేతిలోనే దారుణహత్యకు గురైన మహిళ

జైపూర్, సెప్టెంబరు 15: కారును నడుపుకొంటూ 600 కి.మీ దూరంలో ఉన్న ప్రియుడి వద్దకు వెళ్లిన ఆ మహిళ, అతడి చేతిలోనే దారుణహత్యకు గురైంది. రాజస్థాన్‌లోని బర్మార్‌లో ఈ ఘటన జరిగింది. హతురాలు ఝున్‌ఝునుకు చెందిన 37 ఏళ్ల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ముకేశ్ కుమారి. ఆమె వివాహిత. భర్తతో విడాకులు తీసుకొని ఒంటరిగా ఉంటోంది. బర్మార్‌కు చెందిన మనరామ్ అనే ఉపాధ్యాయుడితో ఆమెకు ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. మనరామ్‌కు పెళ్లయింది. భార్యతో మనస్పర్థలు రావడంతో విడాకుల కేసు కోర్టులో ఉంది. ముకేశ్ కుమారి-మనరామ్ మధ్య పరిచయం, కొన్నాళ్లకు వివాహేతర సంబంధానికి దారితీసింది. తనను పెళ్లి చేసుకోవాలని కొన్నాళ్లుగా మనరామ్‌పై కుమారి ఒత్తిడి చేస్తోంది. సెప్టెంబరు 10న మనరామ్‌ను కలిసేందుకు ఝున్‌ఝును నుంచి కారులో బర్మార్‌కు బయలుదేరింది. నేరుగా అతడి ఇంటికి వెళ్లి.. మనరామ్ కుటుంబసభ్యులతో తన ప్రేమ విషయం చెప్పింది. అదేరోజు సాయంత్రం కుమారి-మనరామ్ కలిసి కారులో బయటకు వెళ్లారు. మార్గమధ్యలో మనరామ్ ఐరన్ రాడ్డుతో తల మీద కొట్టి కుమారిని చంపాడు.

బిహార్‌లో కింగ్‌మేకర్ పీకే!

- తాజా ఒపీనియన్ పోల్‌లో వెల్లడి

పట్నా, సెప్టెంబరు 15: త్వరలో జరుగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ కింగ్ మేకర్‌గా మారనున్నట్టు తాజా ఒపీనియన్ పోల్‌లో వెల్లడైంది. ఆయన పార్టీకి 8.3 శాతం ఓట్లు దక్కనున్నట్టు ఆదివారం ప్రకటించి న సర్వే ఫలితాలు తెలియజేస్తున్నాయి. ముఖ్యమంత్రిగా ఎవరు ఉండాలనుకుంటున్నారనే ప్రశ్నకు 13.70 శాతం మంది పీకే పేరును వెల్లడించారు. అత్యధికంగా 33.5 శాతం మంది ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ సీఎం కావాలని ఆకాంక్షించగా, 24 శాతం మంది ప్రస్తుత సీఎం నితీశ్‌కుమార్‌ను కోరుకున్నారు. నిరుద్యోగం, సమగ్ర ఓటర్ల సవరణ(ఎస్ఐఆర్) ఎన్నికల్లో ప్రభావం చూపనున్న కీలక అంశాలుగా ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. సర్వేలో వెల్లడైన వివరాల మేరకు అధికార ఎన్డీయే కూటమి, ప్రతిపక్ష మహాగట్‌బంధన్ మధ్య గట్టి పోటీ నెలకొననుంది. సర్వేలో పాల్గొన్నవారిలో 36.2 శాతం మంది ఎన్డీయేకు, 35.8 శాతం మంది ఆర్జేడీ, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలతో కూడిన మహా కూటమికి మద్దతు తెలిపారు.

దశ దిశ

17.11 శాతం వృద్ధి లక్ష్యం

ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్

అనేక సవాళ్లున్నప్పటికీ రాష్ట్రం వృద్ధి దిశగా వేగంగా పరుగులు తీస్తోందని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం(క్యూ1)లో 10.5 శాతం వృద్ధిరేటు సాధించామని, జాతీయ సగటు వృద్ధిరేటు 8.8 శాతం ఉండగా, ఏపీలో చాలా ముందంజలో నిలిచిందని వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 17.11 వృద్ధిశాతం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సోమవారం సచివాలయంలో కలెక్టర్ల సదస్సు సందర్భంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి(జీఎస్డీపీ)పై ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు.



ఈ క్యూ1లో స్థూల విలువ జోడింపు(జీవీఏ) 10.76 శాతంగా నమోదవ్వడం మంచి పరిణామన్నారు. ఈ సందర్భంగా రంగాల వారీగా ప్రగతిని వివరించారు. క్యూ1లో శ్రీకాకుళం, ప్రకాశం, ఏలూరు, ఎన్టీఆర్, తిరుపతి జిల్లాలు 20 శాతంపైగా వృద్ధిరేటు కనబర్చాయని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 18.65 లక్షల కోట్ల జీఎస్డీపీ సాధనే లక్ష్యమన్నారు. జిల్లా కలెక్టర్లందరూ తప్పనిసరిగా తమ జిల్లాల్లోని వృద్ధిరేటు వివరాలన్నీ ప్రతి నెలా మండలస్థాయిలో 5వ తేదీలోగా, జిల్లాస్థాయిలో 8వ తేదీలోగా డేటా ఎంట్రీ చేయాలని పీయూష్ కుమార్ చెప్పారు. ప్రతి నెలా 15వ తేదీన ముఖ్యమంత్రి ఆయా జిల్లాలు సాధిస్తున్న జీఎస్డీపీ వృద్ధిరేటు వివరాలను సమీక్షిస్తారని తెలిపారు. పీ4లో 21 లక్షల బంగారు కుటుంబాలు గుర్తించినట్టు చెప్పారు. 10 లక్షల కుటుంబాలను అనుసంధానించామన్నారు. - అమరావతి, ఆంధ్రజ్యోతి

తొలి త్రైమాసికం (క్యూ1)లో ఆయా రంగాలు సాధించిన జీవీఏ (రూ. కోట్లలో)

రంగం	2024-25 జీవీఏ	జీవీఏ పెరుగుదల(%)	2025-26 జీవీఏ	జీవీఏ పెరుగుదల(%)	జాతీయ సగటు(%)
వ్యవసాయ రంగం	74,361	7.13	81,496	9.6	3.2
పారిశ్రామిక రంగం	82,965	8.85	92,843	11.91	6.8
సేవా రంగం	1,42,116	10.93	1,57,321	10.7	11.3
మొత్తం జీవీఏ	2,99,441	9.4	3,31,660	10.76	8.8
ఏపీ జీఎస్డీపీ	3,23,879	9.58	3,57,894	10.5	8.8

1.4 కోట్ల కుటుంబాలకు 'దీపం-2' లబ్ధి

దీపం-2 పథకం కింద ఇప్పటి వరకు రెండు విడతల్లో 1.4 కోట్ల కుటుంబాలు ఉచిత గ్యాస్ సిలిండర్లను పొందినట్లు కలెక్టర్ల సదస్సులో పౌరసరఫరాల శాఖ వెల్లడించింది. ఆ శాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్ ఇచ్చిన ప్రజెంటేషన్‌లో వివరాలు వెల్లడించారు. సబ్సిడీ కింద రూ. 1,554 కోట్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మూడో విడతలో మరో 64.67 లక్షల కుటుంబాల వారికి ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయనున్నారు.



దీని కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.150 కోట్లు విడుదల చేసింది. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా పూర్తచేసేలా కలెక్టర్లు పర్యవేక్షణ చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ ఖరీఫ్‌లో 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

15 నెలల్లో 10 లక్షల కోట్లు

122 ప్రాజెక్టులకు అనుమతి.. ప్రతి 'మంగళవారం' ఇండస్ట్రీ డే

పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్

కూటమి ప్రభుత్వం జూన్ 2024లో ఏర్పాటయిన నాటి నుంచి నేటి వరకూ 122 ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ఒప్పందాల ద్వారా రూ.10,06,799 కోట్ల పెట్టుబడులు రాష్ట్రంలో పెట్టనున్నారు' అని పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ తెలిపారు. కలెక్టర్ల సదస్సులో సోమవారం ఆయన పారిశ్రామిక రంగంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. 'రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటయ్యే మొత్తం 50 క్లస్టర్లకు లక్ష ఎకరాలకు పైగా ఖాళీ స్థలాలను గుర్తించాం. కలెక్టర్లు భూ సేకరణపై దృష్టి సారించాలి. రాష్ట్రంలో ఐదు చోట్ల డిఫెన్స్ క్లస్టర్లు... విశాఖపట్నం-శ్రీకాకుళం జిల్లాల



మధ్య 3,000 ఎకరాల్లో నావల్ క్లస్టర్, అనంతపురం జిల్లా మడకశిర-లేపాక్షి మధ్య 4-5 వేల ఎకరాల్లో ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ క్లస్టర్, ప్రకాశం జిల్లా దొనకొండలో 4,000 ఎకరాల్లో ఎయిర్ క్రాఫ్ట్ విడిభాగాల తయారీ క్లస్టర్ ఏర్పాటు కాబోతున్నాయి. ప్రతి మంగళవారం ఇండస్ట్రీ డే నిర్వహించాలి. జిల్లాల్లో ప్రతి ఎకనామిక్ హబ్‌కు ఒక జిల్లా అధికారిని నియమించాలి. ఎంఎస్ఎంఈలపై కూడా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలి. జిల్లా ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చేవి ఎంఎస్ఎంఈలే' అని యువరాజ్ తెలిపారు.

పునరుత్పాదక ఇంధనంపై దృష్టి: సీఎస్

రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని భారీగా పెంచేందుకు కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ కార్యదర్శి విజయానంద్ పేర్కొన్నారు. 4వ కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర విద్యుత్ రంగంపై ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. 'పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచడంలో భాగంగా ఏపీ డిస్కంలు సోలారైజేషన్‌పై దృష్టి సారించాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి 2,93,587 వ్యవసాయ పంపుసెట్లను సోలార్ పంపుసెట్లుగా మార్చేందుకు ఇప్పటికే టెండర్లు పిలిచాం. రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటును ప్రాధాన్యంగా తీసుకుని వెంటనే గ్రౌండ్ చేయడానికి కలెక్టర్లు సహకరించాలి. పైలట్ ప్రాజెక్టుగా తిరుపతి జిల్లా నారావారిపల్లెలో, చిత్తూరు జిల్లా నడి



మూరులో అమలు చేస్తున్నాం. ఇక్కడ మొత్తం 393 కిలోవాట్ పవర్ సామర్థ్యంతో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్లను ఏర్పాటుచేశారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకుని ఎన్ఆర్ఈడీసీఏపీ 1198.21 మెగావాట్ గ్రిడ్ కనెక్టడ్ రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలిచాం. తొలి దశలో 6 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ఏర్పాటు చేయనున్నాం. ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా విద్యుత్తు సబ్సిడీలకు సంబంధించిన అన్ని హామీలను నెరవేరుస్తున్నాం' అని విజయానంద్ వివరించారు.



సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న కలెక్టర్లు, ఉన్నతాధికారులు

యూరియా వదిలేయండి

బస్తాకు రూ.800 ప్రోత్సాహకం ఇస్తాం

- అధికారుల పంథా మారనందునే సమస్య
- యూరియా నియంత్రణపై రైతుల్లో అవగాహన పెంచాలి
- అవసరమైతే డోర్ డెలివరీ చేస్తాం
- త్వరలో విధివిధానాలు ఖరారు
- తురకపాలెం లాంటి ఘటనలు జరక్కూడదు
- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి నిర్దేశం

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరత లేనేలేదని సీఎం చంద్రబాబు తేల్చిచెప్పారు. అవసరమైతే డోర్ డెలివరీ చేద్దామన్నారు. అధికార పగ్గాలు చేపట్టాక అన్ని శాఖల్లోనూ అనుసరించాల్సిన విధానపరమైన మార్పులపై స్పష్టత ఇచ్చానని.. కానీ యూరియా విషయంలో అధికారులు తమ పంథా మార్చుకోలేదని అసహనం వ్యక్తంచేశారు. సోమవారం కలెక్టర్ల సదస్సులో ఆయనీ అంశంపై ప్రత్యేకంగా మాట్లాడారు. అన్ని శాఖలూ గాడిలో పడ్డాయని.. యూరియా సరఫరాపై మాత్రం ముందస్తు ప్రణాళికలు, చర్యలు అమలు చేయక పోవడం వల్ల సమస్యలొచ్చాయని చెప్పారు. యూరియా వినియోగాన్ని తగ్గించేందుకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని.. రైతుల్లో అవగాహన పెంచాలని సూచించారు. 'యూరియా వాడని రైతులకు బస్తాకు రూ.800 చొప్పున ప్రోత్సాహకం ఇస్తాం. పీఎం ప్రణామ్ కింద రాష్ట్రానికి ఇచ్చే సబ్సిడీని రైతులకు ఇచ్చేద్దాం. విధివిధానాలను త్వరలో ప్రకటిస్తాం. రబీ నుంచి ఈ-క్రాప్ విధానం తప్పకుండా అమలు కావాలి. ఈ విధానం ద్వారా ఇప్పటి నుంచే ఎవరెవరు.. ఎంతెంత పంట వేస్తున్నారో గుర్తించి.. అవసరమైన యూరియాను సరఫరా చేద్దాం' అని చెప్పారు. ప్రజలు తినే రకాలనే పండించేలా రైతుల్లో అవగాహన కల్పించాలని.. డిమాండ్-సరఫరాకు తగిన పంటలు పండించేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలని సూచించారు.

మెడికల్ కాలేజీలపై రాజకీయం

పీపీపీ విధానంలో చేపట్టే మెడికల్ కాలేజీల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కొనసాగుతాయని సీఎం స్పష్టంచేశారు. 10 మెడికల్ కళాశాలలకు రూ.4,950 కోట్లు వ్యయమవుతుందని, గత పాలకులు కేవలం 5 శాతం నిధులే ఖర్చు పెట్టారని.. ఇప్పుడు వాటి నిర్మాణం పూర్తికి రూ.4 వేల కోట్ల వరకూ అవసరమవుతాయని వివరించారు. దీనిపై కొందరు రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజా ప్రయోజనం కోసం పీపీపీనే ఉత్తమ విధానమని స్పష్టంచేశారు. గతంలో 650 మెడికల్ సీట్లు మాత్రమే ఉండేవని, తాను ముఖ్యమంత్రి అయ్యాక 1282 మెడికల్ సీట్లు తేగలిగామని చెప్పారు. రాష్ట్రంలో తురకపాలెంలాంటి ఘటనలు జరుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందన్నారు. ఈ ఘటన కచ్చితంగా మానవ తప్పిదమేనని.. ఎక్కడా నీటి కాలుష్యం జరగడానికి వీల్లేదని, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో పాటు సంజీవని ప్రాజెక్టు చేపడుతున్నామన్నారు. మొదట చిత్తూరు జిల్లాలో, తర్వాత రాష్ట్రం మొత్తం అమలు చేసేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. యూనివర్సల్ హెల్త్ కార్డు గేమ్ చేంజర్‌గా మారుతుందని చెప్పారు.

ఆక్వా రైతుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి..

ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు సీఎం చెప్పారు. అమెరికా సుంకాల నేపథ్యంలో ఈ రంగం సంక్షోభంలో పడకుండా చూడాలని కేంద్రానికి లేఖలు రాశానని తెలిపారు. రాష్ట్రంలో 5 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉండగా, రైతులకు యూనిట్ విద్యుత్ రూపాయిన్నరకే ఇస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. రాయితీ విద్యుత్ కోసం జోన్, నాన్‌జోన్‌గా విభజించారని, ఆక్వా రైతుల రిజిస్ట్రేషన్ నెలరోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. పౌల్ట్రీ వ్యర్థాలను ఇష్టానుసారం పడేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థూల ఉత్పత్తిలో కీలకమైన పాలు, గుడ్లు, మాంసానికి మూలమైన పశుసంవర్ధకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్బన్ ప్రాంతాలను మినహాయించి, 157 నియోజకవర్గాల్లో ఒక్కో యానిమల్ హాస్టల్ నిర్మించాలని సూచించారు. గోశాలల నిర్మాణంతో పశుసంపద రాష్ట్రానికి రిటర్న్ గిఫ్ట్ ఇస్తోందని చెప్పారు. పశుదాణా ఉత్పత్తిని డ్వాక్రా గ్రూపులకు అనుసంధానం చేస్తే మంచి ఆదాయం వస్తుందని.. ఈ దిశగా ఆలోచన చేయాలని కలెక్టర్లకు సూచించారు. చర్చలో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు కూడా పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం స్థాయి నుంచే డ్యాష్ బోర్డులు

వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ప్రధాన ముడి సరుకని.. ఈ ప్రాథమిక రంగానికి కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యమివ్వాలని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ సూచించారు. ఇందుకోసం రైతుసేవా కేంద్రం స్థాయి నుంచే డ్యాష్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో చెప్పారు. ఉద్యానవనాలు ప్రస్తుతం 30 శాతం ఉన్నాయని.. 50 శాతానికి తీసుకెళ్తే రాష్ట్రానికి, రైతులకు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. పాడి పరిశ్రమ గణనీయమైన వృద్ధి నమోదు చేస్తోందని.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో పాల ఉత్పత్తి 36.34 లక్షల టన్నుల నుంచి 37.26 టన్నులకు పెరిగిందన్నారు. రొయ్యల ఎగుమతిపై అమెరికా సుంకాలు 60 శాతం వరకు ఉన్నాయని.. ప్రస్తుత సవాళ్లను అధిగమించేలా ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నామని తెలిపారు. రబీకి యూరియా కొరత అనే మాటే ఉండకుండా చేస్తామని.. యూరియా సరఫరాపై కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేయాలని చెప్పారు.

లే-అవుట్లలో ఖాళీ స్థలాలు

పరిశ్రమలకు కేటాయించండి

- లబ్ధిదారులకు ఆసక్తి లేనివాటిని ఇవ్వండి
- వారికి ప్రత్యామ్నాయ స్థలాలు: చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం వేసిన లే-అవుట్లలో ఖాళీగా ఉన్న స్థలాలను సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ల సదస్సులో ఈ అంశం చర్చకు వచ్చింది. 'ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూముల్లో చాలా వరకు ఇప్పటికీ గ్రౌండింగ్ కాకుండా ఖాళీగానే ఉన్నాయి. లబ్ధిదారుల పేర్ల మీద సెంటు, సెంటున్నర చొప్పున రిజిస్ట్రేషన్ అయి ఉన్నాయి. ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి ఆసక్తి చూపని వారి రిజిస్ట్రేషన్లు రద్దు చేసి వాటిని పరిశ్రమలు నెలకొల్పడానికి ఉపయోగించుకోవచ్చు' అని కాకినాడ కలెక్టర్ షన్మోహన్ చేసిన సూచనతో సీఎం ఏకీభవించారు. ఇదే అంశంపై మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. 'పేదల ఇళ్ల నిర్మాణం కోసం భారీ ఎత్తున భూములు సేకరించారు. 300 నుంచి 600 ఎకరాల్లో లే-అవుట్లు వేశారు. అవన్నీ చాలా వరకు ఖాళీగాఉన్నాయి. వాటిని ఎంఎస్ఎంఈ పార్కులుగా అభివృద్ధి చేస్తే బాగుంటుంది' అని సూచించారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు. 'గతంలో ఇళ్ల పట్టాలు ఎక్కడెక్కడో ఇచ్చారు. ఆ స్థలాల్లో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటే సరే.. ఇష్టం లేదని చెబితే అలాంటి లే-అవుట్లను గుర్తించి ఎంఎస్ఎంఈలకు కన్వర్ట్ చేయండి. లబ్ధిదారులకు ప్రత్యామ్నాయ ఇళ్ల స్థలాలను ప్రభుత్వం సమకూరుస్తుంది' అని సీఎం తెలిపారు.

పేదల గృహాలపై ప్రజెంటేషన్

పేదల ఇళ్ల నిర్మాణానికి పొజిషన్ సర్టిఫికెట్లు చాలా అవసరమని, ఇవి లేకపోవడంతో కేంద్రం అర్బన్ హౌసింగ్ కింద మంజూరు చేసిన ఇళ్లను వినియోగించుకోలేకపోతున్నామని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇలాంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చంద్రబాబు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. పేదల గృహ నిర్మాణంపై ఆ శాఖ ప్రధానకార్యదర్శి అజయ్ జైన్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

బాధ్యత కలెక్టర్లదే!

(మొదటి పేజీ తరువాయి)

స్థానాలు ఇచ్చారని తెలిపారు. సంపద సృష్టించి ఆదాయాన్ని పెంచి సంక్షేమం అమలు చేస్తామని కూడా చెప్పామన్నారు. చెప్పినట్లుగా సూపర్‌సిక్స్‌ను సక్సెస్ చేశామని.. ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. ప్రజల విశ్వాసం నిలబెట్టే బాధ్యత తమతో పాటు కలెక్టర్లది కూడానని తెలిపారు. శాఖాధిపతులు.. జిల్లా కలెక్టర్లతో పాటు మంత్రులు కూడా ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. వారిని త్వరలోనే జిల్లా ప్రగతి చైర్మన్లుగా నియమిస్తామని.. నియోజకవర్గ ప్రగతి అధ్యక్షులుగా శాసనసభ్యులను నియమిస్తామని చెప్పారు. శాఖల వారీగా ర్యాంకులు ప్రకటించామని.. అది శాఖాధిపతులకు మాత్రమే వర్తించదని.. ఆ శాఖల మంత్రులకూ వర్తిస్తుందని.. శాఖలపై వారు సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని తెలిపారు. పథకాల లబ్ధిదారులకు సాయం అందడంలో తలెత్తిన చిన్న చిన్న లోటుపాట్లను కలెక్టర్లు సరిదిద్దాలన్నారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే..



సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన సీఎస్ విజయానంద్

విజన్ డాక్యుమెంటే గీత, ఖురాన్, బైబిల్..

కేంద్రం 2047 వికసిత్ భారత్ ప్రణాళిక తయారుచేస్తే.. ఏపీ 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపొందించింది. ఇది అధికారులందరికీ భగవద్గీత, బైబిల్, ఖురాన్ కావాలి. డబుల్ ఇంజన్ సర్కార్-డబుల్ ఇంజన్ గ్రోత్ ఉండాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రస్తుతం వృద్ధి రేటు 10.5 శాతం ఉంది. 2047నాటికి 15 శాతం సాధించే దిశగా కృషిచేస్తున్నాం. ఈ ఏడాది తలసరి ఆదాయాన్ని రూ.3.47 లక్షలకు తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నాం. 2029 నాటికి రూ.29 లక్షల జీఎస్డీపీ లక్ష్యం. అప్పటికి రూ.4.67 లక్షల తలసరి ఆదాయం లక్ష్యంగా మనం పనిచేయాలి.

అతి పెద్ద సంక్షేమ పథకం..

దేశంలోనే అతి పెద్ద సంక్షేమ పథకం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు. 64 లక్షల మందికి ఇస్తున్నాం. తల్లికి వందనం ద్వారా చదువుకునే ప్రతి విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్నాం. ఏడుగురు పిల్లలున్న తల్లికి కూడా ఈ పథకాన్ని వర్తింపజేశాం. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్తున్నారు. ఉచిత బస్సు అమలు చేయలేమని కొందరు విమర్శించారు. కానీ స్త్రీశక్తి పథకం సఫలమైంది. పథకం అమలు తర్వాత ఆర్టీసీలో 90 శాతం ఆక్యుపెన్సీ పెరిగింది. దీపం-2 పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా మొదటి విడతలో రూ.7 వేల చొప్పున ఇచ్చాం. 3 విడతల్లో రూ.20 వేలు అందిస్తాం. ఆటో డ్రైవర్లకు అక్టోబరు 1న రూ.15 వేలు ఇస్తాం. శాశ్వత కులధ్రువీకరణ పత్రాలు త్వరలోనే జారీ చేస్తాం. కేజీ టు పీజీ పాఠ్యాంశాల్లో సంస్కరణలు తెస్తున్నాం. నిర్మాణ రంగంలో వర్కర్ల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేస్తున్నాం. కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించాం. జీవో 217 రద్దు చేశాం. మత్స్యకారుల సేవలో భాగంగా వేట నిషేధ సమయంలో రూ.20 వేలు ఇస్తున్నాం. గ్రీన్‌ట్యాక్స్‌ను రద్దు చేశాం. డ్రైవర్ల సాధికారిక సంస్థ ఏర్పాటు చేసే అంశం పరిశీలిస్తున్నాం. నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేల చొప్పున వేతనం ఇస్తున్నాం. అర్చకులకు గౌరవవేతనం రూ.15 వేలకు పెంచాం. వేద విద్యార్థులకు రూ.3 వేలు ఇస్తున్నాం. ఇమామ్, మౌజన్లకు కూడా గౌరవవేతనం ఇస్తున్నాం. విజయవాడలో హజ్‌హౌస్ త్వరలోనే పూర్తవుతుంది. హజ్ యాత్రికులకు రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తున్నాం. మసీదుల నిర్వహణకు నెలకు రూ.5 వేలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నాం. కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహిస్తున్నాం. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించే అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. అసంపూర్తిగా ఉన్న కాపు భవనాలను పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం. రజకులకు దోబీఘాట్లు, షెడ్లు, ఇస్త్రీ చేయడానికి ఆధునిక మౌలిక వసతులు కల్పించాలి. చేనేతలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నాం. ఉన్నత విద్య చదువుకునే విద్యార్థులకు కేంద్రం నుంచి పావలా వడ్డీ కింద ఎంతైనా రుణం తీసుకునే అవకాశముంది. ఆ వడ్డీ భారాన్ని రాష్ట్రం భరించేలా ఆలోచన చేయాలి. వచ్చే నాలుగేళ్లలో అందరికీ ఇళ్లు పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఉచితంగా స్థలం ఇవ్వాలి. సంక్షేమ హాస్టళ్లను కలెక్టర్లు తప్పనిసరిగా సందర్శించాలి. అవసరమైతే రాత్రిపూట నిద్ర చేసి పరిస్థితులు మార్చాలి.డ్వాక్రా సంఘాల టర్నోవర్ రూ.10 లక్షల కోట్లకు ఎదగాలి మహిళల సాధికారత కోసం తీసుకొచ్చిన డ్వాక్రా సంఘాలు మరింత ఎత్తుకు ఎదగాలి. రాష్ట్రానికి కోటి 20 లక్షల మంది అతిపెద్ద మహిళా సైన్యం డ్వాక్రా సంఘాల రూపంలో ఉంది. నేను ప్రారంభించిన ఈ సంఘాలను ఎవరూ ఏమీ చేయలేకపోయారు. వాటికి రుణం ఇస్తే డబ్బులు బ్యాంకుల్లో ఉన్నట్లే! డ్వాక్రా సంఘాల టర్నోవర్ రూ.10 లక్షల కోట్లకు ఎదగాలని ఆశిస్తున్నాను. విజయవంతంగా డ్వాక్రాను నిర్వహిస్తున్న సెర్ప్ అధికారులను అభినందిస్తున్నాను.

సమర్థులను నియమించాం..

సీఎస్, డీజీపీల నుంచి క్షేత్రస్థాయి వరకు సరైన వ్యక్తి సరైన చోట ఉండాలనే లక్ష్యంతో నియామకాలు చేశాం. అన్ని కోణాల్లో నుంచీ ఎమ్మెల్యేల అభ్యర్థుల ఎంపిక, క్యాబినెట్ కూర్పు చేశాం. అదే తరహాలో సమర్థులైన వారిని కలెక్టర్లుగా నియమించాం. వారు కూడా దీనికి అనుగుణంగా పనిచేయాలి. మంచి పేరు తెచ్చుకోవాలి. పనితీరు చక్కగా ఉన్న వాళ్లను నేనెప్పుడూ మార్చలేదు. ప్రభుత్వం అందించే సేవలన్నింటిలోనూ సంతృప్త స్థాయే కొలమానం. సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతటి ప్రాధాన్యమిస్తారో శాంతి భద్రతలకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. కొంత మంది ఐఏఎస్‌లలో నేను సీఎం అయిన సంవత్సరంలో పుట్టినవారు కూడా ఉన్నారు. కలెక్టర్ల సదస్సు కొత్త ట్రెండ్ సృష్టించాలని కోరుకుంటున్నాం.

పోర్టులు, ఎయిర్‌పోర్టుల్లో ఆర్థిక కార్యకలాపాలు

పోర్టులు, విమానాశ్రయాల ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు సాగేలా చర్యలు తీసుకోవాలి. విమానాశ్రయాలకు సమీపంలో పరిశ్రమలు, హోటళ్ల వంటి వ్యాపారాల నిర్వహణ జరగాల్సిందే. ఇందుకోసం ప్రైవేటు వ్యక్తులు కూడా వ్యాపార భాగస్వామ్య విధానంలోకి వెళ్లేలా అధికారులు చర్యలు చేపట్టాలి. భూములు ఉన్నవారితో ఒప్పందాలు చేసుకుని.. అపార్ట్‌మెంట్లను నిర్మించి ఫ్లాట్లలో 40 శాతం వాటా ఇవ్వాలి. విమానాశ్రయాల సమీపంలోనూ ఈ తరహా వ్యాపార కార్యకలాపాలు సాగాలి. ప్రతి ఇంటి నుంచీ ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్త, వ్యాపారవేత్త రావాలని ఆకాంక్షిస్తున్నాం. ఇందులో భాగంగా లక్ష మంది మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహిస్తాం. జీఎస్టీ రెండో దశ సంస్కరణల ఫలాలు ప్రజలందరికీ అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. దీనిపై నెలపాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.

సామాజిక అసమానతలతోనే ఆర్థిక అసమానతలు

సంక్షేమం అంటే పేదలకు చేసే దానం కాదు. వారి అభివృద్ధికి, సాధికారతకు మార్గమది. సమాజంలో సామాజిక అసమానతల కారణంగానే ఆర్థిక అసమానతలు వచ్చాయి. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగంలో రిజర్వేషన్లు ఉన్నాయి. కానీ వారి చేతుల్లో భూముల్లేవు. సమాజంలో వస్తున్న మార్పుల కారణంగా బీసీలు తమ కులవృత్తులు లేక ఆర్థికంగా వెనుకబడి ఉన్నారు. వీటన్నింటినీ బ్యాలెన్స్ చేస్తూ అసమానతలు తొలగించేలా ప్రణాళికలు రూపొందించాం. పీ-4 లాంటి కార్యక్రమాలను తీసుకొచ్చాం. వాటిపై కలెక్టర్లు దృష్టి పెట్టాలి. ఆర్థికంగా ఇబ్బందులున్నా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. తొలి సంతకంగా చేసిన మెగా డీఎస్సీ కింద యువతకు 16,347 ఉద్యోగాలు వచ్చాయి. జిల్లాల్లో యువతకు ఉద్యోగాలు వచ్చేలా జాబ్‌మేళాలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ విభాగాల్లో ఖాళీలను గుర్తించి భర్తీ చేస్తాం. ఇప్పటికే పోలీసు శాఖలో 6 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చాం.

మొదటి సంవత్సర పరీక్షలు అయిపోయాయ్!

రాష్ట్రంలో కూటమి పాలనలో తొలి సంవత్సర పరీక్షలు పూర్తయ్యాయి. ఇక బాధ్యతగా పనిచేయాల్సిన సమయం వచ్చింది. ప్రత్యేక దృష్టి పనిచేయకపోతే ఫలితాలు రావు. సాంకేతికత పెరిగిన దృష్ట్యా స్మార్ట్ వర్క్ చేయాల్సిందే. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు అందిస్తున్నాం. ఏఐ, డేటా లేక్ వంటి వాటి ద్వారా సమన్వయం చేసుకుంటూ వెళ్లాలి. పథకాలు, కార్యక్రమాల అమలుకు ఆర్టీజీఎస్ సేవలు వాడుకోవాలి. విజన్ రూపొందించుకుని దానికి నిధులివ్వకపోతే ఇబ్బందులు వస్తాయి.

పీ4, డ్వాక్రా, మెప్మాను ఇంటిగ్రేట్ చేయండి

పీ4 మరో గేమ్ చేంజర్. స్వచ్ఛందంగానే ముందుకు రావాలి. ఎవరినీ బలవంతం చేయాల్సిన అవసరం లేదు. పీ4, డ్వాక్రా, మెప్మాను ఇంటిగ్రేట్ చేసి ముందుకెళ్లాలి. పరిశ్రమల స్థాపనలో ఉత్తరాంధ్రతో రాయలసీమ పోటీపడుతోంది. ఉత్తరాంధ్రలో ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, గూగుల్ వస్తున్నాయి. రాయలసీమలో లేపాక్షి నుంచి ఓర్వకల్లు వరకు.. శ్రీసిటీతో పాటు తిరుపతి కేంద్రంగానూ పరిశ్రమలు వస్తున్నాయి.

సమర్థ నీటి నిర్వహణ..

గతంలో గడ్డు పరిస్థితుల్లో ఉన్న రాయలసీమ.. ఇప్పుడు కోనసీమతో సమానంగా ఉంది. రాయలసీమలో డ్రిప్ ఇరిగేషన్ లాంటి విధానాలతో సమర్థ నీటి నిర్వహణ ద్వారా మంచి ఫలితాలు సాధించాం. పట్టిసీమతో కృష్ణా నీటిని పొదుపు చేసి శ్రీశైలంద్వారా రాయలసీమకు నీళ్లు ఇవ్వగలిగాం. హంద్రీ-నీవా ప్రధాన కాలువ విస్తరణను వందరోజుల్లో పూర్తి చేసి కుప్పం వరకూ కృష్ణా నీళ్లు తీసుకెళ్లాం. సమర్థ నీటి నిర్వహణతో రిజర్వాయర్లు నింపాం. సూక్ష్మ సేద్యంలో ఏపీ నంబర్ వన్‌గా ఉంది. రాయలసీమ ఉద్యాన పంటల్లో అగ్రస్థానంలో ఉంది. కోనసీమ కన్నా అనంతపురం జిల్లా తలసరి ఆదాయం, జీఎస్డీపీ ఎక్కువగా ఉంది. ఆయిల్‌పామ్ ఉమ్మడి గోదావరి జిల్లాలకు గేమ్ చేంజర్ అయింది.

ధనలక్ష్మిలతోనే దేశం బాగు!

వికసిత భారత్ సాధనలో మహిళల ఆర్థిక సాధికారతే కీలకం

» జాతీయ సదస్సులో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

» తిరుపతిలో ముగిసిన రెండు రోజుల సదస్సు





మహిళా సాధికారత జాతీయ సదస్సులో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న, డిప్యూటీ స్పీకర్ రఘురామ, ఎంపీ పురందేశ్వరి, సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

తిరుపతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళలు ధనలక్ష్మిలు అయితేనే దేశం బాగుంటుందని, 'వికసిత భారత్' సాకారంలో మహిళల ఆర్థిక సాధికారతే కీలకమని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ఆ దిశగా 'తిరుపతి తీర్మానాన్ని' ఆమోదించామని తెలిపారు. తిరుపతిలో సోమవారం జరిగిన చట్టసభల మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సు ముగింపు సభలో ఆయన మాట్లాడారు. మహిళల సాధికారత అనేది కేవలం సామాజిక అవసరం మాత్రమే కాదని ఆర్థిక అవసరం కూడానని నొక్కి చెప్పారు. మహిళల ఆరోగ్యం, విద్య, నైపుణ్యాలు, పెట్టుబడుల అపారమైన మానవ వనరులను అందిపుచ్చుకునే అవకాశముందన్నారు. తద్వారా దేశం బలమైన సామాజిక, ఆర్థిక అభివృద్ధి నమూనాను నిర్మించగలదని తెలిపారు. వికసిత భారత్ దిశగా చేస్తున్న ప్రయాణంలో మహిళల నాయకత్వం, వారి సహకారం కీలకమని చెప్పారు. కేంద్ర, రాష్ట్రాల అనుభవాలను, సమస్యలను, పరిష్కారాలను పంచుకునే వేదికలుగా మహిళా సాధికార కమిటీల సదస్సులు పనిచేస్తాయన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం అనేది కేవలం రాజకీయ వ్యవస్థ కాదని, ప్రజాస్వామ్యం నాగరికతా విలువలను, జీవన విధానాన్ని ప్రతిబింబిస్తుందని చెప్పారు. గత కొన్ని శతాబ్దాలుగా సమానత్వం, సౌభ్రాతృత్వం, భాగస్వామ్యం, సహకారం వంటి సూత్రాలను పాటిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలకు భారత్ మాతృకగా నిలిచిందని స్పీకర్ గుర్తు చేశారు. గ్రామీణ, వెనుకబడిన వర్గాల మహిళలకు అవకాశాలు కల్పించినప్పుడే విప్లవాత్మక ఫలితాలు వస్తాయన్నారు. బడ్జెట్‌లో మహిళలకు ఆరోగ్యం, విద్య, నైపుణ్యాలు, ఉపాధి రంగాల్లో సమాన అవకాశాలను కల్పించే విధంగా వనరుల కేటాయింపు జరగాలని సూచించారు.

వెనుకబడొద్దు!

ప్రస్తుత డిజిటల్ యుగంలో మహిళలు వెనుకబడరాదని, డిజిటల్ అంతరాన్ని తగ్గించడం, సైబర్ భద్రత కల్పించడం, డిజిటల్ అక్షరాసత్యను విస్తరించడం కీలకమని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు.మహిళలకు ప్రత్యేక డిజిటల్ సాక్షరతా మిషన్ చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇవన్నీ మహిళా సాధికారతకు స్పష్టమైన రోడ్ మ్యాప్ అవుతాయన్నారు. తిరుపతి సదస్సులో చేసిన తీర్మానాలకు సంబంధించి మహిళల విద్య, ఆరోగ్యం, భద్రత, గౌరవం, స్వావలంబన అనేవి జాతీయ ప్రగతికి మూల స్తంభాలుగా నిలుస్తాయని తెలిపారు.

ఇవీ తీర్మానాలు

- జెండర్ సెన్సిటివ్ బడ్జెట్‌ను సంస్థాగతం చేయడం.
- అన్ని ప్రభుత్వ శాఖలు లింగ దృష్టి కోణం అనుసరించడం.
- మహిళల ఆరోగ్యం, విద్య, వ్యాపారం కోసం నిధుల పెంపు.
- మహిళల సాంకేతిక సామర్థ్యాన్ని బలోపేతం చేయడం.
- మహిళల్లో డిజిటల్ అంతరాన్ని తగ్గించడం.
- స్టెమ్ రంగాలలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం.
- మహిళలకు సైబర్ భద్రతను కల్పించడం.
- మహిళలకు డిజిటల్ అక్షరాసత్యను విస్తరించడం.
- మహిళలను సాంకేతిక సృష్టికర్తలుగా తీర్చిదిద్దడం.

పరిజ్ఞానం అవసరం: హరివంశ్

ప్రస్తుత డిజిటల్ యుగంలో మహిళలకు సాంకేతిక పరిజ్ఞానం కల్పించడం అవసరమని రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్ అభిప్రాయపడ్డారు. రాజ్యసభ, లోక్‌సభలలో మహిళా సభ్యులకు ప్రాధాన్యమిచ్చే సంప్రదాయం ప్రారంభించడం మంచి ప్రయత్నమన్నారు.

నాంది పలికిన మధ్యప్రదేశ్: పురందేశ్వరి

దేశంలో తొలిసారిగా మధ్యప్రదేశ్ అసెంబ్లీ మహిళా సాధికారతపై కమిటీ ఏర్పాటు చేసిందని తద్వారా మహిళా సాధికారతకు ఆ రాష్ట్రం నాంది పలికిందని పార్లమెంటు మహిళా కమిటీ చైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. 1987లో మధ్యప్రదేశ్ అసెంబ్లీ కమిటీ ఏర్పాటు చేశాక తర్వాత ఇతర రాష్ట్రాలలో కూడా కమిటీలు ఏర్పాటయ్యాయన్నారు. జెండర్ రెస్పాన్సివ్ బడ్జెటింగ్, కొత్తగా ఎదురవుతున్న సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు మహిళలను సన్నద్ధం చేసే విషయంపై చర్చలు జరిగాయన్నారు.

ముగిసిన సదస్సు

తిరుపతి కేంద్రంగా ఆది, సోమవారాల్లో జరిగిన చట్టసభల మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 200 మందికి పైగా ప్రతినిధులు హాజరు కాగా, వారికి జిల్లా యంత్రాంగం ఉన్నతస్థాయి సదుపాయాలను కల్పించింది.

విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యం: గవర్నర్

కేంద్ర, రాష్ట్రాలు తీసుకునే విధాన నిర్ణయాల్లో మహిళలకు సమాన భాగస్వామ్యం ఉండాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆకాంక్షించారు. మహిళా సాధికారతా సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం సీట్ల రిజర్వేషన్ కల్పించే 'నారీ శక్తి వందన' బిల్లు-2023 పార్లమెంటులో ఆమోదం పొందిందని గుర్తు చేశారు. నియోజకవర్గాల పునర్విభజన, కుల గణన తర్వాత ఈ చట్టం అమల్లోకి వస్తుందన్నారు. నారీశక్తి చట్టం అమల్లోకి వస్తే విధాన నిర్ణయాలలో మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించినట్టు అవుతుందన్నారు. మహిళా సాధికారత అనేది మహిళలకు మాత్రమే పరిమితం కాదని.. సమాజాన్ని సమానత్వం, సమగ్ర పౌరసత్వం వైపు నడిపించే మార్గమవుతుందన్నారు. వేదకాలంలో మహిళలకు ఉన్న గౌరవం, ఆధ్యాత్మిక, మేధోపరమైన విద్యావకాశాలు చాలా విశిష్టమైనవని తెలిపారు. పూర్వం సాహిత్యం, సమాజంలో మహిళలకు ప్రాధాన్యత ఉండేదని, కవయిత్రి మొల్ల రచించిన రామాయణం తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. భారత రాజ్యాంగం మహిళలకు అన్ని రంగాల్లోనూ సమాన అవకాశాలను, హక్కులను కల్పించిందన్నారు.

కలసి నడిస్తేనే సాకారం!: అయ్యన్న

సమాజంలో అందరూ కలసికట్టుగా నడిస్తే మహిళల సాధికారత అనే స్వప్నం త్వరలోనే సాకారం అవుతుందని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సదస్సులో జరిగిన చర్చలు, పంచుకున్న అనుభవాలూ దేశంలో మహిళాభివృద్ధికి ఒక కొత్త దిశను, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయన్నారు. మహిళలకు సమాన హక్కులు, రాజకీయాల్లో మరింత ప్రాతినిధ్యం, అన్ని రంగాల్లో సమాన అవకాశాలూ అనేవి కేవలం నినాదాలు కావని, కలసికట్టుగా సాధించుకోవాల్సిన లక్ష్యాలన్నారు. కుటుంబ వ్యవస్థను బలపరచడం, మహిళలను క్రియాశీలంగా మార్చడం ప్రధాన కర్తవ్యాలన్నారు.

నేటి నుంచి ఓపీ బంద్

» బకాయిలు తక్షణమే చెల్లించాలి: ఏపీ స్పెషాలిటీ ఆస్పత్రులు

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో మంగళవారం నుంచి ఓపీ సేవలు నిలిపివేస్తున్నట్లు ఏపీ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవోకు లేఖ రాసింది. 'మేం ఉచిత వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వానికి సహకరిస్తూ వస్తున్నాం. అయితే ఆస్పత్రుల ఆర్థిక భారం నేపథ్యంలో సేవలను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడింది. దాదాపు రూ.2 వేల కోట్లు బకాయిలతో ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే బకాయిలు విడుదల చేయాలి. వారం రోజుల్లోగా ప్రభుత్వం మా సమస్యలను పరిష్కరించాలి' అని ఆసుపత్రుల సంఘం ప్రకటించింది.

ఏపీ నుంచి యూపీ కేడర్‌కు హిమాన్షు కౌశిక్

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏపీ కేడర్ చెందిన 2018 బ్యాచ్ ఐఏఎస్ అధికారి హిమాన్షు కౌశిక్‌ను కేంద్ర ప్రభుత్వం ఉత్తరప్రదేశ్ కేడర్‌కు కేటాయించింది. 2018 బ్యాచ్‌కు చెందిన హిమాన్షు కౌశిక్ ప్రస్తుతం కేంద్ర మంత్రి వద్ద అదనపు ప్రయివేటు సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన 2022 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి దీక్షా జోషిని పెళ్లి చేసుకున్నారు. ఆమె ఉత్తరప్రదేశ్ కేడర్‌కు ఎంపిక అయ్యారు. మ్యారేజ్ గ్రౌండ్స్ కింద యుపీ కేడర్‌కు కేటాయించాలంటూ ఆయన చేసుకున్న దరఖాస్తుపై కేంద్రం స్పందించింది

మార్క్‌ఫెడ్‌కు ఖరీఫ్ పంట సేకరణ బాధ్యతలు

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కనీస మద్దతు ధరకు ప్రస్తుత ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వ సంస్థల తరపున రాష్ట్రంలో పంట ఉత్పత్తుల సేకరణకు ఏపీ మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం నామినేట్ చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కందులు, పెసలు, మినుములు, జొన్న, మొక్కజొన్న, సజ్జ, రాగులు, కొర్రలు, వేరుశనగలను మార్క్‌ఫెడ్ సేకరిస్తుంది.

నడుస్తూ రోడ్డుపైనే కుప్పకూలి..

» గుండెపోటుతో డిగ్రీ విద్యార్థిని మృతి



నందిగామ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అప్పటిదాకా కాలేజీలో శ్రద్ధగా పాఠాలు విని ఇంటికి బయల్దేరిన డిగ్రీ విద్యార్థిని.. నడుస్తూ నడుస్తూనే రోడ్డుపై కుప్పకూలింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా ఆమె గుండెపోటుతో మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. అందరినీ విస్మయానికి గురిచేసిన ఈ ఘటన ఎన్టీఆర్ జిల్లా నందిగామలో సోమవారం జరిగింది. అనాసాగరం గ్రామానికి చెందిన మాగం నాగమణి(18) నందిగామలోని ఒక ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో సీఎం రోడ్డులో స్నేహితురాలితో కలిసి నడుచుకుంటూ వెళ్తు న్న ఆమె ఉన్నట్టుండి కుప్పకూలిపోయింది. దీంతో అక్కడున్న వారు ఆమెను వెంటనే స్థానిక ప్రభు త్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్టు నిర్ధారించిన వైద్యులు ఆమెకు గుండెపోటు వచ్చినట్టు చెప్పారు. నాగమణి మృతి పట్ల అధ్యాపకులు, తోటి విద్యార్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమెకు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవని చెప్పారు. కాలేజీకి బయల్దేరే ముందు గ్యాస్ సమస్య అనిచెప్పి టాబ్లెట్ వేసుకుని వచ్చిందని, సాయంత్రం వరకూ బాగానే ఉందని తెలిపారు.

మూత్ర సంబంధ వ్యాధులపై వైద్య పరిశోధనలు

» ఐఎంఏతో అమెరికా సంస్థ ఇష్ఫైటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలతో నందకిశోర్, సందీప్ తదితరులు

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూత్ర సంబంధిత వ్యాధులు నియంత్రణకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఏపీ శాఖ నడుం బిగించింది. దీనికోసం అమెరికాకు చెందిన ఇష్ఫైటీ రిసెర్చ్ సెంటర్‌తో కీలక ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిశోర్ తెలిపారు. గుంటూరులోని ఐఎంఏ హాల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ నందకిశోర్, ఇష్ఫైటీ రిసెర్చ్ సెంటర్ సీఈవో డాక్టర్ సందీప్ నాదెండ్ల ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. డాక్టర్ నందకిశోర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా దీర్ఘకాల యూరిన్ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్న 300 మంది నుంచి మూత్ర నమూనాలు సేకరించి అత్యంత ఖరీదైన అతి సూక్ష్మస్థాయి మాలిక్యులర్ పీసీఆర్ పరీక్షలు, వివిధ మందుల యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ సంబంధ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా చేసే పరిశోధనల్లో ఈ ఇన్ఫెక్షన్లను ఏ యాంటీబయాటిక్స్ పూర్తిగా నియంత్రిస్తాయో తెలుస్తుందన్నారు. ఇష్ఫైటీ రిసెర్చ్ సెంటర్ సీఈవో డాక్టర్ సందీప్ నాదెండ్ల మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో అత్యాధునిక వైద్య పరీక్షలు, పరిశోధనలు చేస్తున్నట్లు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.